పాలన మారింది.. మాకే అవకాశం

వైసీపీ హయాంలో ప్రాధాన్యం లేని సీట్లకు పరిమితమైన కొందరు ఉద్యోగుల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో ఆశలు చిగురించాయి. గడిచిన ఐదేళ్లుగా అణచివేతకు గురయ్యామన్న ఆవేదన వారిలో ఉంది. దీంతో ప్రాధాన్యం కలిగిన సీటు దక్కడం ఖాయమన్న నమ్మకాన్ని వారు పెంచుకున్నారు. ఆర్‌ఐలుగా వచ్చేందుకు తమ పరిధిలో తాము ప్రజాప్రతినిధుల వద్దకు సిఫారసులు ప్రారంభించారు. కొందరైతే పలానా డివిజన్ తనకు ఖాయమైందని బహిరంగంగానే చెప్పుకొంటున్నారు. ఈనేపథ్యంలో ప్రస్తుత ఆర్‌ఐలు, కొత్తగా వచ్చేందుకు ఆసక్తి చూపుతున్న వారి మధ్య ఇటీవల మాటల యుద్ధం నడిచినట్లు సమాచారం. 'మమ్మల్ని ఎవరు తొలగిస్తారో చూస్తాం' అంటూ వైసీపీ అండదండలతో ఉన్న ఆర్‌ఐలు చాలెంజ్ చేస్తుండగా, మా ప్రభుత్వంలో మాకు ప్రాధాన్యం ఉంటుందని మరికొందరు ధీమాతో ఉన్నారు.

ఆదాయం కోసం ఆరాటం!



కార్పొరేషన్‌లో ఆర్‌ఐ పోస్టులకు డిమాండ్

టీడీపీ నాయకుల ఆశీస్సుల కోసం ప్రయత్నాలు ముమ్మరం
గత వైసీపీ పాలనలో అడ్డగోలుగా వ్యవహరించిన కొందరు
మళ్లీ కొనసాగేందుకు పావులు
కొత్తవారికి అవకాశం ఇవ్వాలంటున్న ఆశావహులు
అవినీతికి ఆస్కారం లేకుండా ప్రక్షాళన వైపు ఎమ్మెల్యే దామచర్ల దృష్టి

ఒంగోలు కార్పొరేషన్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) పోస్టులకు భారీ డిమాండ్ ఏర్పడింది. రెవెన్యూ విభాగం ప్రక్షాళన ఖాయమని తేలడంతో ఆదాయం వచ్చే ఆ సీట్ల కోసం కొందరు ఆరాటపడుతున్నారు. గత వైసీపీ పాలనలో ఆపార్టీ పెద్దల ఆశీస్సులతో పలువురు ఆర్‌ఐలు అక్రమార్జనే ధ్యేయంగా అడ్డగోలుగా వ్యవహరించారు. అడిగినంత చెల్లిస్తేనే ఇంటి పన్ను వేశారు. ముఖ్యంగా డిప్యూటీ మేయర్ బంధువులైన ఇద్దరు కార్యాలయంలో పెత్తనం చెలాయించారు. మేయర్ అండతో ఒక ఆర్‌ఐ రెచ్చిపోయారు. వీరితోపాటు మరికొందరు కూడా అంతా మా ఇష్టం అన్నట్లు వ్యవహరించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో వారు తమ సీట్లను కాపాడుకునే పనిలో పడిపోయారు. తాము నిజాయితీపరులమని, వైసీపీతో తమకు ఎలాంటి సంబంధం లేదంటూ టీడీపీ నేతల వద్దకు రాయబారాలు నడుపుతున్నారు. కొత్తవారికి అవకాశం ఇవ్వాలంటూ మరికొందరు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రస్తుత ఆర్‌ఐలు, కొత్తగా వచ్చేందుకు ఆసక్తి చూపుతున్న వారి మధ్య ఇటీవల మాటల యుద్ధం నడిచినట్లు సమాచారం. మొత్తంగా ఆర్‌ఐల వ్యవహారం కార్పొరేషన్ కార్యాలయంలో చర్చనీయాంశమైంది.

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 28 : ఒంగోలు కార్పొరేషన్‌లో ఐదు విభాగాలు ఉన్నాయి. వాటి ద్వారా పారదర్శకంగా పౌర సేవలను అందించాల్సి ఉంది. అయితే రెవెన్యూ విభాగంలో అవినీతి రాజ్యమేలుతోంది. ప్రత్యేకించి ఆర్‌ఐ పోస్టులకు ఉన్న డిమాండ్ అటు కమిషనర్ స్థాయి అధికారికి కూడా లేదంటే అతిశయోక్తి కాదు. ఇంటి పన్ను విధించాలన్నా, తగ్గించాలన్నా, ఖాళీ స్థలాలకు పన్నులు వేయాలన్నా ఆర్‌ఐలను ప్రసన్నం చేసుకోవాల్సిందే. అదనపు ఆదాయం దండిగా వచ్చే సీటు కావడంతో ఆ పోస్టులకు భారీ డిమాండ్ ఉంటుంది. గత వైసీపీ హయాంలో ఆపార్టీ పెద్దల ఆశీస్సులతో ఆర్‌ఐలుగా కొందరు హవా సాగించారు. అక్రమార్జనే ధ్యేయంగా ముందుకు సాగి కార్పొరేషన్ ఖజానాకు గండికొట్టారు. ఇటీవల ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. ప్రస్తుతం కార్పొరేషన్‌లో కీలకంగా వ్యవహరించే కొందరు అధికారుల మార్పు ఖాయమని తేలిపోయింది. తమ పోస్టులను కాపాడుకునేందుకు వారు పావులు కదుపుతున్నారు. 'ఐదేళ్లుగా ఆర్‌ఐ పోస్టులకు దూరమయ్యాం. ఇకనైనా కొత్త వారికి అవకాశం కల్పించండి' అంటూ మరికొందరు ఉద్యోగులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదేసమయంలో కొందరు దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకుందామనుకున్న రీతిలో భారీగానే చేతివాటం చూపుతున్నారు. ఇంకొందరు ఈ రెండు మూడు నెలలైనా నిజాయితీగా ఉంటే తమ సీటుకు ఢోకా ఉండదన్న భావనలో ఉన్నారు.

గతంలో వైసీపీతో అంటకాగి..

నగరంలో సుమారు 67వేలకు పైగా గృహాలు అధికారికంగా అస్సెస్‌మెంట్‌లు కలిగి ఉన్నాయి. అనధికారికంగా మరో 25వేలకుపైనే ఉన్నట్లు సమాచారం. ఆయా అస్సెస్‌మెంట్‌ల ఆధారంగా నగరంలోని 50 డివిజన్‌లను ఎనిమిది రెవెన్యూ డివిజన్‌లుగా విభజించారు. ఒక్కో డివిజన్ పరిధిలోని నివాసాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఖాళీ స్థలాలు, హోటల్స్ లాడ్జిలు, అపార్ట్‌మెంట్‌లు, విల్లాలకు వారివారి పరిధిలో పన్నులు విధించాల్సి ఉంది. అయితే గత వైసీపీ పెద్దల ఆశీస్సులతో ఆదాయం వచ్చే డివిజన్‌లకు ఆర్‌ఐలుగా ఉన్న వారు ఇప్పుడు వారి సీటును కాపాడుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అందులో ఇద్దరు ఆర్‌ఐలు డిప్యూటీ మేయర్ బంధువులుగా ఐదేళ్లపాటు కార్యాలయంలో పెత్తనం చెలాయించారు. అడిగినంత ముట్టచెప్తేనే పన్ను విధించారు. అది కూడా వేల నుంచి లక్షల రూపాయలు వసూలు చేశారు. అనధికారమైనా, ప్లాను ఉన్నా, లేకున్నా, కోర్టులో ఉన్నా సరే వారు అడిగింది చెల్లించుకోవాల్సిందే. అయితే తాజాగా పాలన మారడంతో తాము నిజాయితీపరులమని, వైసీపీతో తమకు ఎలాంటి సంబంధం లేదంటూ ప్రస్తుత పాలకుల వద్దకు రాయబారాలు నడుపుతున్నారు.

మేయర్ అండతో బిల్డర్ అవతారం ఎత్తిన ఆర్‌ఐ

వైసీపీకి చెందిన మేయర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న మరో ఆర్‌ఐ చేతివాటానికి అడ్డూఅదుపు లేదు. గతంలో ఓ బిల్డింగ్ యజమాని నుంచి భారీగా లంచం డిమాండ్ చేయడంతో సదరు బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఆర్‌ఐ త్రుటిలో తప్పించుకోగా మరో ఉద్యోగి దొరికిపోయాడు. ఈ విషయం కార్యాలయం మొత్తం తెలిసినా మేయర్ మనిషికావడంతో ఎవరూ నోరు మెదపలేదు. నగరానికి చెందిన ఓ బ్యాంకు అధికారి మామిడిపాలెంలోని తన ఇంటికి పన్ను వేయాలని కోరగా ప్లాను ఉన్నప్పటికీ అడిగినంత ఇవ్వలేదన్న అక్కసుతో ప్లాను చించివేసి రెట్టింపు పన్ను విధించారు. ఆదాయం చాలదన్నట్లుగా ఆ ఆర్‌ఐ బిల్డర్‌గా అవతారం ఎత్తాడు. దీన్నిబట్టి ఆర్‌ఐ పోస్టుకు ఉన్న ఆదాయం ఏపాటిదో అర్థమవుతుంది. అయితే వీరు తిరిగి వారి వారి సీట్లు కాపాడుకునేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే వీరినే కొనసాగిస్తే భరించే పరిస్థితి లేదని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

సమాచారం సేకరించుకున్న ఎమ్మెల్యే దామచర్ల

కార్పొరేషన్‌లో పౌర సేవలు. పాలనా వ్యవహారాల్లో అవినీతికి ఆస్కారం లేకుండా చూడడంపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టి సారించారు. కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో చోటుచేసుకున్న అవినీతిపై ఆరా తీశారు. గత ఐదేళ్ల నుంచి ఆర్‌ఐలుగా కొనసాగుతున్న వారి జాబితాను ఆయన తీసుకున్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వ అండదండలతో వారు వ్యవహరించిన తీరు, అవినీతి గురించి ఆయన సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. ప్రక్షాళన తప్పదన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలన్నదే లక్ష్యంగా ఆయన ముందడుగు వేస్తున్నట్లు తెలిసింది. కొద్దిరోజుల క్రితం కార్పొరేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించిన దామచర్ల.. అవినీతి ఆర్‌ఐలను సున్నితంగా హెచ్చరించినట్లు తెలిసింది. మొత్తంగా ఆదాయ పోస్టుల కోసం ఆర్‌ఐల ఆరాటం చూస్తుంటే పన్నుల రూపంలో ప్రజల నుంచి భారీగానే ముడుపులు వస్తాయన్న విషయం తేటతెల్లమవుతోంది.


నగర కార్పొరేషన్ కార్యాలయం

వైసీపీ యువనేత అనుచరుడు అరెస్టు

ప్రతాప్‌రెడ్డిపై రౌడీషీట్
వివరాలు వెల్లడించిన ఒంగోలు తాలూకా ఇన్‌చార్జి సీఐ ఖాజావలి



మాట్లాడుతున్న సీఐ ఖాజావలి

ఒంగోలు (క్రైం), జూలై 28 : వైసీపీ యువనేత అనుచరుడు, ఇటీవల ఒంగోలులోని మసాజ్ సెంటర్‌లో పోలీసులకు పట్టుబడి తప్పించుకున్న మార్పూరి ప్రతాప్‌రెడ్డిపై రౌడీషీట్ తెరిచారు. ఆయన్ను అరెస్టు చేశారు. వివరాలను ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులకు తాలూకా ఇన్‌చార్జి సీఐ ఖాజావలి వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. ఈనెల 20న స్థానిక పాత గుంటూరు రోడ్డులో ఉన్న గుప్తాస్ మిడివిన్‌లోని సార స్పా సెంటర్‌పై పోలీసులు దాడి చేశారు. ఆ సమయంలో స్పా సెంటర్ నిర్వాహకుడు కిమిడి పవన్‌కుమార్‌కు కొత్తపట్నం మండలం రాజుపాలేనికి చెందిన మార్పూరి ప్రతాప్‌రెడ్డి ఎక్కువ మొత్తంలో నగదు చెల్లించి యువతులతో శృంగారం కోసం వేచి ఉన్నాడు. దీంతో పోలీసులు ప్రతాప్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో అతను విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌ను నెట్టివేసి పరారయ్యాడు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ప్రతాప్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై విజయకుమార్, క్రైం పార్టీ సిబ్బంది కె.రామకృష్ణ, ఆర్.రాంబాబు, కె.రవికుమార్ పాల్గొన్నారు.

ఒకరోజు శిక్షణకు కలెక్టర్

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 28 : హైదరాబాద్‌లో సోమవారం ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొననున్నారు. అందుకోసం ఆమె హైదరాబాద్ వెళ్లారు.

మంత్రికి తప్పిన ప్రమాదం

అమ్మవారి ఊరేగింపులో ఫొటో దిగుతుండగా
ముందుకు దూకిన ఎద్దులు
తూలిపడిపోవడంతో స్వల్ప గాయాలు


ముందుకు పడిపోతున్న మంత్రి స్వామి

మెయిన్‌లో...

బందోబస్తు నడుమ ముండ్లమూరు మండల సమావేశం

లోపలి పేజీల్లో..

మట్టి దొంగలపై చర్యలు మృగ్యం


వైసీపీ హయాంలో బొట్లపాలెం పశువుల మేత భూమిలో మట్టి తోడగా పడిన గోతులు

ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు
కొండలనూ కొల్లగొట్టిన వైసీపీ నాయకులు
విచారణ పేరుతో కాలయాపన చేస్తున్న అధికారులు
వారి తీరుపై ప్రజల విస్మయం

దర్శి, జూలై 28 : వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మట్టి దోపిడీపై చర్యలు తీసుకునే విషయంలో అధికారులు మీనవేషాలు లెక్కిస్తున్నారు. విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దర్శి ప్రాంతంలో కోట్లాది రూపాయల విలువచేసే మట్టి అక్రమంగా తరలించి అమ్ముకున్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. కొన్నిగ్రామాల ప్రజలు ఫిర్యాదు చేయడంతో ఏడాది క్రితం విచారణ చేపట్టారు. ఇప్పటివరకూ అది పూర్తి కాలేదు. మండలంలోని బొట్లపాలెం రెవెన్యూలోని పశువుల మేత పోరంబోకు భూమిలో సుమారు 30 ఎకరాల్లో అక్రమార్కులు మట్టిని కొల్లగొట్టారు. వందలాది టిప్పర్లలో యథేచ్ఛగా తరలించారు. సుమారు 50 అడుగుల లోతు గోతులు తవ్వారు. వైసీపీ నాయకులు అక్కడ అక్రమంగా తవ్విన మట్టిని జగనన్న కాలనీలకు సరఫరా చేసి సొమ్ము చేసుకున్నారు. మరికొంత మట్టిని అక్రమంగా వేసిన లేఅవుట్లకు తోలి కాసులు పండించుకున్నారు. అలాగే దర్శి కొండ మట్టిని యథేచ్ఛగా తవ్వారు. తానంచింతల, చందలూరు కొండల మట్టినీ కొల్లగొట్టారు. దర్శిలో వేసిన అక్రమ వెంచర్లను పరిశీలిస్తే ఎక్కడ చూసినా ఆ కొండల మట్టే కనిపిస్తోంది. అధికారుల నిర్లక్ష్యంతోనే మట్టి దోపిడీ జరిగిందనే ఫిర్యాదులు ఉన్నతాధికారులకు వెళ్లాయి ఈ నేపథ్యంలో ఎవరిపాత్ర ఎంత అన్నది తేలాల్సి ఉంది. ఇప్పటికే బొట్లపాలెం పశువుల మేత పోరంబోకు భూమిలో మట్టి అక్రమ తవ్వకాలపై విచారణ జరుగుతోంది. కొండలమట్టిని కొల్లగొట్టిన అక్రమార్కులను, వారికి సహకరించిన అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


తానంచింతలలో తవ్వేసిన కొండమట్టి

పొగాకు రైతులూ తస్మాత్ జాగ్రత్త!

కర్ణాటకలో పొగాకు పంట ఆశాజనకం
ఉత్పత్తి 100 మిలియన్ కిలోలు దాటే అవకాశం
దక్షిణాదిన వచ్చే సీజన్‌లో మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం
ఇక్కడ అధికంగా సాగు చేయొద్దని బోర్డు అధికారుల సూచన

ఒంగోలు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులూ తస్మాత్ జాగ్రత్త! కర్ణాటక రాష్ట్రంలో ప్రస్తుత సీజన్ పొగాకు పంట ఆశాజనకంగా కనిపిస్తోంది. అక్కడ పొగాకు సాగు చేసి రెండు మాసాలు గడుస్తోంది. ప్రస్తుతం ఆకు రెలుపునకు రైతులు సిద్ధమవుతున్నారు. గత రెండేళ్లుగా కర్ణాటకలో పొగాకు పంట తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కోగా ప్రస్తుత సీజన్‌లో వాతావరణం అనుకూలించింది. తోటలు ఏపుగా పెరగడంతోపాటు నాణ్యత కూడా బాగా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే గత రెండేళ్లతో పోల్చితే ఈ ఏడాది అక్కడ పంట దిగుబడి కూడా పెరిగే అవకాశం ఉంది. ఇది వచ్చే సీజన్‌లో మన మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు బోర్డు అనుమతించిన విస్తీర్ణం, పరిమాణంలోనే పంట సాగు చేయాలని అధికారులు కోరుతున్నారు.

మూడేళ్లుగా అక్కడ తగ్గిన ఉత్పత్తి.. ఇక్కడ డిమాండ్

కర్ణాటకలో గత మూడు, నాలుగేళ్లుగా వంద మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇస్తుండగా ఎంతో కొంత తక్కువగానే పండుతోంది. అందులో 2022-23 సంవత్సరంలో గణనీయంగా తగ్గింది. ఆ ఏడాది కేవలం 60 మిలియన్ కిలోల దిగుబడి మాత్రమే వచ్చింది. బోర్డు అనుమతించిన పరిమాణంలో 40శాతం ఉత్పత్తి తగ్గింది. 2023-24లో కూడా వంద మిలియన్ కిలోలకు బోర్డు అనుమతివ్వగా 83 మిలియన్ కిలోలు పండింది. ధర గరిష్ఠంగా కిలో రూ.289 పలికింది. చివరకు సగటు ధర కిలో రూ.254 లభించింది. అలా కర్ణాటకలో పంట ఉత్పత్తి తగ్గడం ఆంధ్రలోని ప్రత్యేకించి దక్షిణాది రైతులకు లభించింది. కర్ణాటకలో పూర్తయిన వెంటనే రాష్ట్రంలోని దక్షిణాది ప్రాంతంలో వేలం ప్రారంభం అవుతుంది. అక్కడ ఉత్పత్తి తగ్గిన ప్రభావంతో ఎగుమతుల అవసరాల మేరకు ఈప్రాంతంలో పంట కొనే వారు పోటీ పడటంతో మంచి ధరలు లభించాయి.

ప్రస్తుతం భిన్న పరిస్థితి

ప్రస్తుత సీజన్ చూస్తే పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. రాష్ట్రంలోని దక్షిణాది ప్రాంతంలో ఇంకా రైతుల వద్ద మూడో వంతు పంట నిల్వ ఉండగా కర్ణాటకలో ఆకు రెలుపు, క్యూరింగ్ సమయం వచ్చింది. కొన్ని చోట్ల క్యూరింగ్ కూడా చేస్తున్నారు. ఈ ఏడాది కర్ణాటకలో వంద మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతివ్వగా 100నుంచి 102 మిలియన్ కిలోలు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే అక్కడ వాతావరణం అనుకూలించడం, ప్రస్తుతం తోటలు ఏపుగా పెరుగుతున్న తీరును పరిశీలిస్తే 110 మిలియన్ కిలోల వరకూ పండవచ్చని వ్యాపార, ఇతరవర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. అంటే గత ఏడాది కన్నా దాదాపు 30 మిలియన్ కిలోలు, అంతకుముందు ఏడాది కన్నా 50 మిలియన్ కిలోలు అధికంగా ఉత్పత్తి రావచ్చన్న విషయం స్పష్టమతోంది.

మన ప్రాంతంపై తీవ్ర ప్రభావం

కర్ణాటకలో ఉత్పత్తి పెరిగితే ఆ ప్రభావం రాష్ట్రంలో ప్రత్యేకించి దక్షిణాది ప్రాంతంపై తీవ్రంగానే చూపే అవకాశం ఉంటుంది. ఇక్కడ గత సీజన్‌లో పండిన పంట ఇంకా భారీగా కొనుగోలు చేయాల్సి ఉండగా కర్ణాటకలో కూడా అధికంగా పండితే వచ్చే ఏడాది దక్షిణాది మార్కెట్‌ను అది ప్రభావితం చేసి వ్యాపారులు ధరలు తగ్గించే అవకాశం ఉంటుందని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. ఈ పరిస్థితుల్లో దక్షిణాది రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ప్రత్యేకించి వచ్చే సీజన్‌లో పంట సాగు, ఉత్పత్తి విషయంలో ఎంత పరిమితంగా ఉంటే అంత మంచిదన్న అభిప్రాయాన్ని ఆ రంగంలో అనుభవజ్ఞులు తెలియజేస్తున్నారు. అదే సమయంలో అనుమతించిన మేర మాత్రమే పంట సాగు, ఉత్పత్తికి పరిమితం కావాలని బోర్డు అధికారులు సూచిస్తున్నారు.


కర్ణాటకలో ఏపుగా పెరుగుతున్న పొగాకు తోట

పాలిటెక్నిక్‌లో పడిపోయిన ప్రవేశాలు

కేవలం 45శాతం సీట్లు మాత్రమే భర్తీ
ఖాళీగా ఉన్నవి 1,273
ప్రభుత్వ కళాశాలల్లోనే ఎక్కువ అడ్మిషన్లు

ఒంగోలు (విద్య), జూలై 28 : ఉమ్మడి జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు అంతంతమాత్రంగానే జరిగాయి. పాలిసెట్ తొలి, మలివిడత కౌన్సెలింగ్‌లలో కేవలం 45శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 2,320 సీట్లు ఉండగా పాలిసెట్-24 తుది దశ కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత కేవలం 1,047 మంది మాత్రమే ప్రవేశాలు పొందారు. 1,273 సీట్లు మిగిలిపోయాయి. ప్రభుత్వ కళాశాలల్లోనే అడ్మిషన్లు మెరుగ్గా ఉన్నాయి. అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 120 సీట్లు ఉండగా 94 (78శాతం) భర్తీ అయ్యాయి. కంప్యూటర్ సైన్స్‌లో 32, ఎలక్ట్రానిక్స్‌లో 62 మంది ప్రవేశాలు పొందారు. ఈతముక్కల ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 100 సీట్లు ఉండగా 76మంది చేరారు. కంప్యూటర్ సైన్స్‌లో 32మంది, ఎలక్ట్రానిక్స్‌లో 33మంది, సీపీసీ బ్రాంచిలో 11 మంది అడ్మిషన్లు పొందారు. ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మొత్తం 360 సీట్లు ఉండగా 149 మంది చేరారు. ఈ కళాశాలలో సివిల్, మెకానికల్‌లో 60 సీట్లచొప్పున 120 ఉన్నాయి. ఉదయం, మధ్యాహ్నం షిఫ్ట్‌లలో తరగతులు జరుగుతాయి. అసలు సెకండ్ షిఫ్ట్‌లో విద్యార్థులు చేరలేదు. ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉన్న కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్ బ్రాంచిలు ఇక్కడ లేకపోవడం ఈ కళాశాలలో అడ్మిషన్లకు పెద్దఅవరోధంగా మారింది. నాలుగు దశాబ్దాల క్రితం ప్రారంభమై మంచిపేరు ఉన్న ఈ కళాశాలలో వివిధ జిల్లాల విద్యార్థులు చదువుతున్నారు. కానీ ఈ ఏడాది ఆయా బ్రాంచిలో ఆశించిన స్థాయిలో చేరలేదు. కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 120 సీట్లు ఉండగా కేవలం 12 మాత్రమే భర్తీ అయ్యాయి. సివిల్‌లో మూడు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో తొమ్మిది మంది చేరారు. ఆరు ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో 36శాతం, 58శాతం, 38శాతం, 50.6శాతం, 29శాతం, 37శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి.



31న స్పాట్ అడ్మిషన్లు

ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీచేసేందుకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి, ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ పీవీఎల్ఎన్ శివప్రసాద్ తెలిపారు. పాలిసెట్ రాయని వారు 10వ తరగతి కంపార్టుమెంటల్ పాసైన వారు చేరవచ్చన్నారు.

పాఠశాలల్లో డిజిటల్ సేవల పెంపుపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 28: ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలల్లో డిజిటల్ సేవలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. గత ఐదేళ్లలో ఏర్పాటు చేసిన పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎన్ని పాఠశాలలు గుర్తించారని, సేవలను పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని అన్నారు. దీనిపై కేంద్ర విద్యాశాఖ సహాయక మంత్రి జయంత్‌చౌదరి సమాధానం ఇస్తూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ప్రకారం సాంకేతికతను నేర్చుకోవడం, మూల్యాంకనం ప్రక్రియ వృద్ధికావడం, భాష అడ్డంకులు తొలగడం, ఉపాధ్యాయుల నైపుణ్యం, సమర్థత పెరగడం, దివ్యాంగుల విద్యాప్రవేశాలు పెరుగుదల, విద్యాప్రణాళిక, నిర్వహణ తదితర అంశాలను మెరుగుపర్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 2687 ల్యాబ్‌లు, 5190 సమర్థవంత తరగతి గదులు ఏర్పాటు అయ్యాయని కేంద్రమంత్రి వివరణ ఇచ్చారు.

సీఎం చంద్రబాబును కలిసిన మాగుంట

వికసిత్ భారత్-2047 లక్ష్య సాధన కోసం రూట్‌మ్యాప్ తయారు చేసేందుకు ఆదివారం ఢిల్లీలో రాష్ట్రపతిభవన్ జరిగిన సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో చంద్రబాబు పాల్గొనేందుకు రాగా మాగుంట కలిసి బొకే అందజేశారు.


చంద్రబాబుకు నమస్కరిస్తున్న మాగుంట

పోలేరమ్మ కొలుపుల్లో 'పోతుల' పూజలు

పాలేటిపాడు(టంగుటూరు) జూలై 28 : జరుగుమల్లి మండలం పాలేటిపాడులో జరుగుతున్న పోలేరమ్మ తల్లి కొలుపుల్లో భాగంగా ఆదివారం నాటి ముగింపు కార్యక్రమంలో కొండపి మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు పాల్గొన్నారు. స్థానికుల ఆహ్వానం మేరకు హాజరైన పోతుల టీడీపీ నాయకులతో కలసి గుడిలో పూజలు చేశారు. ఈ సందర్భంగా పోతులనూ సత్కరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ బెల్లం సత్యం, పోతుల ప్రధాన అనుచరులు చిడిపోతు కోటేశ్వరరావు, కసుకుర్తి శ్రీధర్ పాల్గొన్నారు.


పోతుల రామారావును సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

యువకుడి అనుమానాస్పద మృతి

ఒంగోలు(క్రైం), జూలై 28: ఒంగోలు నగరం కేశవరాజుకుంటకు వెళ్లే దారిలో ఉన్న చెరువులో గుర్తుతెలియని మృతదేహం కలకలం రేపుతోంది. ఆదివారం చెరువులో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం అందించి దానిని బయటకు తీశారు. సుమారు 35 ఏళ్ల వయస్సు గల యువకుడిగా పోలీసులు గుర్తించారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు కనిపించడం లేదు. సుమారుగా రెండు రోజులు క్రితం మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అయితే మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదు. ఈమేరకు మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

అనేక అనుమానాలు : చెరువు లోతు ఐదు అడుగుల కంటే లేదు. దీంతో ఒక వేళ జారి పడినా బయటకు వచ్చే అవకాశం ఉంది. మృతదేహంపై పైకి కనిపించే గాయాలు లేవు. అయితే ఎవరైనా మృతదేహాన్ని తీసుకువచ్చి చెరువులో పడవేసారా అనే అనుమానాలు కూడా కలుగుతున్నాయి. ఆప్రాంతంలో రాత్రులు చెరువుగట్టు పైన మద్యం సేవించేందుకు ఎక్కువ మంది వెళుతుంటారని స్థానికులు చెబుతున్నారు. దర్యాప్తులో అనిన విషయాలు వెలుగుచూస్తాయని పోలీసులు చెబుతున్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి సేవలు ఆదర్శనీయం



అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న సభ్యులు

చీమకుర్తి, జూలై 28: రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి సేవలను ఆదర్శనీయంగా అందిస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు కడవా రామకృష్ణ, కందుకూరి వెంకటసుధాకర్ తెలిపారు. రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారమహోత్సవం ఆదివారం స్థానిక డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు ఇండోర్‌స్టేడియంలో నిర్వహించారు. అధ్యక్షులుగా రామకృష్ణ, ప్రధానకార్యదర్శిగా కందుకూరి వెంకటసుధాకర్, కోశాధికారిగా శంకర్ ప్రమాణం చేశారు. ముఖ్యఅతిథులుగా టి.రాజశేఖర రెడ్డి, మహ్మద్‌రఫీ, కొల్లా శింగారావు, అద్దంకి దేవప్రసాదరావు హాజరై ప్రసంగించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకూరి రఘుకిరణ్ పర్యవేక్షణలో అందిస్తున్న సేవలను ప్రశంసించారు. విద్యా, వైద్య, సామజికరంగాలలో అందించిన విశేషసేవలను కొనియాడారు. తదుపరి పలు సేవాకార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు చెరుకూరి రఘుకిరణ్, గొల్లపూడి వెంకట్రావు, మన్నం నాగరాజు, యడ్లపల్లి రామబ్రహ్మం, అంబటి వీరారెడ్డి, గుండా చినవెంకటేశ్వర్లు, పరాంకుశం శ్రీనివాసమూర్తి, రామకృష్ణారెడ్డి, అడుసుమల్లి శ్రీనివాసరావు, వాసి వెంకటేశ్వర్లు, నాగళ్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి


ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గాయకులు

ఒంగోలు (కల్చరల్), జూలై 28: శ్రీవాసవి మెలోడీస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన పలువురు గాయకులు పలు గీతాలను శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను మైమరపింపజేశారు. ముందుగా ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంస్థ కార్యవర్గ ప్రతినిధులు సోమశిల స్వర్ణలత, బాలాజీ, ఎ.అశోక్, పి.రంగనాథం, జి.శివప్రసాద్, తన్నీరు బాలాజీ, డి.వెంకటేష్, ఆర్.గోపాలరావు, గౌస్‌బాషా, మా మూర్తి, కనకారావు, పి.శ్రావ్యరెడ్డి, యశోద, పి.పద్మ, డి.శైలజ, డి.ఉషారాణి, సుహాసిని తదితరులు పాటలు పడారు. గుర్రం కృష్ణ వ్యాఖ్యానం అందించగా, నెల్లూరు శివ ట్రాక్స్ అందజేశారు.

లైబ్రరీలో చదవడం నాకిష్టం

టంగుటూరు, జూలై 28 : టంగుటూరు గ్రంథాలయంలో ఆదివారం చదవడం నాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు కథల పుస్తకాలు చదివారు. గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధనరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, జూలై 28: ముండ్లమూరు గ్రామానికి చెందిన ఖాజావలి ద్విచక్ర వాహనంపై అద్దంకి వెళ్తుండగా పోలవరం సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. దీంతో ఖాజావలికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం.. పలువురికి గాయాలు

దొనకొండ, జూలై 28: దొనకొండలోని పలు ప్రాంతాల్లో గత రెండు రోజులుగా పిచ్చికుక్క స్వైర విహారం చేస్తున్నది. ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడితో పాటు అనేకమందిని గాయాలపాలు చేసింది. ఇటీవల కాలంలో గుంపులు గుంపులుగా శునకాలు వీధుల వెంట సంచరిస్తున్నాయి. వీటిలో ఏది పిచ్చికుక్క అర్థంకాక ప్రజలు ఆందోళనలు చెందుతున్నారు. గ్రామ పంచాయితీ పాలకులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మంత్రి స్వామి ● పొన్నలూరు సర్పంచ్, వార్డుమెంబర్లు, సుందర్‌నగర్ వైసీపీ వార్డు సభ్యురాలు టీడీపీలో చేరిక


పొన్నలూరు సర్పంచ్, వార్డుసభ్యులకు కండువాలు వేసి స్వాగతిస్తున్న మంత్రి స్వామి


సునీతను పార్టీ కండువాతో ఆహ్వానిస్తున్న మంత్రి

పొన్నలూరు(కొండపి), జూలై 28: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద పొన్నలూరు సర్పంచ్ పాలపర్తి శాంతితో పాటు, 9వ వార్డు మెంబర్ లింగంగుంట నరసింగరావు, వైసీపీ నాయకుడు పాలపర్తి పెదఅంజయ్య ఆధ్వర్యంలో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. కార్యక్రమంలో పొన్నలూరు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్, జిల్లా తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి మండవ మురళి, నాయకులు మండవ వెంకటేశ్వర్లు, మండవ వెంకటేష్, కంచర్ల బ్రహ్మయ్య పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ వార్డు సభ్యురాలు

సింగరాయకొండ: సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని సుందర్‌నగర్‌కు చెందిన వైసీపీ 1వ వార్డు సభ్యురాలు పొట్లూరి సునీత ఆ పార్టీని వీడారు. ఆదివారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి స్వామి ఆమెకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సుందర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను విలీనం పేరుతో మూసివేసి గిరిజనులకు విద్యను దూరం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వారంలోపే ఆ పాఠశాలను పునఃప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, మించల బ్రహ్మయ్య, సుదర్శి చంటి, ఇమ్మిడిశెట్టి రామారావు, యస్దాని, షేక్ సనావుల్లా తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ అమరజవానులను స్మరించుకోవాలి

మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఒంగోలు(రూరల్), జూలై 28: కార్గిల్‌యుద్ధంలో అమరులైన జవానులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ సైనికుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నిప్పల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఒంగోలులోని అంబేద్కర్‌భవన్‌లో ఆదివారం కార్గిల్‌విజయ్‌దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కార్గిల్ విజయోత్సవస్థూపం వద్ద మాజీ సైనికులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సభలో నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో మన సైనికులు పాకిస్థాన్ సైనికులను తరిమికొట్టారన్నారు. దేశ సైనికులు ప్రాణాలను సైతం లెక్క చేయలేదని చెప్పారు. మన సైనిక వ్యవస్థ ప్రపంచ దేశాలకు దీటుగా ఉందన్నారు. కల్నల్ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కూడా ఎన్‌డీఏలో ప్రవేశాలు పొందాలన్నారు. తెలుగువారి సంఖ్య దేశ సైనికవ్యవస్థలో బలంగా ఉండాలని, మాజీ సైనికులు తమ పిల్లలను సైన్యంలోకి ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా 70 ఏళ్లు నిండిన మాజీసైనికులను శాలువలతో సత్కరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సైనికులు ఆలపాటి వెంకటేశ్వరరావు, రాజేష్‌కన్నా, దర్శి కోటేశ్వరరావు, చుండూరి శ్రీరామమూర్తి, పాశం వెంకటరెడ్డి, క్యాంటీన్ మేనేజర్ గుమ్మడి వెంకట్రావు, డాక్టర్ ధీరజ్, సైనిక సంక్షేమశాఖ అధికారి రజనికుమారి పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

● యూఎంఅండ్‌హెచ్‌ఈయూ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 28: వైద్యఆరోగ్య శాఖలో పనిచేస్తున్న వివిధ క్యాడర్ల కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు రెగ్యులర్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (యూఎంఅండ్‌హెచ్‌ఈయూ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు కోరారు. ఒంగోలులోని నందూరి ప్రసాదరావుభవన్‌లో ఆదివారం జరిగిన యూనియన్ జిల్లా కమిటీ మహాసభలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయ ఆరోగ్య కార్యకర్తల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వై.సుభాషిణి మాట్లాడుతూ సచివాలయ ఏఎన్ఎంలను గ్రేడ్-2గా ఉద్యోగోన్నతికి కల్పించాలన్నారు. వారందరినీ వైద్యఆరోగ్యశాఖలో విలీనం చేయాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ నాయకులు అప్పలరాజు మాట్లాడుతూ వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులు ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జి.నాగేశ్వరరావు, ప్రధానకార్యదర్శి కె.శ్రీధర్‌బాబు, వై.సురేష్‌బాబు, జె.వెంకటేశ్వరరెడ్డి, భరత్‌భూషణ్, బి.కృష్ణ, ఎం.రమణమూర్తి, ఇధనలక్ష్మి, కె.జయకుమారి, జి.అంజనీదేవి, బి.వెంకటేష్, సి.శారద, ఆర్.కృష్ణకుమారి, వై.వెంకట్, మంత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు రూ.10వేల కోట్లు ప్రకటించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 28 : కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి అప్పుల మూట తప్ప గ్రాంటు ఏమీ ఇవ్వలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్ ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు రూ.10వేల కోట్ల ప్యాకేజీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలు నగరం సాగర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నగర కార్యదర్శి జి.రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ సామాన్యులకు, మధ్యతరగతి వర్గాలకు ఉపయోగపడే విధంగా లేదన్నారు. కార్పొరేట్ వర్గానికి, సంపన్నులకు ప్రయోజనం చేకూర్చేలా ఉందని ఆరోపించారు. ఆహార సబ్సిడీలపై కోత పెట్టడంతో పాటు ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించారని విమర్శించారు. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు అప్పు ఇస్తామని చెప్పారే తప్ప గ్రాంటు ఇవ్వడానికి బడ్జెట్‌లో ప్రతిపాదన ఏమి లేదన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్రానికి నిధులు తేవడంతో విఫలమయ్యారని చెప్పారు. రాజధాని నిర్మాణం, పోలవరం నిర్మాణానికి నిధుల గ్రాంట్ల రూపంలో ఇవ్వాలి తప్ప అప్పుల రూపంలో కాదన్నారు జిల్లాను వెనుకబడిన ప్రాంతంగా గుర్తిస్తూ చేసి ప్రతిపాదన ఆహ్వానించ విషయమేనని, అయితే నిధుల పరిస్థితి ఏమి చెప్పలేదన్నారు. అందువల్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు జీవీ.కొండారెడ్డి, ఎస్‌కే.మాబు, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్, ఉసా వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు సీపీఎం ఆఫీసు నుంచి సాగర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా శ్రీనాంచారమ్మతల్లి తిరునాళ్ల


గ్రామంలో అమ్మవారి ప్రతిమల ఊరేగింపు


శిడిమాను ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపట్నం(ఒంగోలునగరం)జూలై 28: కొత్తపట్నంలో వేంచేసి ఉన్న శ్రీ నాంచారమ్మ అమ్మవారి తిరునాళ్ల ఆదివారంతో ఘనంగా ముగిసింది. శని, ఆదివారాల్లో వేలాది సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శనివారం రాత్రి తిరునాళ్లలో భారీ ఎత్తున బాణసంచాను కాల్చారు. విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. నాంచారమ్మ అమ్మవారి ప్రతిమను ప్రభపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. పురవీ ధుల్లో అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూకట్టారు. ఆదివారం భక్తులు పసుపుకుంకుమ బళ్ళు కట్టుకుని అమ్మవారి దేవాలయం వరకు సాగారు. పసుపుకుంకుమలను గ్రామంలో పంచిపెట్టారు. శిడిమాను ఉత్సవం వైభ వంగా జరిపారు. తిరునాళ్ళ సందర్భంగా కొత్తప ట్నం గ్రామస్థులు ఇతర ప్రాంతాల్లో ఉన్న తమ బంధువులను ఆహ్వానించారు. కొత్త దుస్తులను అందజేశారు. తిరునాళ్ళకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో విచ్చేశారు. కొత్తపట్నం-ఒంగోలు రహదారిలో వాహనాల రద్దీ పెరిగింది.

అవీ.. ఇవీ..

అనంతవరంలో మౌలిక వసతుల కల్పనకు మంత్రి హామీ

తూర్పునాయుడుపాలెం(టంగుటూరు) జూలై 28 : మండలంలోని అనంతవరంలో విడతల వారీగా మౌలిక వసతులు కల్పిస్తామని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి హామీ ఇచ్చారు. అనంతవరం ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలసి తమ గ్రామ సమస్యలను ఆయనకు వివరించారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని వారంతా మంత్రిని కోరారు. అలాగే శ్మశానం అస్తవ్యస్తంగా ఉందని, స్థలం ఉన్నా వసతులు కరువయ్యాయని తెలిపారు. దీనిపై మంత్రి సమాధానమిస్తూ వెంటనే శ్మశానంలో రెండు షెడ్లు, బోరు నిర్మిస్తామని, ప్రహరీ 4ఏళ్ల ప్రభుత్వ కాలంలో నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ధ్వంసం చేసిన పాఠశాల భవన స్థలంలోనే కొత్తగా మరో భవనం నిర్మించాలని, పాఠశాల భవనం చుట్టూ ప్రహరీ కావాలని కోరారు. తాగునీటి సరఫరాతో పాటు గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సభ్యులు కోరగా సాధారణ డ్రైనేజ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలసిన వారిలో ఎంప్లాయిస్ అసోసియేషన్ చైర్మన్, పశుసంవర్ధక శాఖ అధికారి కసుకుర్తి బ్రహ్మయ్య, అలహాబాద్ బ్యాంకు రిటైర్డ్ అధికారి కసుకుర్తి రామలింగం, స్టేట్ బ్యాంకు రిటైర్డ్ అధికారి యరమాల కోటేశ్వరరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కసుకుర్తి సుబ్బారావు, పంచాయతీ రాజ్ ఈఈ యరమాల కోటేశ్వరరావు, పోలీస్ కానిస్టేబుల్ మిడసల శ్రీనివాసరావు ఉన్నారు.

7న మార్కాపురం జిల్లా కోసం రౌండ్‌టేబుల్ సమావేశం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 28: మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలని, అలాగే కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపాలని కోరుతూ ఆగస్టు 7వ తేదీన ఒంగోలులోని బీసీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినందున వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రానికి మార్కాపురం డివిజన్‌లోని పలు నియోజకవర్గాలు దూరంగా ఉన్నందున ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆదాయ పన్ను చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 28: నూతన ఆదాయ పన్ను చట్టసవరణ అంశాలపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని సుపరిపాలన వేదిక జిల్లా కార్యదర్శి చిట్టెం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి విద్యాకేంద్రంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వేదిక ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు మాగులూరి నాగేశ్వరరావు, ఆడిటర్ సి.రాజేష్‌లు వేదిక చేపట్టే కార్యక్రమాలను వివరించారు. కోశాధికారి చెక్కా రంగనాథం మాట్లాడుతూ ఆదాయ, వ్యయ పత్రాలను సమావేశంలో సమర్పించారు. కార్యక్రమంలో గోపాలరెడ్డి, ఎంవీ.శేషయ్య, డాక్టర్ షాకీర్, తోటపల్లి రంగారావు, నరసయ్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న శ్రీరామమూర్తి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 28 : జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో డొక్కా సీతమ్మ పేరుతో పేదలకు అన్నదానం చేసేందుకు క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని టీడీపీ సీనియర్ నాయకులు, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ డైరెక్టర్ టీవీ.శ్రీరామమూర్తి పేర్కొన్నారు. జనసేన పార్టీ ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ జడ బాలనాగేంద్రయాదవ్ ఆధ్వర్యంలో స్థానిక డొక్కా సీతమ్మ క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని శ్రీరామమూర్తి ప్రారంభించారు. డొక్కా సీతమ్మ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి పేద ప్రజల ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో కుటుంబంతో కలిసి తాను బతికిఉన్నంత కాలం ఉచితంగా అన్నదానం చేసిందన్నారు. తద్వారా ఉభయగోదావరి జిల్లాలోనే కాక దేశవ్యాప్తంగా సీతమ్మ పేరు ప్రతిష్టలు పొందారన్నారు. బాలనాగేంద్రయాదవ్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీహెచ్.అశోక్, చంద్రశేఖర్, ఆరిగ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి


మాట్లాడుతున్న కొండయ్య

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 28 : రజక వృత్తిదారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రజకవృత్తిదారుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రాయల మాలకొండయ్య కోరారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగిన కమిటీ సమావేశానికి టంగుటూరి రాము అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ జిల్లాలో రజకవృత్తిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల ఆయా సమస్యలను పరిష్కరించేలా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రజక కుటుంబాల్లోని యువతీ, యువకులు ఉపాధి లేక గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలు పోతున్నారని, దానికి తోడు ఒంగోలులోని అపార్ట్‌మెంట్లలో వాచ్‌మన్, ఇస్త్రీదారులుగా, ఇంటి పనివారులుగా చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అందువల్ల రజకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.కోటేశ్వరరావు, ఆవులమంద రమణమ్మ, డాక్టర్ కృష్ణయ్య, పోలయ్య, యోగమ్మ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మరాఠా వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం


అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఒంగోలు(కల్చరల్), జూలై 28: ఆంధ్రప్రదేశ్ మరాఠా వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. విజయవాడలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో గౌరవ అధ్యక్షులుగా ఒంగోలుకు చెందిన కాళే వెంకటేశ్వర్లు, అధ్యక్షునిగా అంబోరి వెంకటనాగేంద్రబాబు, కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా గంగారామ్‌లను ఎన్నుకున్నట్లు కార్యక్రమ అధ్యక్షులు అంబరపు వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యవర్గాన్ని పలువురు మరాఠా కుటుంబీకులు అభినందించారు.

మద్దాలికి గౌతమనంది పురస్కారం


పురస్కారం అందుకుంటున్న మాధవరావు

ఒంగోలు(కల్చరల్), జూలై 28: శ్రీఅభయ కళారాధన సేవాసమితి అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావుకు హైదరాబాద్‌కు చెందిన విశ్వవిఖ్యాత కల్చరల్ అకాడమీ గౌతమనంది పురస్కారాన్ని అందజేసింది. హైదరాబాద్ త్యాగరాయ గానసభలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా మాధవ రావు చేస్తున్న సామాజిక, కళారంగ సేవలకు గుర్తింపుగా పురస్కారాన్ని అందజేసినట్లు తెలిపారు. కాగా జిల్లాకు చెందిన పలు సంఘాల ప్రతినిధులు మాధవరావును అభినందించారు.

కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్‌కు సత్కారం


సూర్యప్రకాష్ దంపతులను సన్మానిస్తున్న అతిథులు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 28: ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ గా బి.సూర్యప్రకాష్ సేవలు అభినందనీయమని ఉపాధ్యాయులు కొనియాడారు. స్థానిక కేంద్రీయ విద్యాలయంలో ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సిబ్బంది మాట్లాడుతూ ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్ కర్ణాటక, గోవా, అస్సాం, మణిపూర్, ఆంధ్రప్రదేశ్‌లో తాను ఉపాధ్యాయుడుగా, ప్రిన్సిపాల్‌గా ఎనలేని సేవలు అందించారని, తన ఉద్యోగ విరమణ సొంత ఊరైన ఒంగోలులోనే జరగడం మరింత సంతోషకరమని చెప్పారు. అనంతరం సూర్యప్రకాష్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది. విద్యార్థులు పాల్గొన్నారు.

చీరాల భక్తుడికి అలిపిరిలో పాముకాటు

చీరాలటౌన్, జూలై 28 : చీరాల భక్తుడు నాగేంద్ర తిరుమల అలిపిరి మెట్ల మార్గంలో పాము కాటుకు గురయ్యారు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సుమారు 8 మంది మిత్రులతో కలిసి నాగేంద్ర కాలినడకన వెళుతుండగా అలిపిరి 7వ మైలు రాయి వద్ద పాము కాటేసింది. దీంతో సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు, టీటీడీ ప్రతినిధులు 108లో తిరుమల అశ్విని హాస్పిటల్‌కు తరలించి చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం నాగేంద్ర పరిస్థితి నిలకడగా ఉందని సమాచారం.

వైభవంగా అంకమ్మతల్లికి ఆషాడ సారె



సారె తీసుకొని ఊరేగింపుగా వెళ్తున్న మహిళా భక్తులు

చినగంజాం, జూలై 28 : మండలంలోని మున్నంవారిపాలెం గ్రామంలోని గ్రామ దేవత అంకమ్మ తల్లికి ఆషాడ సారె సమర్పించే కార్యక్రమాన్ని మహిళా భక్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని గ్రామ దేవత అయిన అంకమ్మ తల్లికి సారే అందజేశారు. గ్రామంలోని మహిళా భక్తులు పొంగళ్ళ, చీర, జాకెట్లు, చలిమిడి, పండ్లు, పసుపు కుంకుమను నెత్తి మీద బెట్టుకొని పురవీధుల గుండా మేళతాళాలు, కనకతప్పెట్లు నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి సారె తీసుకొని వెళ్లారు. ఆలయ పూజారి అంకమ్మతల్లిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు తదనంతరం భక్తులు అంకమ్మతల్లికి సారెలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

చెరువులకు చేరుతున్న సాగర్ జలాలు

- ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

పర్చూరు, జూలై 28 : నిన్న మొన్నటి వరకూ అడుగంటిన చెరువులు, కలుషిత నీటితో ప్రజలు నీటి కోసం నానా అవస్థలు పడ్డారు. ఎక్కడ చూసినా అడుగంటిన చెరువులే దర్శనమిచ్చాయి. గుక్కెడు నీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఈతరుణంలో ప్రభుత్వం తాగునీటి అవసరాల కోసం సాగర్ జలాలను విడుదల చేసింది. దీంతో సాగర్ జలాలతో చెరువులను నింపేవిధంగా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం చెరువులు సాగర్ జలాలతో కళకళ లాడుతున్నాయి. మండలంలోని నెలకొన్న నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని యుద్ధ ప్రాతిపదికన చెరువులను నింపే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలు జారీచేశారు. దీంతో అధికారులు ఆమేరకు చర్యలు చేపట్టి మంచినీటి చెవులను నింపే కార్యక్రమంలో తలమునకలయ్యారు. ఆయా గ్రామాల్లో మంచినీటి చెరువులు సాగర్ నీటితో కళకళ లాడుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కుక్కల దాడిలో 50 గొర్రె పిల్లల మృతి



మృతిచెందిన గొర్రెపిల్లలు

గిద్దలూరు టౌన్, జూలై 28 : వీధికుక్కల దాడిలో 50 గొర్రెపిల్లలు మృత్యువాత పడ్డాయి. గిద్దలూరు మండలం కొంగళ వీడు గ్రామానికి చెందిన బోయిన మునిరాజుకు చెందిన 50 గొర్రెపిల్లలు పాకలో ఉండగా రాత్రి సమయంలో వీధికుక్కలు దాడి చేసి చంపాయి. దాడిలో మృతి చెందిన గొర్రెపిల్లలు సుమారు రూ.2లక్షలు ఉంటుందని మునిరాజు లబోదిబోమంటున్నాడు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గిద్దలూరు టౌన్, జూలై 28 : మద్యానికి బానిసై మానసికంగా ఇబ్బంది పడు తున్న వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాచర్ల మండలం చినగానిపల్లె గ్రామంలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కైపా నారాయణరెడ్డి (55) ఇరవై సంవత్సరాలుగా స్వగ్రామాన్ని వదిలి గుంటూరులో భార్యాపిల్లలతో నివసిస్తున్నాడు. అక్కడే చిరువ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి చేసుకుంటున్నాడు. అయితే ఇటీవల మద్యానికి బానిసై మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. వారం రోజులుగా నారాయణరెడ్డి స్వగ్రామమైన చినగానిపల్లెకు వచ్చాడు. శనివారం కూడా నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవాలయానికి వెళ్లి దర్శనం చేసుకున్నాడు. రాత్రి చినగానిపల్లె గ్రామశివారులో పొలాల్లో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. నారాయణరెడ్డి భార్య రంగమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై ఇస్మాయిల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గేదెకు సక్రమంగా వైద్యం అందించలేదని..

- సంచార వాహనంపై రాళ్లతో దాడి చేసిన రైతు

ఎర్రగొండపాలెం, జూలై 28 : ఎర్రగొండపాలెం పశువైద్యశాల వద్ద తమగేదెలకు సక్రమంగా వైద్యం చేయలేదని ఓ రైతు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వైద్యశాల ఎదుట ఉన్న సంచార వైద్యశాలవాహనం అద్దాలను రైతు గొంగటి ప్రభాకరరెడ్డి రాళ్లతో పగులగొట్టారు. మండలంలోని వీరాయిపాలెం గ్రామానికి చెందిన రైతు ప్రభాకరరెడ్డి రెండు గేదెలను వైద్యకోసం పశువైద్యశాలకు తీసుకొచ్చారు. పశువైద్యసిబ్బంది నిర్లక్ష్యంతో ఒక గేదె మృతి చెందింది. దీంతో ఆగ్రహంతో సంచార వాహనం అద్దాలను రైతు ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు. వైద్యం తెలియని సిబ్బందికి సంచార వాహనం ఎందుకని రైతు వాహనాన్ని ధ్వంసం చేశారు. వైద్యశాల సిబ్బంది ఫిర్యాదుతో ఎస్ఐ శ్రీనివాసమూర్తి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో పాల్గొన భక్తులు

కంభం, జూలై 28 : కంభంలో ఆదివారం సాయంత్రం జగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు. రాములవారి దేవాలయం నుంచి బయలుదేరిన రథయాత్ర కంభం పట్టణంలోని రహదారుల నుంచి సాగి వేంకటేశ్వరస్వామి దేవాలయానికి చేరుకొంది. దేశంలోని వివిధ నదుల నుంచి తెచ్చిన నీటితో సంప్రోక్షణ చేయించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కంభంలో మొట్టమొదటి సారిగా జగన్నాథ రథయాత్ర చేయడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య మండల సమావేశం

- కార్యాలయానికి చేరుకున్న టీడీపీ, వైసీపీ వర్గీయులు
- బయటకు పంపించివేసిన పోలీసులు



మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర సునీత

ముండ్లమూరు, జూలై 28: పోలీసు బందోబస్తు మధ్య ముండ్లమూరు మండల సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా సాగింది. సమావేశానికి ఎంపీపీ సుంకర సునీత అధ్యక్షత వహించారు. అయితే, వైసీపీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు శనివారం టీడీపీలో చేరారు. ఈక్రమంలో మండల సమావేశంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తే పరిస్థితి ఏర్పడటంతో పోలీసులు ముందుజాగ్రత్తగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉదయం 11.25 గంటలకు మండల సమావేశం ప్రారంభంకాగానే సతులకు బదులు పతులు రావటంతో ఎంపీడీవో ఆర్.జనార్దన్ జోక్యం చేసుకొని సభ్యులు కానివారు వెళ్ళిపోవాలని పదేపదే ఆదేశించారు. చివరికి చేసేదేమిలేక హాల్ లో నుంచి బయటకు వెళ్ళిపోయారు. అదేసమయంలో ఎంపీపీ హాల్‌లో వైసీపీ నాయకులు, ఎంపీడీవో కార్యాలయ గదిలో టీడీపీ నాయకులు, కార్యాలయం ముందు ఇరువర్గాలు గుమిగూడారు. ఈక్రమంలో ఎస్ఐ నాగ మల్లేశ్వరరావు తన సిబ్బందితో వెళ్ళి ఇరువర్గాలను కార్యాలయంలో నుంచి బయటకు పంపారు. బయట ఉన్న వ్యక్తులను కూడా పంపించివేయడంతో ఎలాంటి సమస్య లేకుండా మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది.

మొదట వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో ఏవో మహమ్మద్ ఫరూక్ మాట్లాడుతూ అర్హత ఉన్న కౌలు రైతులకు కార్డులు మంజూరుచేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే 150 మందికి కార్డులు ఇచ్చినట్టు చెప్పారు. విద్యుత్ శాఖ ఏఈ వీరబ్రహ్మం మాట్లాడుతున్నక్రమంలో నూజెండ్లపల్లి ఎంపీటీసీ టి.బ్రహ్మం, మారెళ్ళ ఎంపీటీసీ పి.సుబ్బారావు జూనియర్ లైన్‌మెన్‌లు, ఎనర్జీ అసిస్టెంట్‌లు అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. ఏపీవో నాగరాజు మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వంద రోజుల పాటు పని దినాలు కల్పిస్తామన్నారు. పండ్ల తోటల రైతులకు రాయితీలు కల్పించి సాగును ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో జడ్పీటీసీ టి.రత్నరాజు, పశువైద్యాధికారి విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ జి.పుల్లారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ ఎం.వెంకటేశ్వర్లు, ఈవోఆర్డీ శ్రీదేవి, వైస్ ఎంపీపీ వేముల పద్మ, బంకా రమణమ్మ, ఎంపీ టీసీలు పాలపర్తి సుబ్బారావు, తేలుకుట్ల బ్రహ్మయ్య, నాగమల్లి అంకారావు, పెదఅంజయ్య, తులసీబాయి, మహేశ్వరి, వెంకటేశ్వర్లు, గుణపాటి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో రైల్వే, హైవే పనుల పూర్తి

- ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 28: రైల్వే, హైవే పనులను వంద రోజుల్లో పూర్తిచేసేం దుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం కనిగిరి ఆర్డీవో కార్యాలయంలో రైల్వే, గ్రీన్‌ఫీల్డ్, 565 హైవే బాధితులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే పనులకు సంబంధించి ప్రస్తుతం 20 కిమీటర్ల మేర రైతుల అభ్యంతరాలతో నిలిచిపోయాయన్నారు. కనిగిరి ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా రవాణరంగం మెరుగుపడాల్సిన అవసరం ఉందని చెప్పారు. అందులో భాగంగా 20 కి.మీ పరిధిలో భూమిని కోల్పోతున్న రైతులకు తగిన నష్టపరిహారంతో పాటు వారికి స్థలాలు కేటాయించి ఇళ్లను కూడా నిర్మించి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కనిగిరి ప్రాంతంలోని రైల్వేస్టేషన్ ఏర్పాటుకు ఆటంకంగా మారిన టేకు చెట్ల భూమికి తగిన నష్టపరిహారాన్ని ఇప్పించేలా ఎమ్మెల్యే అటవీశాఖ అధికారులతో మాట్లాడారు. గతంలో పలుమార్లు స్పందన కార్యక్రమంలో 498/2, 500/1 సర్వే నెంబర్లకు సంబంధించిన భూములు గ్రీన్‌ఫీల్డ్ హైవే కింద పోతున్నట్టు ఆర్డీవో జాన్ ఇర్విన్ వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నష్టపరిహారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న బైపాస్‌ను కూడా వంద రోజుల్లో పూర్తి చేయనున్నట్లు చెప్పారు. అందుకోసం ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్టపరిహారం ఇప్పటికే కలెక్టర్ వద్ద ఉందన్నారు. బైపాస్ కింద భూములు కోల్పోయే 30 మందికి పైగా రైతుల ఖాతాల్లో నగదును పది రోజుల్లో జమ చేయనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, భూకబ్జాలు, భూకుంభకో ణాలపై సిట్ వేసినట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. అయితే, గత ప్రభుత్వంలో వైసీపీకి చెందిన సంబంధిత అక్రమార్కులు కొంతమంది సిట్ దర్యాప్తు సాగనివ్వకుండా అడ్డుకున్నట్టు చెప్పారు. తిరిగి సిట్ దర్యాప్తు ప్రారంభించి భూఆక్రమాలకు పాల్పడిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా హనుమంతునిపాడు మండలంలోని ఉమ్మనపల్లి పంచాయతీలో ప్రభుత్వానికి చెందిన సర్వే నెంబరు 1లో వంద లాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయన్నారు. ఆయా భూముల అక్రమాలపై దర్యాప్తు వేగవంతం చేయనున్నట్లు ఆర్డీవో చెప్పారు. అక్రమార్కులు ఎంతటి వారైన ఉపేక్షించవద్దని ఎమ్మెల్యే జాన్‌ఇర్విన్‌ను ఆదేశించారు. సమావేశంలో రైతులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తీరప్రాంత అభివృద్ధి.. పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కొండయ్య



తీరంలో పర్యాటకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), జూలై 28 : టూరిజం పరంగా తీరప్రాంత అభివృద్ధి, పర్యాటకుల భద్రత, మెరుగైన సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన పలువురు నాయకులు, కార్యకర్తలతో కలసి చీరాల మండల వాడరేవు నుంచి వేటపాలెం మండలం పొట్టిసుబ్బయ్యపాలెం వరకు తీరం వెంట పర్యాటకుల భద్రత కోసం చేపట్టిన చర్యలను పరిశీలించారు. తీరంలో నాటిన హెచ్చరిక జెండాలు, వాచ్‌టవర్స్, గత ఈతగాళ్లు, కోస్టల్ బైక్ తదితరాలను పరిశీలించారు. ఆ సందర్భంగా పర్యాటకులతో మాట్లాడారు. గజ ఈతగాళ్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అండగా ఉంటా

మండల పరిధిలోని పందిళ్లపల్లి తోకపేటలో ఆదివారం మాచర్ల శ్రీమన్నారాయణ(శివయ్య) తన నివాసంలో ఎమ్మెల్యే కొండయ్యకు ఆత్మీయ సమావేశం, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ అందరికీ అండగా, అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. అనంతరం కొండయ్యను ఘనంగా సన్మానించారు.

సజ్జా చంద్రమౌళికి నివాళి

సజ్జా చంద్రమౌళి వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య ఆదివారం చీరాల గడియార స్తంభం సెంటర్లోని ఆయన విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి తరాలవారి ఆలోచనలకు అనుగుణంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలిలో ఇష్టారాజ్యంగా ఇసుక అమ్మకాలు

- అనధికారిక స్టాక్ పాయింట్‌లు
- అధిక ధరలకు విక్రయాలు
- పట్టించుకోని అధికారులు



అనధికారిక స్టాక్ పాయింట్లలోని ఇసుక

పొదిలి, జూలై 28 : పొదిలి పట్టణంలో అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక అమ్మకాలు కొనసాగుతున్నాయి. కొంతమంది వ్యక్తులు అనదికారికంగా ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకొని వినియోగదారుల జేబులకు చిల్లులు కొడుతున్నారు. అధికారులు మాత్రం ఆ వైపు చూడకుండా మిన్నకుండి పోతున్నారు. పట్టణంలో ఆరేడు ప్రాంతాల్లో ఇసుక అనధికారిక స్టాక్ పాయింట్లు ఉన్నాయి. వాస్తవానికి వారికి ఎలాంటి అనుమతులు లేవు. వీరు నేరుగా ఇతర ప్రాంతాల నుంచి ఇసుకను కొనుగోలు చేసి ఇక్కడకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం తక్కువ ధరకు ఇసుక విక్రయించాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. దీని కోసం అధికారిక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేస్తోంది. ఇక రీచ్‌ల వద్ద ఉచితంగా తవ్వుకొనే వెసులుబాటు కల్పించింది. అయితే ఇవేమి ప్రజలకు అందుబాటులోకి రావడం లేదు. నేరుగా ఇసుక స్టాకిస్టులు పొదిలికి తీసుకొచ్చి నిర్ణయించిన ధరకే వినియోగదారులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. గతంలో నెల్లూరు నుంచి ఇసుకను తీసుకొచ్చే వారు. మూడు టన్నుల ఇసుక ట్రాక్టర్ రూ.4500లకు విక్రయించే వారు కానీ ఇప్పుడు అదే ఇసుకకు మరో రూ.1500లు పెంచి రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. దీంతో గృహ నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రీచ్‌లలో తక్కువ ధరకు ఇసుకను విక్రయిస్తున్నా, ఎక్కువ ధరలకు అమ్మడంపై వినియోగదారులు మండి పడుతున్నారు. ఈవిధంగా అయితే మధ్యతరగతి గృహనిర్మాణదారుడు సొంతింటిని నిర్మించుకోవాలంటే అధిక ధరను వెచ్చించాల్సి వస్తోంది. ఇసుక కొరతకు తగినవిధంగా ఇసుక సరఫరా కావడం లేదని దీంతోనే వ్యాపారులు ధరలు పెంచుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఇసుక లభ్యత తక్కువగా ఉండడంతో వ్యాపారులు తమ ఇష్టం వచ్చిన ధరలకు ఇసుకను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతులు లేకుండా ఇసుక వ్యాపారం చేస్తున్నవారిపై, అధిక ధరలకు ఇసుక విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు, గృహ నిర్మాణదారులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా ఇసుక అమ్మడం నేరమని అలాంటివి పట్టణంలో ఉంటే గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్ఈబీ సీఐ ఈశ్వరయ్య తెలిపారు.

అటవీశాఖ కార్యాలయంలో దళారుల దందా

- నేరుగా ఫారెస్ట్ రేంజర్ కార్యాలయంలోనే తిష్ట
- అధికారి చేతికి మట్టి అంటకుండా వసూళ్లు
- ఎర్రగొండపాలెం కేంద్రంగా వ్యవహారాలు



ఎర్రగొండపాలెంలోని అటవీశాఖ కార్యాలయం

పుల్లలచెరువు, జూలై 28: ఎర్రగొండపాలెం అటవీశాఖ కార్యాలయంలో దళారులదందా రాజ్యమేలుతోంది. అటవీ సంపద, వన్యప్రాణులను రక్షించాల్సిన అధికారులే అవినీతికి తెరతీస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడి గిరిజనులకు పీడించి దళారుల ద్వారా అందిన కాడికి దండుకుటున్నారు. ఎర్రగొండపాలెం కేంద్రంగా పాలన సాగిస్తున్న సదరు అధికారి కార్యాలయంలో దళారికి ప్రత్యేక స్థానం కల్పించి మరి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఐదేళ్లుగా వైసీపీ పాలనలో అనేక అక్రమాలకు పాల్పడినప్పటికీ, ఉన్నాతాధికారులను ప్రసన్నం చేసుకొని తన దందా కొనసాగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే దందాను కొనసాగిస్తూ దళారిని సదరు అధికారి అందలం ఎక్కిస్తున్నారు. ఆ కార్యాలయంలో ఇప్పటికీ వైసీపీ నేతల మాటే చెల్లుబాటు అవుతుండడం గమనార్హం.

దందా నిర్వహించేదిలా..

ఎర్రగొండపాలెం కేంద్రంగా ఆ అధికారి అడవిలో నిబంధనలకు ఉల్లంఘించి జరిగే ఘటనలపై కేసుల కోసం ఎదురు చూస్తుంటాడు. అటవీలో ఏదైనా కేసు దొరికితే ఆయనకు పండుగే. సదరు నిందితుల వద్దకు ముందుగా ఆయన ప్రత్యేకంగా నియమించుకున్న దళారిని రంగంలోకి దింపుతాడు. సదరు దళారి వారి వద్దకు వెళ్లి 'సారు నాకు బాగా పరిచయం, ఎంతో కొంత ఇవ్వండి నేను సెటిల్ చేస్తా అని బేరం మొదలు పెడతాడు. దళారి అడిగినంత ఇస్తే కేసులు క్షణాల్లో మాయం చేస్తారు. వాళ్ళు అడిగినంత ఇవ్వకుంటే కేసులు కట్టి వేధింపులు ప్రారంభిస్తారు. సదరు దళారి లేనిదే ఈ అధికారి కనీసం అడుగు కూడా బయటకు పెట్టడు. అంతే కాక ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లోని కోత మిషన్లకు అనుమతులకు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ముందు దళారి ద్వారా మాట్లాడించి, వారు అడిగినంత ఇవ్వకుంటే వారిని వేధించడం ఆనావాయితీగా మారింది.పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం మండలాల్లో బొగ్గు బట్టిల నుంచి కూడా భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారు.

మచ్చుకకు కొన్ని..

పుల్లలచెరువు మండలం మల్లాపాలెం సుగాలి కుటుంబానికి చెందిన ఓ రైతుకు ఆర్‌ఓఆర్‌ఎఫ్ పట్టా ఇప్పించేందుకు దళారి ద్వారా రూ.80 వేలు వసూలు చేసిన సదరు అధికారి మరికొంత నగదు కోసం రెండు నెలలుగా ఆ సుగాలి రైతును రేపు మాపు అంటూ తిప్పుకున్నట్లు సమాచారం. పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాల్లోని ప్రైవేటు భూముల్లో వున్న టేకు చెట్లను ఎటువంటి అనుమతి లేకుండా ఎర్రగొండపాలేనికి చెందిన ఓ వైసీపీ నాయకుడి ద్వారా ట్రాక్టరుకు రూ.10 వేలు తీసుకొని రైట్ రైట్ అని అంటున్నారని ఆ శాఖ ఉద్యోగుల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. అంతేకాక సదరు అధికారి పుల్లలచెరువు మండలంలోని నరజాముల, మురికిమల్ల, మల్లాపాలెం, పెద్దపీఆర్‌సీ తాండల్లో సుగాలి రైతులు బోరు తవ్వించుకోవాలంటే మందుగా దళారికి రూ.10 వేలు ముట్టజెప్పాల్సిందే. ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నాతాధికారులు సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సాహిత్యంపై పట్టున్న వ్యక్తి రాఘవరావు



రాఘవరావు దంపతులను సత్కరిస్తున్న సాహితీ సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 28 : రాఘవరావు మంచి కథా రచయిత అని, ప్రత్యేకించి చలం, శ్రీశ్రీ, యండమూరి రచనలు, సినిమా సాహిత్యంపై మంచి పట్టు ఉన్న వ్యక్తి రాచపూడి వెంకట రాఘవరావు అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం సాహితీమిత్రమండలి ఆధ్వర్యంలో అద్దంకిలోని మారం వారి సేవాసదన్‌లో లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన ఆత్మీయ పురస్కార సభ జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 40 సంవత్సరాలు పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో చక్కని సేవలందించాలరని, సభ నిర్వహణలో కచ్చితంగా సమయపాలన పాటించే విధంగా అందర్నీ అలవాటు చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాఘవరావు రచనలు, కవితలు గురించి అన్నమనేని వెంకట్రావు, డీవీఎం సత్యనారాయణ, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, డాక్టర్ దేవపాలన, వారణాసి రఘురామశర్మ విశ్లేశించారు. అనంతరం రాఘవరావు దంపతులను ఘనంగా సన్మానించి పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, మురళి సుధాకరరావు, వెంకటేశ్వరరావు, విశ్వమోహన్, పోలిరెడ్డి, కామేశ్వరశర్మ పాల్గొన్నారు.

అటవీశాఖ కార్యాలయంలో దళారుల దందా

● నేరుగా ఫారెస్ట్ రేంజర్ కార్యాలయంలోనే తిష్ట ● అధికారి చేతికి మట్టి అంటకుండా వసూళ్లు ● ఎర్రగొండపాలెం కేంద్రంగా వ్యవహారాలు

పుల్లలచెరువు, జూలై 28: అటవీశాఖ కార్యాలయంలో దళారులదందా రాజ్యమేలుతోంది. అటవీ సంపద, వన్య ప్రాణులను రక్షించాల్సిన అధికారులే అవినీతికి తెరతీస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడి గిరిజనులకు పీడించి దళారుల ద్వారా అందిన కాడికి దండుకుటుంన్నారు. ఎర్రగొండపాలెం కేంద్రంగా పాలన సాగిస్తున్న సదరు అధికారి కార్యాలయంలో దళారికి ప్రత్యేక స్థానం కల్పించి మరి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఐదేళ్లుగా వైసీపీ పాలనలో అనేక అక్రమాలకు పాల్పడినప్పటికీ, ఉన్నాతాధికారులను ప్రసన్నం చేసుకొని తన దందా కొనసాగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే దందాను కొనసాగిస్తూ దళారిని సదరు అధికారి అందలం ఎక్కిస్తున్నారు. ఆ కార్యాలయం లో ఇప్పటికీ వైసీపీ నేతల మాటే చెల్లుబాటు అవుతుండడం గమనార్హం.

దందా నిర్వహించేదిలా..

ఎర్రగొండపాలెం కేంద్రంగా ఆ అధికారి అడవిలో నిబంధనలకు ఉల్లంఘించి జరిగే ఘటనలపై కేసుల కోసం ఎదురు చూస్తుంటాడు. అటవీలో ఏదైనా కేసు దొరికితే ఆయనకు పండుగే. సదరు నిందితుల వద్దకు ముందుగా ఆయన ప్రతేక్యంగా నియమించుకున్న దళారిని రంగంలోకి దింపుతాడు. సదరు దళారి వారి వద్దకు వెళ్లి 'సారు నాకు బాగా పరిచయం, ఎంతో కొంత ఇవ్వండి నేను సెటిల్ చేస్తా అని బేరం మొదలు పెడతాడు. దళారి అడిగినంత ఇస్తే కేసులు క్షణాల్లో మాయం చేస్తారు. వాళ్ళు అడిగినంత ఇవ్వకుంటే కేసులు కట్టి వేధింపులు ప్రారంభిస్తారు. సదరు దళారి లేనిదే ఈ అధికారి కనీసం అడుగు కూడా బయటకు పెట్టడు. అంతే కాక ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లోని కోతమిషన్లకు అనుమతులకు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ముందు దళారి ద్వారా మాట్లాడించి, వారు అడిగినంత ఇవ్వకుంటే వారిని వేధించడం అనావాయితీగా మారింది.పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం మండలాల్లో బొగ్గు బట్టిల నుంచి కూడా భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారు.

మచ్చుకకు కొన్ని ఉదాహరణలు

పుల్లలచెరువు మండలం మల్లాపాలెం సుగాలి కుటుంబానికి చెందిన ఓ రైతుకు ఆర్‌ఓఆర్ఎఫ్ పట్టా ఇప్పించేందుకు దళారి ద్వారా రూ.80 వేలు వసూలు చేసిన సదరు అధికారి మరికొంత నగదు కోసం రెండు నెలలుగా ఆ సుగాలి రైతును రేపు మాపు అంటూ



ఎర్రగొండపాలెంలోని అటవీశాఖ కార్యాలయం

తిప్పుకున్నట్లు సమాచారం. పుల్లలచెరువు, ఎర్రగొండ పాలెం, త్రిపురాంతకం మండలాల్లోని ప్రైవేటు భూముల్లో వున్న టేకు చెట్లను ఎటువంటి అనుమతి లేకుండా ఎర్రగొండపాలేనికి చెందిన ఓ వైసీపీ నాయకుడి ద్వారా ట్రాక్టరుకు రూ.10 వేలు తీసుకోని రైట్ రైట్ అని అంటున్నారని ఆ శాఖ ఉద్యోగుల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. అంతేకాక సదరు అధికారి పుల్లలచెరువు మండలంలోని నరజాముల, మురికిమల్ల, మల్లాపాలెం, పెద్దవీఆర్‌సీ తాండల్లో సుగాలి రైతులు జోరు తప్పించుకోవాలంటే మందుగా దళారికి రూ.10 వేలు ముట్టజెప్పాల్సిందే. ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నాతాధికారులు సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వీధికుక్కల దాడిలో 50 గొర్రె పిల్లల మృతి

గిద్దలూరు టౌన్, జూలై 28 : వీధికుక్కల దాడిలో 50 గొర్రెపిల్లలు మృత్యువాత పడ్డాయి. గిద్దలూరు మండలం కొంగళవీడు గ్రామానికి చెందిన బోయిన మునిరాజుకు చెందిన 50 గొర్రెపిల్లలు పాకలో ఉండగా రాత్రి సమయంలో వీధికుక్కలు దాడి చేసి చంపాయి. దాడిలో మృతి చెందిన 50 గొర్రె పిల్లలు సుమారు 2లక్షల విలువ ఉంటుందని మునిరాజు లబోదిబోమంటున్నాడు.



మృతిచెందిన గొర్రెపిల్లలు

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గిద్దలూరు టౌన్, జూలై 28 : మద్యానికి బానిసై మానసికంగా ఇబ్బంది పడుతున్న వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాచర్ల మండలం చినగానిపల్లె గ్రామంలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కైపా నారాయణరెడ్డి (55) 20 సంవత్సరాలుగా స్వగ్రామాన్ని వదిలి గుంటూరులో భార్యాపిల్లలతో నివసిస్తున్నాడు. అక్కడే చిరువ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి చేసుకుంటున్నాడు. అయితే ఇటీవల మద్యానికి బానిసై మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. వారం రోజులుగా నారాయణరెడ్డి స్వగ్రామమైన చినగానిపల్లెకు వచ్చాడు. శనివారం కూడా నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవాలయానికి వెళ్లి దర్శనం చేసుకున్నాడు. రాత్రి చినగానిపల్లె గ్రామశివారులో పొలాల్లో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. నారాయణరెడ్డి భార్య రంగమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై ఇస్మాయిల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మార్కాపురం జిల్లాను వెంటనే ప్రకటించాలి

● సీపీఐ డిమాండ్

త్రిపురాంతకం, జూలై 28: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా మార్కాపురం జిల్లా చేస్తామని చెప్పిందని ఆమేరకు వెంటనే మార్కాపురం జిల్లాను ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏర్పడి 54 ఏళ్లు అయిందన్నారు. అప్పటి నుండి మార్కాపురం ప్రాంత ప్రజలు పలు రకాల పనులపై జిల్లా కేంద్రం ఒంగోలుకు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికితోడు మార్కాపురం ప్రాంతం పూర్తిగా వెనుకబడిందని జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జిల్లా సాధన కోసం అనేక రకాల ఉద్యమాలు జరిగాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని రాజకీయపార్టీలు కలిసి జేఏసీగా ఏర్పడి సుమారు 38 రోజులపాటు దీక్షలు చేశాయని గుర్తు చేశారు. మార్కాపురం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం, దర్శి, కనిగిరి నియోజకవర్గాలతో జిల్లా ఏర్పడితే దొనకొండ విమానాశ్రయం అభివృద్ధి చెందుతుందన్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు కూడా నిధులు సాధించవచ్చని అన్నారు. దీనికోసం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చొరవ చూపి ముఖ్యమంత్రితో మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బి.రామయ్య, కో-ఆప్షన్ సభ్యుడు నయీంబేగ్, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గేదెకు సక్రమంగా వైద్యం అందించలేదని..

● సంచార వాహనంపై రాళ్లతో దాడిచేసిన రైతు

ఎర్రగొండపాలెం, జూలై 28 : ఎర్రగొండపాలెం పశు వైద్యశాల వద్ద తమగేదెలకు సక్రమంగా వైద్యం చేయలేదని ఓ రైతు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వైద్యశాల ఎదుట ఉన్న సంచార వైద్యశాల వాహనం అద్దాలను రైతు గొంగటి ప్రభాకరరెడ్డి రాళ్లతో పగుల గొట్టారు. మండలంలోని వీరాయిపాలెం గ్రామానికి చెందిన రైతు ప్రభాకరరెడ్డి రెండు గేదెలను వైద్యకోసం పశువైద్యశాలకు తీసుకొచ్చారు. పశువైద్యసిబ్బంది నిర్లక్ష్యంతో ఒక గేదె మృతి చెందింది. దీంతో ఆగ్రహంతో సంచార వాహనం అద్దాలను రైతు ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు. వైద్యం తెలియని సిబ్బందికి సంచార వాహనం ఎందుకు అని రైతు ప్రభాకరరెడ్డి రాళ్లతో దాడి చేసి వాహనం అద్దాలు ధ్వంసం చేశాడు. అయితే వైద్యశాల సిబ్బంది ఫిర్యాదుతో ఎస్.ఐ శ్రీనివాసమూర్తి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



వాహనం అద్దాలు పగులగొడుతున్న రైతు

నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

గిద్దలూరు టౌన్, జూలై 28 : మానవత స్వచ్ఛంద సేవాసంస్థ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఛైర్మన్‌గా గుర్రం నరసింహులు, అధ్యక్షులుగా పాలుగుళ్ల వెంకటశివారెడ్డి, ఉపాధ్యక్షులుగా కూరాకు మూర్తయ్య, ప్రధాన కార్యదర్శిగా పుట్టా మహేశ్వరరావు, గౌరవాధ్యక్షులుగా గంజి వీరయ్య, సహాయ కార్యదర్శి గాదంశెట్టి శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా దగ్గుపాటి వెంకటేశ్వర్లు, సోషల్‌మీడియా కన్వీనర్‌గా డాక్టర్ మొర్రి పిచ్చయ్య గౌరవ సలహాదారులుగా గుల్లా రామక్రిష్ణారెడ్డి, వడ్డి వీరారెడ్డి, పసుపులేటి విజయ్‌కుమార్, డైరెక్టర్లుగా వెంకటరంగయ్య, గొటికె రవీంద్రరెడ్డి, డాక్టర్ మొర్రి పిచ్చయ్య, మోడిగారి కృష్ణ ఆర్.బాలుడు, అలిశెట్టి బాలవెంకటేశ్వర్లు, తాండవ వెంకటేశ్వర్లు, సూరె సుబ్రహ్మణ్యం, సూరె రామచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ ఆధ్వర్యంలో రథం, ఫ్రీజర్, సామాజిక కార్యక్రమాలు చేయనున్నారు.

జాతీయ రహదారి వెంబడి ట్రాఫిక్ సమస్య

● అంచులను ఆక్రమించిన వాణిజ్య సముదాయాల యజమానులు ● పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

ఎర్రగొండపాలెం, జూలై 28 : ఎర్రగొండపాలెం నియోజకవర్గం కేంద్రంలోని ప్రధాన కూడల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. దీంతో పట్టణానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జాతీయరహదారి వెంబడి ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు నిలుపుతుండడంతో గ్రామాల నుంచి నిత్యం పట్టణానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు రహదారిపై నడవాలంటేనే ఆందోళన చెందుతున్నారు. మార్కాపురం డీఎస్పీ శుక్రవారం ఎర్రగొండపాలెం వచ్చిన సమయంలో రహదారిపై నిలిపిన ద్విచక్రవాహనాలను చూసి కేసులు నమోదు చేయాలని స్థానిక పోలీసులకు సూచనలు చేశారు. అయినప్పటికీ, వాహనదారులు మాత్రం రోజు మాదిరిగానే రోడ్ల వెంబడే వాహనాలు నిలిపారు. ప్రజలు మాత్రం రహదారి మధ్యలో నడక సాగిస్తున్నారు. దీంతో ఎదురుగా వాహనం వచ్చిన సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో పాదచారులకు వాహనాలు తగిలి గాయాలైన ఘటనలు ఉన్నాయి. ఎర్రగొండపాలెం పట్టణానికి చుట్టూ 40 కి.మీ వరకు మరో పట్టణం లేదు. చుట్టూ ఉన్న మండలాల ప్రజలు వైద్యశాలలకు, బ్యాంక్‌లకు వాణిజ్య అవసరాలకు ఎర్రగొండపాలేనికి వస్తున్నా రు. దీంతో ప్రజలు ఎక్కువ సంఖ్యలోనే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ప్రైవేటు భవనాలు యజమానులు రహదారి అంచులు ఆక్ర మించి బడ్డీ బంకులను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ద్విచక్ర, ఇతర వాహనాలు రోడ్లపైనే నిలుస్తున్నాయి. ఎర్రగొండపాలెంలోని త్రిపురాంతకం కూడలి, కొలుకుల కూడలి, పుల్లలచెరువు కూడలి, స్టేట్‌బ్యాంక్ రహదారుల్లో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, పాఠశాలల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. పోలీసులు మాత్రం సమస్య తామది కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు.



రహదారి వెంబడి నిలిపిన వాహనాలు



రహదారి వెంబడి ఉన్న ఆక్రమణలు

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, జూలై 28 : గ్రామాల్లో ఏ సమస్య వచ్చిన వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బేస్తవారపేట మండలంలోని చెట్టిచెర్ల గ్రామంలో ఆదివారం జరిగిన పోలేర మ్మ తిరునాళ్లకు ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. పోలేరమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు అనంతరం గ్రామంలో పర్యటించారు. ప్రజలు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గ్రామంలో అర్హులందరికీ అందెలా చూడాలని సూచించారు. ఏదైన సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి, తిగిరెడ్డి అశోక్‌రెడ్డి, సర్పంచ్ పోతుల కృష్ణారెడ్డి, బైరెడ్డి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని సత్కరిస్తున్న గ్రామస్థులు

ఇష్టారాజ్యంగా ఇసుక అమ్మకాలు

● యథేచ్ఛగా అనధికారిక స్టాక్ పాయింట్‌లు ● అధిక ధరలకు విక్రయాలు ● పట్టించుకోని అధికారులు

పొదిలి, జూలై 28 : పట్టణంలో అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక అమ్మకాలు కొనసాగుతున్నాయి. కొంతమంది వ్యక్తులు అనధికారికంగా ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకొని వినియోగదారుల జేబులకు చిల్లులు కొడుతున్నారు. అధికారులు మాత్రం ఆ వైపు చూడకుండా మిన్నుకుండి పోతున్నారు.

పొదిలి పట్టణంలో ఆరేడు ప్రాంతాల్లో ఇసుక అనధికారిక స్టాక్ పాయింట్లు ఉన్నాయి. వాస్తవానికి వారికి ఎలాంటి అనుమతులు లేవు. వీరు నేరుగా ఇతర ప్రాంతాల నుంచి ఇసుకను కొనుగోలు చేసి ఇక్కడకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం తక్కువ ధరకు ఇసుక విక్రయించాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. దీని కోసం అధికారిక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేస్తోంది. ఇక రీచ్‌ల వద్ద ఉచితంగా తవ్వుకొనే వెసులుబాటు కల్పించింది. అయితే ఇవేమి ప్రజల కు అందుబాటులోకి రావడం లేదు. నేరుగా ఇసుక స్టాకిస్టులు పొదిలికి తీసుకొచ్చి నిర్ణయించిన ధరకే వినియోగదారులు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

గతంలో నెల్లూరు నుంచి ఇసుకను తీసుకొచ్చేవారు. మూడు టన్నుల ఇసుక ట్రాక్టర్ 4500లకు విక్రయించే వారు కానీ ఇప్పుడు అదే ఇసుకకు మరో రూ.1500లు పెంచి రూ.6 వేలకు విక్రయిస్తు న్నారు. దీంతో గృహనిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రీచ్‌లలో తక్కువ ధరకు ఇసుకను విక్రయిస్తున్నా, ఎక్కువ ధరలకు అమ్మడంపై వినియోగదారులు మండి పడుతున్నారు. ఈవిధంగా అయితే మధ్యతరగతి గృహనిర్మాణదారుడు సొంతింటిని నిర్మించు కోవాలంటే అధిక ధరను వెచ్చించాల్సి వస్తోంది. ఇసుక కొరతకు తగినవిధంగా ఇసుక సరఫరా కావడం లేదని దీంతోనే వ్యాపారులు ధరలు పెంచుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఇసుక లభ్యత తక్కువగా ఉండడంతో వ్యాపారులు తమ ఇష్టం వచ్చిన ధరలకు ఇసుకను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతులు లేకుండా ఇసుక వ్యాపారం చేస్తున్నవారిపై, అధిక ధరలకు ఇసుక విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు, గృహనిర్మాణదారులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా ఇసుక అమ్మడం నేరమని అలాంటివి పట్టణంలో ఉంటే గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్ఈబీ సీఐ ఈశ్వరయ్య తెలిపారు.



పొదిలిలో అనధికారిక స్టాక్ పాయింట్లలోని ఇసుక

పొలం డొంకల ఆక్రమణతో రైతులకు అవస్థలు

త్రిపురాంతకం, జూలై 28: పొలాలకు వెళ్లే డొంక దారులు ఆక్రమణకు గురికావడంతో పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మేడపి రెవెన్యూ పరిధిలోని ఎస్సీ కాలనీ చర్చి ఎదురుగా ఉన్న రోడ్డు కొత్త అన్నసముద్రం నుంచి వెంగాయపాలెం వరకు ఉండేది. రెవెన్యూ రికార్డుల ప్రకారం 60 అడుగుల వెడల్పు వరకు ఉండే ఈ రోడ్డు కొంత దూరం వెళ్లిన తరువాత క్రమేపి వెడల్పు తగ్గు తూ వెంగాయపాలెం అడ్డ రోడ్డు వరకు ఉండేది. అయితే కొన్నేళ్ళుగా రోడ్డు ప్రారంభం నుంచే రోడ్డుకు ఇరువైపులా ఉన్న రైతులు పూర్తిగా ఆక్రమించడంతో దాని వెడల్పు 60 అడుగుల నుంచి 6 అడుగులకు చేరింది. దీంతో ఆ రోడ్డు నుంచి పొలాలకు, వెంగాయపాలెం గ్రామానికి వెళ్లాలనుకునే రైతులకు, గ్రామస్థులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. దీనికి తోడు ఉన్న కొద్ది రోడ్డులో భారీగా పిచ్చిమొక్కలు మొలచి నడిచేందుకు కూడా వీలు లేకుండా తయారైంది. ఈ రోడ్డును రెవెన్యూ అధికారులు కొలతలు వేసి ఆక్రమణలను తొలగించి రోడ్డు వెడల్పును చేయించి రైతులకు, గ్రామస్థులకు ఇబ్బంది లేకుండా చూడాల్సి అవసరం ఎంతైనా ఉంది.

రోడ్డు ఆక్రమణకు గురైంది

ప్రభుత్వ రికార్డుల ప్రకారం 60 అడుగుల మేర ఉండాల్సిన రోడ్డు పక్క పొలాల రైతులు ఆక్రమించుకోండంతో దారి మొత్తం మూసుకుపోయింది. దీంతో కొంతదూరం పోయిన తర్వాత అసలు దారి లేకుండా చేశారు. దిగువ పొలాలకు రైతులు వెళ్లాలన్నా, పొలానికి మందుకట్టలు, ఇతర పనుల కోసం ట్రాక్టర్లు వెళ్లాలన్నా వీలులేకుండా పోయింది. అధికారులు స్పందించి కొలతలు వేసి గతంలో ఉన్న విధంగా దారిని ఏర్పాటు చేయాలి.

చిన్నఅంకారావు, కొత్తఅన్నసముద్రం



పొలాలకు వెళ్లే డొంకదారి

అవీ..ఇవీ..

పాఠశాలకు వెళ్లే దారిని బాగుచేయించాలి

కంభం (అర్థవీడు), జూలై 28 : అర్థవీడు మండలం పాపినేనిపల్లి గ్రామంలోని మసీదు పక్కవీధిలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారిని బాగు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా ఈ దారిలో నీరువెళ్లే మార్గం లేకపోవడంతో దారి మొత్తం బురదగా మారుతోంది. ఈ రోడ్డులోనే ఉపాధ్యాయలు, విద్యార్థులు, కాలనీవాసులు వెళతూ ఇబ్బంది పడుతున్నారు. బురద, మురికినీరు నిలువ ఉండడంతో దోమల ఉధృతి పెరిగి రోగాల భారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



పాపినేనిపల్లి పాఠశాలకు వెళ్లే దారి

ఆసుపత్రి ఆవరణలో మురుగుకాలువ శుభ్రం

కంభం, జూలై 28 : కంభం ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని మురికి కాలువలో పేరుకు పోయిన చెత్తను ఎంపీడీవో మస్తాన్ వలి కందులాపురం పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ నెల 26న శుక్రవారం మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా కంభం ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మురికి కాలువలను, దుర్వాసను, దోమల ఉధృతిని ఆయన గమనించారు. కాలువలను శుభ్రం చేయించాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఆదివారం పనులు మొదలు పెట్టించారు. కార్యక్రమంలో కార్యదర్శి స్వామి, వైద్యశాల సూపరింటెండెంట్ శివనాయక్, తదితరులు పాల్గొన్నారు.



మురుగు కాలువను శుభ్రం చేయిస్తున్న అధికారులు

ఘనంగా జగన్నాథ రథయాత్ర



జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

కంభం, జూలై 28 : కంభంలో ఆదివారం సాయంత్రం జగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు. రాములవారి దేవాలయం నుంచి బయలుదేరిన రథయాత్ర కంభం పట్టణంలోని రహదారుల నుంచి సాగి వేంకటేశ్వరస్వామి దేవాలయానికి చేరుకొంది. భారతదేశంలోని వివిధ నదుల నుంచి తెచ్చిన నీటితో సంప్రోక్షణ చేయించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కంభంలో మొట్టమొదటి సారిగా జగన్నాథ రథయాత్ర చేయడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, జూలై 28: మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పూలమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



విశేష అలంకరణలో అమ్మవారు

అనాథ పిల్లలకు రూ.2 లక్షల ఆర్థికసాయం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న స్వచ్ఛంద సేవా ప్రతినిధులు

గిద్దలూరు టౌన్, జూలై 28 : తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా ఉన్న చిన్నారులకు గిద్దలూరుకు చెందిన ఫాతిమా స్వచ్ఛందసేవా సంస్థ అండగా నిలిచింది. ఆదివారం చిన్నారులకు ఆ సేవా సంస్థ ప్రతినిధులు రూ.2లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. కర్నూలు జిల్లా ఆలూరు మండలం గూళ్యం గ్రామానికి చెందిన అనాథలు ఆబాబి, సబియా, ఆఫ్రిన్‌లకు ఈ సాయం అందజేశారు. వీరి తల్లిదండ్రులు పింజారి కాశీంసాహెబ్, శేఖమ్మ కొద్దిరోజుల క్రితం మృతిచెందారు. చిన్నారులకు సంస్థ సభ్యులు పింజారి హుస్సేన్ వారి మిత్రుల సహకారంతో లక్ష, మరొక లక్ష కలిపి మొత్తం 2లక్షలు సంస్థ అధ్యక్షులు నంద్యాల ఖాశింవలి, సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా. ఖాశింవలి మాట్లాడుతూ వచ్చే నెల నుంచి చిన్నారులకు నెలకు రూ.2వేల ఫించన్ అందిస్తామన్నారు.

పేద విద్యార్థులకు ఉపకరణాల అందజేత



ఉపకరణాలు అందజేస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

తర్లుపాడు, జూలై 28: తర్లుపాడులోని ఎస్సీ, బీసీ హాస్టల్‌లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు రూ.60వేల విలువైన కాస్మోటిక్ వస్తువులు, దుప్పట్లు, ఇన్‌వెటర్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తామన్నారు. వారికి అవసరమైన అన్ని వస్తువులను దాతల సహకారంతో అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సుధాకర్, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్‌బాబు, బట్టు శ్రీనివాసులు, పెద్దిరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

7న మార్కాపురం జిల్లా కోసం రౌండ్‌టేబుల్ సమావేశం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 28: మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలని, అలాగే కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపాలని కోరుతూ ఆగస్టు 7వ తేదీన ఒంగోలులోని బీసీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ మిరియం శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినందున వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రానికి మార్కాపురం డివిజన్‌లోని పలు నియోజకవర్గాలు దూరంగా ఉన్నందున ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, జూలై 28: తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోగల సోమవరాప్పాడులోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గుంటిగంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసరమండల గ్రామాలకు చెందిన భక్తులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో సందడిగా మారింది. చల్లంగ చూడమ్మ గంగమ్మ తల్లి అంటూ వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగార్పమ్మ కొలుపులు

పామూరు, జూలై 28: మండలంలోని అక్కంపేట గ్రామంలో ఆదివారం శ్రీనాగార్పమ్మ కొలుపులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థాన సమీపంలోని వనంలో చెట్లకు పూజలు చేశారు. అనంతరం అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థాన నిర్వాహకులు, సర్పంచ్ దాసరి మాలకొండయ్య, రత్తయ్య, డి.కోటిలింగం, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఆరాధన మహోత్సవాల్లో పాల్గొన్న ఉగ్ర కుటుంబసభ్యులు


ఉగ్ర దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న దేవస్థాన సభ్యులు

సీఎస్‌పురం(పామూరు), జూలై 28: సీఎస్‌పురం మండలం కొవిలంపాడు గ్రామ పంచాయతిలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణ స్వామి ఆరాధన మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, గణాధిపతిపూజ, పుణ్యాహావాచనం, అఖండ దీపారాధన, కలశస్థాపన, మహానారాయణ హోమం, రుద్ర పంచసూక్త నవగ్రహ హోమం, మహాపూర్ణహుతి పూజలను ఆలయ అర్చకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, సతీమణి డాక్టర్ కవిత, కుమారుడు జయసింహారెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఎమ్మెల్యే కుటుంబసభ్యులను దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చినఆదినారాయణ, ఈవో గిరిరాజు నరసింహబాబు, పూర్ణహుతితో ఘనస్వాగతం పలికి స్వామివారి శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం దేవస్థాన ప్రాంగణంలో దాతలచే నిర్మించిన గోశాలను ఎమ్మెల్యే ఉగ్ర దంపతులు ప్రారంభించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. రాత్రికి స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో పామూరు, సీఎస్‌పురం, సింగిల్‌విండో మాజీ చైర్మన్‌లు బైరెడ్డి జయరామిరెడ్డి, బోయిళ్ల నారాయణరెడ్డి, నరసారెడ్డి, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, ఉప్పలపాటి హరిబాబు, కొమ్మినేని వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి గర్వించదగ్గ నాయకుడు ఎన్టీఆర్

తెలుగుజాతి ఖ్యాతిని దేశ నలుమూలలకు వ్యాపింపచేసిన మహానాయకుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు అని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కొనియాడారు. మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో కాకతీయ కమ్మసత్రం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాలలువేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, జూలై 28: ముండ్లమూరు గ్రామానికి చెందిన ఖాజావలి ద్విచక్ర వాహనం పై అద్దంకి వెళ్తుండగా పోలవరం సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. దీంతో ఖాజావలికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం.. పలువురికి గాయాలు

దొనకొండ, జూలై 28: దొనకొండలోని పలు ప్రాంతాల్లో గత రెండు రోజులుగా పిచ్చికుక్క స్వైర విహారం చేస్తుంది. ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడితో పాటు అనేకమందిని గాయాలపాలు చేసింది. ఇటీవల కాలంలో గుంపులు గుంపులుగా శునకాలు వీధుల వెంట సంచరిస్తున్నాయి. వీటిలో ఏది పిచ్చికుక్క అర్థంకాక ప్రజలు ఆందోళనలు చెందుతున్నారు. గ్రామ పంచాయితీ పాలకులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

కనిగిరి, జూలై 28: పర్యావరణానికి, మొక్కల పెరుగుదలకు ముప్పు కల్గించే ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడాలని గుడ్‌హెల్ప్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక సెయింట్ జోసఫ్స్ స్కూల్ హాస్టల్‌లో ఆదివారం విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగంతో భవిష్యత్తులో సంభవించే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. ప్లాస్టిక్ భూమి పొరలను నాశనం చేస్తుందన్నారు. మొక్కల పెంపకంతో ఆహారంతో పాటు ఆక్సిజన్ అందిస్తాయన్నారు. కాలుష్యాన్ని నివారించి పర్యావరణ సమతుల్యంగా ఉంచుతుందన్నారు. కార్యక్రమంలో మణికంఠ, ప్రిన్స్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డిజిటల్ సేవల పెంపుపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 28: పాఠశాలల్లో డిజిటల్ సేవలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. గత ఐదేళ్లలో ఏర్పాటు చేసిన పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎన్ని పాఠశాలలు గుర్తించారని, సేవలను పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని అన్నారు. దీనిపై కేంద్ర విద్యాశాఖ సహాయక మంత్రి జయంత్‌చౌదరి సమాధానం ఇస్తూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ప్రకారం సాంకేతికతను నేర్చుకోవడం, మూల్యాంకనం ప్రక్రియ వృద్ధికావడం, భాష అడ్డంకులు తొలగడం, ఉపాధ్యాయుల నైపుణ్యం, సమర్థత పెరగడం, దివ్యాంగుల విద్యాప్రవేశాలు పెరుగుదల, విద్యా ప్రణాళిక, నిర్వహణ తదితర అంశాలను మెరుగుపర్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 2687 ల్యాబ్‌లు, 5190 సమర్థవంత తరగతి గదులు ఏర్పాటు అయ్యాయని కేంద్రమంత్రి వివరణ ఇచ్చారు.

వికసిత్ భారత్-2047 లక్ష్య సాధన కోసం రూట్‌మ్యాప్ తయారు చేసేందుకు ఆదివారం ఢిల్లీలో రాష్ట్రపతిభవన్ జరిగిన సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో చంద్రబాబు పాల్గొనకు మాగుంట కలికి బొకే అందజేశారు.

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు రూ.10వేల కోట్లు ప్రకటించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 28: కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి అప్పుల మూట తప్ప గ్రాంటు ఏమి ఇవ్వలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్ ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు రూ.10వేల కోట్ల ప్యాకేజీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులో నిరసన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ సామాన్యులకు, మధ్యతరగతి వర్గాలకు ఉపయోగపడే విధంగా లేదన్నారు. కార్పొరేట్ వర్గానికి, సంపన్నులకు ప్రయోజనం చేకూర్చేలా ఉందని ఆరోపించారు. ఆహార సబ్సిడీలపై కోత పెట్టడంతో పాటు ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించారని విమర్శించారు. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు అప్పు ఇస్తామని చెప్పారే తప్ప గ్రాంటు ఇవ్వ దానికి బడ్జెట్‌లో ప్రతిపాదన ఏమి లేదన్నారు. రాజధాని నిర్మాణం, పోలవరం నిర్మాణానికి నిధుల గ్రాంట్ల రూపంలో ఇవ్వాలి తప్ప అప్పుల రూపంలో కాదన్నారు జిల్లాను వెనుకబడిన ప్రాంతంగా గుర్తిస్తూ చేసి ప్రతిపాదన ఆహ్వానించ విషయమేనని, అయితే నిధుల పరిస్థితి ఏమి చెప్పలేదన్నారు. ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వంద రోజుల్లో రైల్వే, హైవే పనులను పూర్తిచేయాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 28: రైల్వే, హైవే పనులను వంద రోజుల్లో పూర్తిచేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రైల్వే, గ్రీన్‌ఫీల్డ్, 565 హైవే బాధితులతో జరగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే పనులకు సంబంధించి ప్రస్తుతం 20 కిమీటర్ల మేర రైతుల అభ్యంతరాలతో నిలిచిపోయాయన్నారు. కనిగిరి ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా రవాణరంగం మెరుగుపడాల్సిన అవసరరం ఉందన్నారు. అందులో భాగంగా 20 కి.మీ పరిధిలో భూమిని కోల్పోతున్న రైతులకు తగిన నష్టపరిహారంతో పాటు వారికి స్థలాలు కేటాయించి ఇళ్లను కూడా నిర్మించి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కనిగిరి ప్రాంతంలోని రైల్వేస్టేషన్ ఏర్పాటుకు ఆటంకంగా మారిన టేకు చెట్ల భూమికి తగిన నష్టపరిహారాన్ని ఇప్పించేలా ఎమ్మెల్యే అటవీశాఖ అధికారులతో మాట్లాడారు. గతంలో పలుమార్లు స్పందన కార్యక్రమంలో 498/2, 500/1 సర్వే నెంబర్లకు సంబంధించిన భూములు గ్రీన్‌ఫీల్డ్ హైవే కింద పోతున్నట్లు ఆర్డీవో జాన్ ఇర్విన్ వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నష్టపరిహారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న బైపాస్‌ను కూడా వంద రోజుల్లో పూర్తి చేయనున్నట్లు చెప్పారు. అందుకోసం ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్టపరిహారం ఇప్పటికే కలెక్టర్ వద్ద ఉందన్నారు. బైపాస్ కింద భూములు కోల్పోయే 30 మందికి పైగా రైతుల ఖాతాల్లో నగదును పది రోజుల్లో జమ చేయనున్నట్లు చెప్పారు.

గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, భూకబ్జాలు, భూ కుంభకోణాలపై సిట్ వేసినట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. అయితే, గత ప్రభుత్వంలో వైసీపీకి చెందిన సంబంధిత అక్రమార్కులు కొంతమంది సిట్ దర్యాప్తు సాగనివ్వకుండా అడ్డుకున్నట్లు చెప్పారు. తిరిగి సిట్ దర్యాప్తు ప్రారంభించి భూఅక్రమాలకు పాల్పడిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా హనుమంతునిపాడు మండలంలోని ఉమ్మనపల్లి పంచాయతీలో ప్రభుత్వానికి చెందిన సర్వే నెంబరు 1లో వందలాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయన్నారు. ఆయా భూముల అక్రమాలపై దర్యాప్తు వేగవంతం చేయనున్నట్లు ఆర్డీఓ చెప్పారు. అక్రమార్కులు ఎంతటివారైన ఉపేక్షించవద్దని ఎమ్మెల్యే ఆర్డీఓ జాన్‌ఇర్విన్‌ను ఆదేశించారు. సమావేశంలో రైతులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య మండల సమావేశం

» కార్యాలయానికి చేరుకున్న టీడీపీ, వైసీపీ వర్గీయులు

» బయటకు పంపించివేసిన పోలీసులు



మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర సునీత

ముండ్లమూరు, జూలై 28: పోలీసు బందోబస్తు మధ్య ముండ్లమూరు మండల సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా సాగింది. సమావేశానికి ఎంపీపీ సుంకర సునీత అధ్యక్షత వహించారు. అయితే, వైసీపీకి చెందిన అరుగురు ఎంపీటీసీ సభ్యులు శనివారం టీడీపీలో చేరారు. ఈక్రమంలో మండల సమావేశంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తే పరిస్థితి ఏర్పడటంతో పోలీసులు ముందుజాగ్రత్తగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉదయం 11.25 గంటలకు మండల సమావేశం ప్రారంభంకాగానే సతులకు బదులు పతులు రావటంతో ఎంపీడీవో ఆర్.జనార్దన్ జోక్యం చేసుకొని సభ్యులు కానివారు వెళ్ళిపోవాలని పదేపదే ఆదేశించారు. చివరికి చేసేదేమిలేక హాల్‌లో నుంచి బయటకు వెళ్ళిపోయారు. అదేసమయంలో ఎంపీపీ హాల్‌లో వైసీపీ నాయకులు, ఎంపీడీవో కార్యాలయ గదిలో టీడీపీ నాయకులు, కార్యాలయం ముందు ఇరువర్గాలు గుమిగూడారు. ఈక్రమంలో ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు తన సిబ్బందితో వెళ్ళి ఇరువర్గాలను కార్యాలయంలో నుంచి బయటకు పంపారు. బయట ఉన్న వ్యక్తులను కూడా పంపించివేయడంతో ఎలాంటి సమస్య లేకుండా మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది.

మొదట వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో ఏవో మహమ్మద్ ఫరూక్ మాట్లాడుతూ అర్హత ఉన్న కౌలు రైతులకు కార్డులు మంజూరుచేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 150 మందికి కార్డులు ఇచ్చినట్లు చెప్పారు. విద్యుత్ శాఖ ఏఈ వీరబ్రహ్మం మాట్లాడుతున్నక్రమంలో నూజెండ్లపల్లి ఎంపీటీసీ టి.బ్రహ్మం, మారెళ్ళ ఎంపీటీసీ పి.సుబ్బారావు జూనియర్ లైన్‌మెన్‌లు, ఎనర్జీ అసిస్టెంట్‌లు అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఏపీవో నాగరాజు మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వంద రోజుల పాటు పని దినాలు కల్పిస్తామన్నారు. పండ్ల తోటల రైతులకు రాయితీలు కల్పించి సాగును ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జడ్పీటీసీ టి.రత్నరాజు, పశువైద్యాధికారి విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ జి.పుల్లారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ ఎం.వెంకటేశ్వర్లు, ఈవోఆర్డీ శ్రీదేవి, వైస్ ఎంపీపీ వేముల పద్మ, బంకా రమణమ్మ, ఎంపీ టీసీలు పాలపర్తి సుబ్బారావు, తేలుకుట్ల బ్రహ్మయ్య, నాగమల్లి అంకారావు, పెదఅంజయ్య, తులసీబాయి, మహేశ్వరి, వెంకటేశ్వర్లు, గుణపాటి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తోటవెంగన్నపాలెం రోడ్డుకు మోక్షంలేదా!

» టీడీపీ హయాంలో మంజూరైన నిధులు రీటెండర్ పేరుతో రద్దు

» నిర్మాణం గురించి పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు


తారురోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన తోటవెంగన్నపాలెం రోడ్డు

తోటవెంగన్నపాలెం(తాళ్లూరు), జూలై 28: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తోటవెంగన్నపాలెం రోడ్డు నిర్మాణ పనులకు 2019లో నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ పూర్తయింది. అయితే, వైసీపీ ప్రభుత్వం రీటెండర్ అంటూ జారీ చేసిన ఆదేశాలతో పనులు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని దోసకాయలపాడు పంచాయతీ పరిధిలోని తోటవెంగన్నపాలెం గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయి. అయితే, గత వైసీపీ ప్రభుత్వంలో అడుగు ముందుకు పడలేదు. ఫలితంగా, ఈ రహదారి నిర్మాణానికి మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఆమార్గంలో గల దోర్నవాగుపై నిర్మించిన పైపు కల్వర్ట్ శిథిలావస్థకు చేరింది. దీంతో రాకపోకలకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికివెళ్లే మార్గంలో దోర్నవాగుపై ప్రజలు నిత్యం రాకపోకలు సాగించేందుకు 13ఏళ్ల క్రితం రెండు సిమెంట్ పైపులు వేసి తాత్కాలిక చప్టా నిర్మించారు. గత వైసీపీప్రభుత్వంలో గ్రామ పంచాయతీ నిధులతో చిన్న కల్వర్ట్ నిర్మాణం చేపట్టారు. నిత్యం అధిక సంఖ్యలో వాహనాలరాకపోకలతో రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయమైంది.

2019లో అప్పటి ఎమ్మెల్యే శిద్దా రాఘవరావు తోటవెంగనపాలెం గ్రామానికి బీటిరోడ్డు, కల్వర్ట్ నిర్మాణానికి ఒకకోటి 20లక్షల నిధులు మంజూరు చేయించారు. పనులు చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేశారు. 2019 ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రోడ్డు, కల్వర్ట్ నిర్మాణానికి నిధులు మంజూరయి నందున రోడ్డు, కల్వర్ట్ పనులు వేగవంతంగా జరిగి తమ సమస్యలు తీరుతాయని గామస్థులు ఆశించారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రీటెండర్ పేరిట మంజూరైన పనిని నిలుపుదల చేసి మరలా ప్రతిపాదనలు పంపారు.

గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్డు, కల్వర్ట్ నిర్మాణానికి పైసా మంజూరు కాలేదు. గత టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను రద్దు చేసి మరలా నిధులు మంజూరు చేయకపోవటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గోతులమయంగా మారి వాహనరాకపోకలకు తీవ్ర ఇబ్బందులుగా వున్నాయి. తూర్పుగంగవరం, దర్శి గ్రామాల్లోని విద్యాసంస్థలకు పిల్లలను తీసుకువెళ్లేందుకు వస్తున్న స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురవుతాయామోనని తల్లి దండ్రులు భయాందోళన చెందుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రోడ్డు , కల్వర్ట్ నిర్మాణానికి మంజూరైన నిధులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. ప్రస్తుతంకూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ కష్టాలు తీర్చాలని తోటవెంగనపాలెం గ్రామస్థులు కోరుతున్నారు.

వైసీపీ ప్రభుత్వం నిధులను రద్దు చేసింది

- కూటాల రవి, తోటవెంగన్నపాలెం



టీడీపీ ప్రభుత్వం తోటవెంగన్నపాలెం గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు, కల్వర్ట్ నిర్మాణానికి కోటి 20లక్షల నిధులు మంజూరు చేసింది. రీటెండర్ పేరుతో గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి ఐదేళ్ల పాలనలో నిధులు మంజూరు చేయలేదు. రోడ్డు గుంతలుగా ఉండి రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అధికా యంత్రాంగం స్పందించి నిధులు సమకూర్చి పనులు ప్రారంభించి సమస్యలు తొలగించాలి.

‘మా వాటా నిధులు ఇవ్వండి’

మార్టూరు, జూలై 28: మూడేళ్ల నుంచి అడుగుతున్నా ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. మా గ్రామాలలో ఒక్క పనినీ చేయలేకపోయాం. మండల పరిషత్ నిధులు మీ ఇష్టం వచ్చిన పనులకు వినియోగిస్తారా.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ఓట్లు అడగడానికి వెళితే.. జనం అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయామని బొబ్బేపల్లి, వలపర్ల ఎంపీటీసీ సభ్యులు దండా హరిబాబు, జంజనం పద్మ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశా రు. ఆదివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎంపీపీ భుక్యా శాంతిబాయి అధ్యక్షత వహించారు. గత మూడేళ్లలో మండల పరిషత్ నిధులతో బొబ్బేపల్లి గ్రామంలో చిన్నపని కూడా చేయలేకపోయామని,మండలపరిషత్ నిధులుతో వారికి ఇష్టమైనపనులు చేసుకున్నారని ఎంపీటీసీ సభ్యుడు హరిబాబు సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఏళ్ల తరబడి శిథిల మైన విద్యుత్ స్తంభాలున్నాయని, వాటిని తొలగించాలని గత మూడు సమావేశాలలో మొరపెట్టుకున్నా ఇంతవరకు సమస్య పరిష్కరించలేదన్నారు. అదేవిధంగా వలపర్లలోని గరటయ్య కాలనీలో సైడు కాల్వలు తీయాలని, సీసీ రోడ్డు వేయాలని ఎన్నిసార్లు మీటింగ్‌లో చెప్పినా ఇంతవరకు పట్టించుకోలేదని ఎంపీటీసీ సభ్యులు పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. బొబ్బేపల్లి, ద్రోణాదుల, రాజుగారిపాలెం తదితర గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు విద్యుత్ సమస్యలను ప్రస్తావించారు. సమావేశానికి విద్యుత్ అధికారులు రాకపోవడం పట్ల వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు కూడా సమావేశానికి హాజరుకాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఎంపీడీవో నితిన్ మాట్లాడుతూ సమావేశానికి హాజరుకాని శాఖలకు చెందిన అధికారులపై కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు. మండల వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ మాట్లాడుతూ పచ్చిరొట్టె ఎరువులను 50 శాతం, కందులను 30 శాతం రాయితీతో అందజేస్తామన్నారు. ఉద్యాన అధికారి బీ హనుమంతనాయక్ మాట్లాడుతూ కూరగాయలు, పూలతోటలను పెంచే రైతులకు సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. మినీ ట్రాక్టర్లు కావలసిన రైతులు ఉద్యాన శాఖను సంప్రదించాలన్నారు. అనంతరం హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ మండలంలో వివిధ దశలలో 718 ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయని వాటిని వెంటనే పూర్తయ్యేవిధంగా ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన వారు ప్రభుత్వ పథకాలకు సంబంధించి, ప్రజలకు ఉపయోగకరంగా ఉండేందుకు అవసరమైన వివరాలను గ్రామ సచివాలయాలకు పంపించాలని సభ్యులు అధికారులను కోరారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ చుండి సుజ్ఞానమ్మ, వెలుగు ఏపీఎం రాజారత్నం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కార్గిల్ అమరజవానులను స్మరించుకోవాలి

ఒంగోలు(రూరల్), జూలై 28: కార్గిల్‌యుద్ధంలో అమరులైన జవానులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ అధ్యక్షుడు నిప్పల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో ఆదివారం కార్గిల్‌విజయ్‌దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కార్గిల్ విజయోత్సవస్థూపం వద్ద మాజీ సైనికులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సభలో నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో మన సైనికులు పాకిస్థాన్ సైనికులను తరిమికొట్టారన్నారు. మన దేశ సైనికులు ప్రాణాలను సైతం లెక్క చేయలేదని చెప్పారు. మన సైనిక వ్యవస్థ ప్రపంచ దేశాలకు దీటుగా ఉందన్నారు. కల్నల్ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కూడా ఎన్‌డీఏలో ప్రవేశాలు పొందాలన్నారు. తెలుగువారి సంఖ్య దేశ సైనికవ్యవస్థలో బలంగా ఉండాలని, మాజీ సైనికులు తమ పిల్లలను సైన్యంలోకి ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా 70 ఏళ్లు నిండిన మాజీసైనికులను శాలువలతో సత్కరించారు.


రోడ్డుపై ఇరుకుగా నిర్మించిన కల్వర్టు రక్షణ గోడలు

ప్రమాదకరంగా రక్షణ గోడలు

పీసీపల్లి, జూలై 28: ప్రమాదకరంగా రక్షణ గోడలు మారాయి. మండలంలోని పెదఅలవలపాడు -బొట్లగూడూరు రోడ్డులోని మారెళ్ల సమీపంలో గతంలో నేల చప్టా ఉంది. ఈ రోడ్డు మలుపు వద్ద ఇరుకుగా కల్వర్టును నిర్మించారు.ఈ కల్వర్టుకు రక్షణ గోడలు కూడా రోడ్డుమీదకే కట్టారు. దగ్గరగా వంతెన నిర్మాణం చేపటట్టంతో గతంలో పలు వాహనాలు ప్రమాదానికి గురై పలువురు గాయపడ్డారు. లక్షల రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన ఈ కల్వర్టు ప్రమాదానికి నిలయంగా మారింది. అయితే, రోడ్డును విస్తరించే క్రమంలో భాగంగా ఇటీవల రోడ్డు వెడల్పు చేయడంతో పాటు కొత్తగా కల్వర్టును నిర్మించారు. ప్రస్తుతం ఒకే ప్రాంతంలో పక్కపక్కనే నాలుగు కల్వర్టులు ఉన్నాయి. తొలుత కల్వర్టు నిర్మించే సమయంలోనే పైపులు పెంచి విశాలంగా నిర్మించి ఉంటే రెండోసారి కల్వర్టులు నిర్మించాల్సిన అవసరం ఉండేది కాదు. ప్రజాధనం వృధా అయ్యేది కాదు. ఇప్పుడు రోడ్డు విస్తరణ పక్కనే గతంలో నిర్మించిన కల్వర్టు గోడలను తొలగించకుండా అడ్డంగా అలాగే వదిలేశారు. దీంతో రాత్రివేళల్లో ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. పాత కల్వర్టుపై ఇరుకుగా ఉన్న రక్షణ గోడలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

మొక్కలునాటి సంరక్షించాలి

ముండ్లమూరు, జూలై 28: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని టీడీపీ లీగల్‌సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని పెదఉల్లగల్లులో ప్రకృతిని ప్రేమించండి, పర్యావరణాన్ని రక్షించండి అనే నినాదంతో మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. నేటి సమాజంలో అటవీ సంపద తగ్గి పోతుందని, వాటిని సంరక్షించే బాధ్యత మా నవులపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రమేష్, సాంబ, పవన్, శ్రీనిసరావు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేపట్టాలి

పామూరు, జూలై 28: మానవత సంస్థ బలోపేతంతోపాటు సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టి కొత్త సభ్యులను చేర్పించాలని సంస్థ అధ్యక్షడు పి.తిరుపతిరెడ్డి అన్నారు. స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ సేవలను విస్తృతం చేయాలని సూచించారు. నూతన కమిటీ ఎన్నిక ఆగస్టు 4న జరుగుతుందన్నారు. సమావేశంలో కన్వీనర్ వి.వెంకటేశ్వరరెడ్డి, ఎం.ముసలయ్య, టి.రమేష్, కె.నాగేశ్వరరావు, వై.వెంకటసుబ్బయ్య, బీఎస్ రంగారెడ్డి, పి.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.





నిండు కుండలా శ్రీశైలం జలాశయం



సంఘటన స్థలంలో బోల్తా పడిన ట్రాక్టర్, చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

మొక్కుబడికి వెళ్తుండగా.. ఘోరం

చికిత్స, ఆర్థిక సాయంపై మంత్రి అనగాని ఆదేశాలు

ట్రాక్టర్ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందించారు. బాపట్ల ప్రభుత్వ వైద్యశాలకు ఫోన్ చేసి బాధితులకు తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందించాలని, అవసరమైతే గుంటూరు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటమురళికి సూచించారు. దీంతో జేసీ సుబ్బారావు ఆస్పత్రి వద్దకు వచ్చి ఘటన వివరాలు, బాధితులకు కావాల్సిన వైద్య సహాయంపై వైద్యులతో చర్చించారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఘటన బాధాకరమని మంత్రి అనగాని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.25 వేలు చొప్పున, గాయపడినవారికి రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయాన్ని మంత్రి సోదరుడు శివప్రసాద్ అందజేశారు.

- ముగ్గురు మృతి.. 11 మందికి తీవ్రగాయాలు
- దమ్మనవారిపాలెం వద్ద ట్రాక్టర్ ట్రక్కు బోల్తా
- గుట్టువారిపాలెంలో విషాదం

బాపట్ల, రేపల్లె, జూలై 28: మొక్కు తీర్చుకోవాలని బంధువులందరూ కలిసి ట్రాక్టర్‌లో బయల్దేరారు. అయితే ఇరుకు రోడ్డులో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా పడటంతో ఘోరం జరిగింది. దైవ దర్శనానికి వెళ్లే ఆనందంలో ఉన్న ముగ్గురు మృతి చెందగా 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం వద్ద జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. నగరం మండలం గట్టువారిపాలెం గ్రామానికి చెందిన గట్టు వెంకటేశ్వరమ్మ కొండపాటూరు పోలేరమ్మతల్లికి మొక్కుకుంది. ఈ క్రమంలో ఆమె మొక్కు తీర్చుకునేందుకు ఆదివారం కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు 20 మందితో కలిసి ట్రాక్టర్‌లో కాకుమాను మండలం కొండపాటూరు పోలేరమ్మతల్లి గుడికి బయలుదేరారు. వీరి ట్రాక్టర్ కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామ శివారు వచ్చే సరికి బాపట్ల నుంచి రేపల్లె వెళ్తున్న బస్సు ఎదురైంది. ఆ బస్సును తప్పించేందుకు ట్రాక్టర్ డ్రైవర్ రోడ్డు దిగువనకు వెళ్లాడు. దీంతో ట్రాక్టర్ ట్రక్కుతో సహా బోల్తా కొడుతూ ఐదారడుగుల లోతులో ఉన్న పొలాల్లో పడిపోయింది. ట్రక్కులో ఉన్న గట్టు కోటేశ్వరరావు(65), గడ్డం శివనాగులు(60), గడ్డం లక్ష్మి(40) అక్కడికక్కడే మృతి చెందారు. పాలెం శేషమ్మ, ఇమ్మడిశెట్టి నాగలక్ష్మి, పాలెం పుష్పావతి, కాట్రగడ్డ లక్ష్మి, మక్కె రమాదేవి, పాలెం కృష్ణకుమారి, పాలెం సీతామహలక్ష్మి, పాలెం శివకుమారి, ఇమ్మడిశెట్టి రాఘవమ్మ, పాలెం సుబ్బరావమ్మ, కాట్రగడ్డ సుజాత తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులతో కలిసి హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గలకారణాలను డీఎస్పీ సి.హెచ్.మురళీకృష్ణ, సీఐలు శ్రీహరి, హజరత్‌బాబులను అడిగి తెలుసుకున్నారు. స్థానికుల సాయంతో ట్రాక్టర్ కిందపడి దుర్మరణం చెందినవారిని బయటకు తీయించారు. క్షతగాత్రులను ఏరియా వైద్యశాలకు తరలించారు. పుష్పావతి, కృష్ణకుమారి, రమాదేవి, లక్ష్మిలను మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ఆస్పత్రికి, నాగలక్ష్మిని తెనాలి వైద్యశాలకు తరలించారు. మృతి చెందిన కోటేశ్వరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె, శివనాగులుకు ఇద్దరు అమ్మాయిలు, ఒక కుమారుడు, లక్ష్మికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాద సమాచారం తెలియడంతో మృతుల బంధువులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో బాపట్ల ఏరియా వైద్యశాల వద్దకు తరలివచ్చారు. దైవదర్శనానికి వెళ్లేందుకు ఉదయం అందరూ ఉత్సాహంగా వెళ్తుండగా గ్రామస్తులు వీడ్కోలు పలికారు. కొద్దిసేపటికే ముగ్గురు మృతి చెందారని, 11 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలియడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.



మృతులు గట్టు కోటేశ్వరరావు, లక్ష్మీ, శివనాగులు

బిర బిరా కృష్ణమ్మ

- రెండు రోజుల్లో నిండనున్న శ్రీశైలం
- సాగర్‌కు 77,771 క్యూసెక్కుల ప్రవాహం
- నేడు శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తేందుకు ఆదేశాలు
- సాగర్ ఆయకట్టులో పూర్తిగా మారిన సాగు చిత్రం
- ప్రత్యామ్నాయ సాగును తాత్కాలికంగా నిలిపిన రైతులు
- వరి సాగు దిశగా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్న అన్నదాతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వస్తోంది. దీంతో జలకళ సంతరించుకుంది. నాగార్జున సాగర్ జలాశయం దిశగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కు తోంది. సాగర్ డ్యాంకు కూడా రోజురోజుకు వరద పెరుగుతోంది. శ్రీశైలం జలాశయంలోకి ఆదివారం 4,41,222 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలంలో 215.81 టీఎంసీలకు 155.78 టీఎంసీలకు చేరింది. శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సాగర్‌కు 77,771 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలశయానికి ఇదే స్థాయిలో వరద మూడు రోజులు కొనసాగుతుందని జల వనరుల శాఖ అంచనా వేస్తోంది. ఈ క్రమంలో సోమవారం శ్రీశైలం గేట్లు ఎత్తి సాగర్‌కు నీటిని విడుదలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శ్రీశైలానికి వరద పోటెత్తుతుం డటంతో సాగర్ ఆయకట్టులో సాగు చిత్రం రెండు రోజుల్లోనే మారిపో యింది. వరి సాగుపై అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. శ్రీశైలం నిండి సాగర్‌కు నీరు వస్తుందన్న అంచనాతో ప్రత్యామ్నాయ పంటల సాగును తాత్కాలికంగా నిలిపి వేశారు. సాగు నీరు వస్తుంది వరి సాగు చేసే అవకాశాలు ఉన్నాయని రైతులు అభిప్రాయ పడుతున్నారు. ఈ దిశగా సాగు ప్రణాళికను మార్చుకుని వరి సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

శ్రీశైలానికి 173 టీఎంసీల నీరు రాక

ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర జలాశయాల నుంచి దిగువకు దాదాపు నాలుగు లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలంలో నీటి మట్టం అంతకంతకు పెరుగుతోంది. ఐదు రోజుల్లో శ్రీశైలానికి 123.27 టీఎంసీల నీరు వచ్చింది. సాగర్‌లో కూడా నీటి నిల్వ ఆశాజనకంగా పెరుగుతోంది. శ్రీశైలం ఎగువ ప్రాజెక్టుల నుంచి విడుదల చేస్తున్న వరద నీటిని లెక్కిస్తే శ్రీశైలానికి దాదాపు ఇంకా 173 టీఎంసీల నీరు వస్తుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఈ లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే సాగర్‌కు దాదాపు 125 టీఎంసీల వరకు నీరు వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాగు నీటి అవసరాలకు కుడి కాల్వకు సాగర్ నుంచి 8,212 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వరద వివరాలపై రైతుల ఆసక్తి

ఆల్మట్టి నుంచి నీరు ఎంత విడుదల చేస్తున్నారు.. శ్రీశైలం ఎప్పుడు నిండుతుంది.. ఏ జలాశయానికి ఎంత వరద వస్తుంది.. ఇలా సాగర్ కుడి కాలువ ఆయకట్టు రైతులు ఎప్పటికప్పుడు వరద వివరాలు తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మీడియా, అంతర్జాలం ద్వారా ఆయా వివరా లను గమనిస్తున్నారు. ఏ ఇద్దరు రైతులు కలిసినా జలాశయాలకు వస్తున్న వరద నీటిపై లెక్కలు వేసుకుంటున్నారు. కృష్ణానది బేసిన్‌లో నమోదవుతున్న వర్షపాతం వివరాలను అన్నదాతలు ఆసక్తిగా గమనిస్తున్నారు. సాగర్‌కు ఎంత నీరు వచ్చే అవకాశం ఉందన్న అంశాన్ని కూడా వారు టీఎంసీలలో లెక్కలు కడుతున్నారు. సాగర్‌కు వరద నీరు వస్తుండటంతో అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది సాగు నీరు లేక లక్షలాది ఎకరాలు బీళ్లుగా మారిన నేపథ్యంలో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఈ ఏడాదైనా సాగు నీరు వస్తుందని ఆశపడుతున్నారు. కృష్ణమ్మ పర వళ్లు కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు.

జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...

జలాశయం	పూర్తి స్థాయి నీటి నిల్వ టీఎంసీలలో	ప్రస్తుత నిల్వ టీఎంసీలలో	వస్తున్న వరద నీరు క్యూసెక్కుల్లో	విడుదల చేస్తున్న నీరు క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	123.08	76.69	2,18,230	2,96,794
నారాయణపూర్	33.31	25.65	2,90,042	3,03,925
జూరాల	9.66	7.63	2,99,432	2,88,424
తుంగభద్ర	105.78	100.52	1,03,676	1,17,691
శ్రీశైలం	215.81	155.78	4,41,222	80,711
నాగార్జున సాగర్	312.05	132.98	53,677	6,344
పులిచింతల	45.77	1.06	50	50

మళ్లీ.. మినీ గోకులాలు



గోకులం పథకం కింద నాడు నిర్మించిన షెడ్

షెడ్ల మంజూరు జిల్లాల వారీగా

జిల్లా	మంజూరైన షెడ్లు
పల్నాడు	700
గుంటూరు	450
బాపట్ల	625

పాడి, జీవాలు, కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిం చేందుకు.., వాటి పోషకులకు చేయూత ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది. గతంలో టీడీపీ ప్రభుత్వంలో మినీ గోకులాలను ఏర్పాటు చేసి పోషకులను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్స హించారు. ఎక్కడి కక్కడ పాడి పశువులు, జీవాలు, కోళ్ల కోసం షెడ్లను నిర్మించేలా మినీ గోకులాలను మంజూరు చేశారు. అయితే 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం మినీ గోకులాలను విస్మరించింది. దీంతో పోషకు లకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. అయితే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో మినీ గోకులాల పథకాన్ని ప్రవేశ పెట్టి, షెడ్ల నిర్మాణానికి లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ప్రభు త్వం సిద్ధమైంది. జాతీయ ఉపాధి హామీ పథకం కింద మినీ గోకులాలకు నిధులు విడుదల చేసేలా ప్రభుత్వం విధివిధానాలను ఖరారు చేసింది.

- పశు పోషకులకు ప్రభుత్వ చేయూత
- గతంలోలా షెడ్ల నిర్మాణానికి పచ్చజెండా
- ఉమ్మడి గుంటూరు జిల్లాకు 1,775 షెడ్ల నిర్మాణం
- రాయితీలతో మండలానికి 25 యూనిట్లు మంజూరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పాడి పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. గేదెలు, జీవాలు, కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించింది. వాటి పెంపకంలో ప్రధాన ప్రతిబంధకంగా ఉండే షెడ్ల నిర్మాణానికి ప్రత్యేకంగా గతంలోనే టీడీపీ ప్రభుత్వం మినీ గోకులాల పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ మినీ గోకులాల పథకాన్ని ప్రవేశపెట్టింది. గతంలోలా మినీ గోకులం నిర్మాణాలకు పచ్చజెండా ఊపింది. షెడ్ల నిర్మాణంలో పశు పోషకులకు 90 శాతం, జీవాలు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం మేర రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి మార్గదర్శకాలు జారీ చేశారు. పశు సంవర్థక శాఖ అధ్వర్యంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులు విడుదల చేయనున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు 1,775 షెడ్లను మంజూరు చేశారు. 2018లో టీడీపీ హయాంలో తొలుత మినీ గోకులం పథకాన్ని ప్రారంభించారు. అప్పట్లో విస్తృతంగా మినీ గోకులాలను నిర్మించారు. ఇదే తరహాలో మళ్లీ గోకులం పథకాన్ని చంద్రబాబు ప్రవేశపెట్టారు. పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకందారులకు ఆర్థికంగా చేయూత అందించే క్రమంలో ఈ పథకాన్ని ప్రభుత్వం మళ్లీ ప్రవేశపెట్టింది. పశువుల షెడ్లకు లబ్ధిదారుడు 10 శాతం చెల్లిస్తే 90 శాతం ప్రభుత్వం నిధులు ఇస్తుంది. కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకందారులు వారి వాటా ధనం మొత్తం వ్యయంలో 30 శాతం చెల్లిస్తే 70 శాతం ప్రభుత్వం ఇస్తుంది. తొలి విడతలో మండలానికి 25 యూనిట్లు ఇవ్వాలని నిర్ణయించారు. సొంత స్థలం ఉన్న చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ పోషకులకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

నాటి బిల్లులు చెల్లించలేదు

మినీ గోకులం పథకం కింద టీడీపీ హయాంలో రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ఈ బిల్లులను పక్కన పెట్టేశారు. అయితే తాజాగా మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో ఇప్పటికైనా మోక్షం కలుగుతుందని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. నాలుగు పశువులు ఉంటే రూ.1.5 లక్షలు, ఆరు పశువులకు రూ.1.8 లక్షలు చొప్పున నిధులు కేటాయించింది. రైతులు అప్పట్లో పనులు ప్రారంభించి నిర్మాణాలు పూర్తి చేశారు. ఇంతలో ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో మినీ గోకులం బిల్లులు మంజూరు చేయలేదు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో దాదాపు రూ.106 కోట్లు బిల్లుల బకాయిలు ఉన్నట్లు పశు సంవర్ధకశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. నిర్మాణాల బిల్లులు చెల్లించాలని పోషకులు పలుమార్లు ఆందోళనలు చేపట్టినా వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. అయితే కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించి న్యాయం చేస్తుందని రైతులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు.

పశువుల గోకులం వివరాలు (రూ.లక్షల్లో)

షెడ్డు పరిధి	వ్యయం	రాయితీ	లబ్ధిదారు వాటా
2 పశువులు	1,15,000	1,03,500	11,500
4 ఉంటే	1,85,000	1,66,500	18,500
6 మించి	230,000	2,07,500	23,000

గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల వివరాలు (రూ.లక్షల్లో)

షెడ్డు పరిధి	వ్యయం	రాయితీ	లబ్ధిదారు వాటా
20 గొర్రెలు, మేకలు	1,31,000	91,000	39,000
50 దాటితే	2,30,000	1,61,000	69,000
100 కోళ్లు ఉంటే	87,000	60,900	26,100
200 పైగా ఉంటే	1,32,000	92,000	39,600

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

- ఎమ్మెల్యేల సిఫార్సుల మేరకే..


గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల కోసం జోన్-4లో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో విధుల నిర్వహణ కోసం వెళ్లిన తహసీల్దార్లు వెనక్కు రాగా వారికి కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి వేర్వేరు మండలాల్లో పోస్టింగ్‌లు కల్పించారు. అయితే ఈ పోస్టింగ్‌ల్లో ఎక్కువ శాతం స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సుల ఆధారంగానే జరిగాయన్న ఆరోపణలు వస్తున్నాయి. శనివారం రాత్రికే తహసీల్దార్ల పోస్టింగ్‌ల ఆర్డర్ అయినప్పటికీ వాటిని ఆదివారం ఉదయం విడుదల చేశారు. ఐదు మండలాలను ఖాళీగా పెట్టి వాటికి డిప్యూటీ తహసీల్దార్లను ఇన్‌చార్జిలుగా పూర్తి అదనపు బాధ్యలు కేటాయించారు. పెద్దగా సిఫార్సులు తెచ్చుకోలేని వారికి కలెక్టరేట్, ఆర్‌డీవో కార్యాలయాల్లో పోస్టింగ్‌లు లభించాయని రెవెన్యూవర్గాలు చర్చించుకుంటున్నాయి. తహసీల్దార్ల పోస్టింగ్‌ల కోసం తెరవెనక సిఫార్సులు పెద్దఎత్తున జరిగాయని తెలిసింది. అమరావతి రాజధాని వెలుపల ఉన్న తాడికొండలో పోస్టింగ్ హాట్ కేక్‌లా మారింది. ప్రస్తుతం రాజధానిలో కంటే ఈ మండలంలోనే భూముల క్రయవిక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ దృష్ట్యా ఈ మండలంపై ఏకంగా 11 మంది తహసీల్దార్లు కన్నేసి ఎవరి ప్రయత్నాలు వారు చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఉన్నతాధికారుల ద్వారా కూడా ప్రయత్నాలు చేశారని తెలిసింది. గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ పోస్టింగ్ విషయంలో ఇద్దరు టీడీపీ నేతల మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయని సమాచారం. తాము సూచించిన తహసీల్దార్‌కే పోస్టింగ్ ఇవ్వాలని వారిద్దరూ పట్టు బట్టారని తెలిసింది. అయితే ఓటర్లు అధికంగా ఉన్న గుంటూరు పశ్చిమ మండల నేత మాటే చివరికి నెగ్గింది. పెదకాకాని మండలానికి రెండేళ్ల క్రితం డిప్యూటేషన్‌పై వచ్చిన ఏపీ సచివాలయం ఉద్యోగి ఇక్కడే కొనసాగేందుకు శతవిధాల ప్రయత్నించారన్న చర్చ జరుగుతున్నది. తహసీల్దార్ల కొరత ఉండటంతో ఐదు మండలాలను ఖాళీగా పెట్టారు. వచ్చే నెలలో జరిగే సాధారణ బదిలీల్లో వాటికి పూర్తిస్థాయి తహసీల్దార్లను నియమించే అవకాశం ఉన్నది.

తహసీల్దార్లకు మండలాలు ఇలా..

జీవీఎస్ ఫణీంద్రబాబు(గుంటూరుపశ్చిమ), డీ పద్మనాభుడు(మేడికొండూరు), ఎస్ శ్రీకాంత్ కేదార్‌నాథ్ (పెదనందిపాడు), జీ నాంచారయ్య (ఫిరంగిపురం), కే రవిబాబు(ప్రత్తిపాడు), కే నాసరయ్య (తాడికొండ), జీ సిద్ధార్థ(కొల్లిపర), కే శ్రీనివాసశర్మ (చేబ్రోలు), బీ వెంకటస్వామి(కాకుమాను), షేక్ మెహబూబ్‌సుభాని (మంగళగిరి), కేవీ గోపాలకృష్ణ (తెనాలి), పీ నగేష్(పెదకాకాని), ఎం నాగిరెడ్డి(వట్టిచెరుకూరు), ఎం పూర్ణచంద్రరావు (కలెక్టరేట్ ఏవో), కే మల్లీశ్వరి(కలెక్టరేట్ మేజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్), కే సాంబశివరావు(కలెక్టరేట్ భూ వ్యవహారాల సెక్షన్ సూపరింటెండెంట్), షేక్ ఇస్మాయిల్(కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరిం టెండెంట్), కే కల్యాణి(గుంటూరు ఆర్‌డీవో కార్యాలయం డీఏవో), జే ప్రసాదరావు(తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం డీఏవో)గా పోస్టింగ్‌లు పొందారు. కాగా దుగ్గిరాల డీటీయూ రాజేష్, తాడేపల్లి డీటీ ఎస్ సతీష్, తుళ్లూరు డీటీ వసంతరావు, గుంటూరు తూర్పు డీటీ షేక్ రిజ్వాన్, పొన్నూరు డీటీ ప్రశాంతిని ఆయా మండలాలకు ఇన్‌చార్జి తహసీల్దార్లుగా తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు పూర్తి అదనపు బాధ్యతలు కల్పించారు. పెదకాకాని తహసీల్దార్ రత్నంని రిలీవింగ్ చేసి తదుపరి పోస్టింగ్ కోసం జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

- ప్రాంతాల వారీగా తవ్వకాలు, హద్దులు
- ప్రభుత్వ డంప్‌లో నిండుకున్న నిల్వలు
- ఇదే అదనుగా రెచ్చిపోతున్న ఇసుకాసురులు



పందిళ్లపల్లి పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం నుంచి రైల్వేట్రాక్ సమీపంలో అక్రమ తవ్వకాలతో, నిల్వ చేసిన ఇసుక కుప్పలు

చీరాల, జూలై 28: చీరాల నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రైవేటు, అసైన్డ్, సొసలను కూడా వదలకుండా పలు ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు, రవాణా సాగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా కొనసాగుతూనే ఉన్నాయి. వేటపాలెం మండలం పందిళ్లపల్లి సమీపంలో ప్రభుత్వం ఇసుక డంప్‌ను ఏర్పాటు చేసింది. ఇదిలా ఉంటే ఈ డంప్‌లో ఇసుక ఆదివారానికి నిండుకుంది. అయితే జనసేనకి చెందిన ఓ నేత, టీడీపీకి చెందిన ఓ నేత అనుచరులు కొందరు దందా సాగిస్తున్నారు. అనుమతి పేరుతో కనికట్టు చేసే ఓ వ్యక్తి వేటపాలెం మండల పరిధిలో మొత్తం తన ఛత్రం కిందకు తెచ్చుకునే ప్రయత్నాలు ఆరంభించాడు. ఈ క్రమంలో అక్కడ ఆధిపత్యపోరు మొదలైంది. చీరాల మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు రవాణా బాహాటంగానే జరుగుతోంది. ఈపురుపాలెం పరిధిలో అందరికీ ముద్దు పేరుతో చిరపరిచితుడు, సంబంధిత శాఖలను ప్రసన్నం చేసుకోవడంలో సిద్ధహస్తుడిగా పేరుపొందిన వ్యక్తి జోరుగా క్వారీలలో అక్రమ తవ్వకాలు, రవాణా సాగిస్తున్నాడు. చీరాల, వేటపాలెం మండలాల పరిధిలో ఓ ముగ్గురు సిండికేట్‌గా అవగాహనతో పలు గ్రామాల్లో తమ దందా సాగిస్తున్నారు. వీరికి నలుగురు ఆయారాం... గయారాంలు తోడయ్యారు. ప్రభుత్వ డంప్‌లో టన్ను ఇసుక ధరను రూ.675 ఉంది. ఆ ధరను వీలైనంత తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ డంప్‌లో ట్రాక్టర్ (నాలుగున్నర టన్నులు) ఇసుకు రూ.3,038 పడుతోంది (బాడుగ అదనం). అయితే అక్రమార్కులు బాడుగతో కలిపి ట్రాక్టరు ఇసుకను రూ.3,500 నుంచి రూ.4వేల మధ్య విక్రయిస్తున్నారు. అక్రమ తవ్వకాలు, రవాణాపై ఉక్కుపాదం మోపాలని అప్పుడే ప్రభుత్వంపై అపవ్రద పడకుండా ఉంటుందని ప్రజలు సూచిస్తున్నారు.



ప్రభుత్వ డంప్‌లో నిండుకున్న ఇసుక


ఒకరోజు శిక్షణకు వెళ్లిన కలెక్టర్

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 28: హైదరాబాద్‌లో సోమవారం ఎన్నికల కమిషన్ ఏర్పాటుచేసిన ఒక రోజు శిక్షణలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొననున్నారు. అందుకోసం ఆమె హైదరాబాద్ వెళ్లారు.

బస్సులు లేక విద్యార్థుల అవస్థలు

బల్లికురవ, జూలై 28 : మండలంలోని పలు మార్గాల్లో ఆర్టీసీ బస్సులు లేక విద్యార్థులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అద్దంకి ఆర్టీసీ డిపో నుంచి బల్లికురవ కొణిదెన చిలకలూరిపేట నైట్ హాల్ట్ బస్సును అధికారులు రద్దు చేయడంతో పలు గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బస్సు సౌకర్యం లేక ప్రజలు పట్టణాలకు వెళితే తిరిగి గమ్యానికి సకాలంలో రాలేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. ప్రమాదాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అలానే మండలంలోని కొత్తూరు గ్రామం నుంచి తమ పిల్లలు పాఠశాలలకు రావాలంటే బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని అగ్రామ ప్రజలు అద్దంకి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ అధికారులు వెంటనే గ్రామాలలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా బస్సులను నడపాలని ప్రజలు కోరుతున్నారు.

జోరుగా వ్యవసాయ మోటార్ల దొంగతనాలు



ఉప్పుమాగులూరులో చోరీ అయిన ఎత్తిపోతల పథకం మోటార్లు

బల్లికురవ, జూలై 28 : వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, కేబుల్ వైర్లే లక్ష్యంగా గ్రామాలలో పెద్ద ఎత్తున గుర్తు తెలియని దొంగలు రాత్రుళ్లు చోరీలకు పాల్పడుతున్నారు. వ్యవసాయ సీజన్ కావడం వలన రైతులు మోటార్లు పనిచేయక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దొంగలు గ్రామాలను లక్ష్యంగా చేసుకొని ఒకే రాత్రి పెద్ద ఎత్తున కేబుల్ వైర్లను, ప్యానల్ బోర్డులను తస్కరిస్తున్నారు. పంట పొలాలకు వెళ్లిన రైతులకు మోటార్లు లేకపోవడంతో తీవ్రఆందోళన చెందుతున్నారు. తాజాగా మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ఉన్న వేణుగోపాల స్వామి ఎత్తిపోతల పథకంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు విలువ చేసే మోటార్లను, బోర్డులను ఎత్తుకెళ్లారు.

ఎత్తిపోతల పథకం పక్కనే ఉన్న అయినాల రామారావు అను రైతుకు చెందిన వ్యవసాయ పొలంలో ఉన్న మోటార్‌ను కూడా దొంగిలించారు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు వ్యవసాయ మోటార్ లేకపోవడంతో చూసి పక్కనే ఉన్న ఎత్తిపోతల పథకం తలుపుల తాళం పగులగొట్టి ఉండటం చూసి వెంటనే గ్రామంలోని రైతులకు తెలియపరిచి బల్లికురవ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఇటీవల పది రోజుల వ్యవధిలోనే మండలంలోని కొత్తూరు, గొర్రెపాడు, కూకట్లపల్లి, గుంటుపల్లి, వల్లాపల్లి, కొత్తపాలెం, కొమ్మినేనివారిపాలెం నక్కబొక్కలపాడు గ్రామాల పరిధిలో వ్యవసాయ మోటార్లు మరియు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల రాగి వైర్లు, సోలార్ ప్యానల్ బోర్డులను రాత్రుళ్లు గుర్తు తెలియని దొంగలు ఏక కాలంలో పలు గ్రామాలలో దొంగిలించారు. పలువురు రైతులు తమ మోటార్ల చోరీపై ఫిర్యాదులు కూడా చేశారు. అయినప్పటికీ పోలీసు శాఖ పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు.

వ్యవసాయ సీజన్‌లో చోరీలు రైతులను భయాందోళన కలిగిస్తున్నాయి. రైతుల మోటార్ల చోరీలపై వెంటనే నిఘా పెట్టి దొంగలను పట్టుకోవాలని పలు గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు.

జనసేన పార్టీ సభ్యత్వాల నమోదులో చీరాల ఫస్ట్

చీరాల, జూలై 28 : జనసేన పార్టీ నాల్గవ విడత సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు కొనసాగింది. జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర ప్రోగ్రామ్ కమిటీ కన్వీనర్, చీరాల నియోజకవర్గ సభ్యత్వ నమోదు పరిశీలకుడు ఆల అనిల్ 18వ తేదీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, వాడరేవు బస్టాండ్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. అక్కడ నుంచి ఆయన దిశానిర్దేశం మేర కు పార్టీ శ్రేణులు సమిష్టి కృషితో నిర్ణీత కాలవ్యవధిలో సభ్యత్వ నమోదులో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆదివారంతో సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగిసింది.

అందిన సమాచారం మేరకు.. చీరాల నియోజకవర్గంలో అత్యధికంగా 4,518 మంది సభ్యత్వాలు స్వీకరించారు. తరువాత రేపల్లె నియోజకవర్గంలో 3,514 మంది, పర్చూరు నియోజకవర్గంలో 3,334, వేమూరు నియోజకవర్గంలో 2,798, బాపట్ల నియోజకవర్గంలో 2,052, అద్దంకి నియోజవకర్గంలో 1,960 మంది సభ్యత్వాలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో చీరాల నియోజకవర్గంలో విస్తృతంగా కృషి చేసిన పార్టీ శ్రేణులకు పరిశీలకుడు ఆల అనిల్ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశంలో ఆయన మాటలే తమకు శిరోధార్యమన్నారు. ఇప్పటి వరకు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సభ్యత్వాల నమోదు ముగిసిందని, అధిష్ఠానం మరికొంత సమయం కేటాయిస్తే ఇంకా అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పార్టీ శ్రేణులు తెలిపాయి.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు

స్వర్ణ(పర్చూరు) : జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ అధినేత ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని ఆపార్టీ జిల్లా కార్యదర్శి శంకరశెట్టి చిరంజీవి అన్నారు. అందులో భాగంగా పర్చూరు నియోజకవర్గ పరిధిలోని కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో ఆదివారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జనసేన పార్టీ సభ్యంతో పొందిన వారికి పార్టీ భీమా సౌకర్యంతోపాటు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు ఎన్.రంగారావు, కె.బాలరాజు, ఎన్.వెంకయ్య నాయుడు, టి.గణేష్, నరేష్ పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

సంతమాగులూరు, జూలై 28 : సంతమాగులూరులో శనివారం అర్ధరాత్రి వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందిన సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన దూదేకుల మొగులమ్మకు, పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన స్వర్ణాల శ్రీనివాసరావుకు మధ్య అక్రమ సంబంధంతో ఇరువురు కాపురం చేస్తున్నారు. వారిరువురు ఇటీవల సంతమాగులూరు వచ్చి ఒక ఇంటిలో కాపురం పెట్టారు. మొగులమ్మ సంతమాగులూరులోని బాలాజీ ప్రైవేట్ పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తోంది. స్వర్ణాల శ్రీనివాసరావు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావుకి శనివారం అర్ధరాత్రి గుండె నొప్పితో బాధపడుతూ మృతి చెందారని మొగులమ్మ తెలిపింది. ఈ విషయం తెలిసిన శ్రీనివాసరావు భార్య స్వర్ణాల లక్ష్మీకుమారి ఆదివారం ఉదయం తన భర్త గుండెపోటుతో చనిపోలేదని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్‌ఐ సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధురాలి మృతి

అద్దంకిటౌన్, జూలై 28: అద్దంకి మున్సిపాలిటీ పరిధిలోని నర్రావారిపాలెంకు చెందిన విప్పర్ల లింగమ్మ అనే వృద్ధురాలు మృతి చెందింది. ఈమె భిక్షాటన చేస్తూ జీవించేది. ఆమె మృతి చెందిన విషయాన్ని ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులకు వారి బంధులకు సమాచారం అందించారు. ఆమె కుటుంబ సభ్యులు వచ్చే వరకు పోలీసులు అక్కడే ఉండగా కుటుంబ సభ్యులు వచ్చిన అనంతరం ఇంటి పరిసరాలను తనిఖీ చేశారు. అక్కడే రెండు వేల రూపాయల నోట్లు, గోతం చిల్లర డబ్బులు ఉన్నట్లు గుర్తించారు. వాటిలో సుమారు లక్ష నుంచి రెండు లక్షల రూపాయలు ఉన్నట్లు బంధువులు గుర్తించారు. మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆ డబ్బులను ఆమె బంధువులు స్వాధీనం చేసుకున్నారు.

7న రౌండ్‌టేబుల్ సమావేశం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 28: మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలని, అలాగే కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపాలని కోరుతూ ఆగస్టు 7న ఒంగోలులోని బీసీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినందున వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

ఆదాయం కోసం ఆరాటం..!



- ఒంగోలు కార్పొరేషన్‌లో ఆర్ఐ పోస్టులకు డిమాండ్
- టీడీపీ నాయకుల ఆశీస్సుల కోసం ప్రయత్నాలు ముమ్మరం
- గత వైసీపీ పాలనలో అడ్డగోలుగా వ్యవహరించిన కొందరు మళ్లీ కొనసాగేందుకు పావులు
- కొత్తవారికి అవకాశం ఇవ్వాలంటున్న ఆశావహులు
- అవినీతికి ఆస్కారం లేకుండా ప్రక్షాళన వైపు ఎమ్మెల్యే దామచర్ల దృష్టి

ఒంగోలు కార్పొరేషన్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) పోస్టులకు భారీ డిమాండ్ ఏర్పడింది. రెవెన్యూ విభాగం ప్రక్షాళన ఖాయమని తేలడంతో ఆదాయం వచ్చే ఆ సీట్ల కోసం పలువురు ఆరాటపడుతున్నారు. గత వైసీపీ పాలనలో ఆపార్టీ పెద్దల ఆశీస్సులతో కొందరు ఆర్ఐలు అక్రమార్జనే ధ్యేయంగా అడ్డగోలుగా వ్యవహరించారు. అడిగినంత ఇస్తేనే ఇంటి పన్ను విధించారు. ముఖ్యంగా డిప్యూటీ మేయర్ బంధువులు ఇద్దరు కార్యాలయంలో పెత్తనం చెలాయించారు. మేయర్ అండతో ఒక ఆర్ఐ రెచ్చిపోయారు. వీరితోపాటు మరికొందరు కూడా అంతా మా ఇష్టం అన్నట్లు వ్యవహరించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో వారు తమ సీట్లను కాపాడుకునే పనిలో పడిపోయారు. తాము నిజాయితీపరులమని, వైసీపీతో తమకు ఎలాంటి సంబంధం లేదంటూ టీడీపీ నేతల వద్దకు రాయబారాలు నడుపుతున్నారు. కొత్తవారికి అవకాశం ఇవ్వాలంటూ మరికొందరు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రస్తుత ఆర్ఐలు, కొత్తగా వచ్చేందుకు ఆసక్తి చూపుతున్న వారి మధ్య ఇటీవల మాటల యుద్ధం నడిచినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ వ్యవహారం కార్పొరేషన్ కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది.

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 28 : ఒంగోలు కార్పొరేషన్‌లో ఐదు విభాగాలు ఉన్నాయి. వాటి ద్వారా పాదర్శకంగా పౌర సేవలను అందించాల్సి ఉంది. అయితే రెవెన్యూ విభాగంలో అవినీతి రాజ్యమేలుతోంది. ప్రత్యేకించి ఆర్ఐ పోస్టులకు ఉన్న డిమాండ్ అటు కమిషనర్ స్థాయి అధికారికి కూడా లేదంటే అతిశయోక్తి కాదు. ఇంటి పన్ను విధించాలన్నా, తగ్గించాలన్నా, ఖాళీ స్థలాలకు పన్నులు వేయాలన్నా ఆర్ఐలను ప్రసన్నం చేసుకోవాల్సిందే. అదనపు ఆదాయం దండిగా వచ్చే సీటు కావడంతో ఆ పోస్టులకు భారీ డిమాండ్ ఉంటుంది. గత వైసీపీ హయాంలో ఆపార్టీ పెద్దల ఆశీస్సులతో ఆర్ఐలుగా కొందరు హవా సాగించారు. అక్రమార్జనే ధ్యేయంగా ముందుకు సాగి కార్పొరేషన్ ఖజానాకు గండికొట్టారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. ప్రస్తుతం కార్పొరేషన్‌లో కీలకంగా వ్యవహరించే కొందరు అధికారుల మార్పు ఖాయమని తేలిపోయింది. దీంతో తమ పోస్టులను కాపాడుకునేందుకు వారు పావులు కదుపుతున్నారు. 'ఐదేళ్లుగా ఆ పోస్టులకు దూరమయ్యాం. ఇకనైనా కొత్త వారికి అవకాశం కల్పించండి' అంటూ మరికొందరు ఉద్యోగులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదేసమయంలో కొందరు దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకుందామనుకున్న రీతిలో భారీగానే చేతివాటం చూపుతుతున్నారు. ఇంకొందరు ఈ రెండు మూడు నెలలైనా నిజాయితీగా ఉంటే తమ సీటుకు ఢోకా ఉండదన్న భావనలో ఉన్నారు. మొత్తంగా కార్పొరేషన్ రెవెన్యూలో నడుస్తున్న వ్యవహారం ఇప్పుడు కార్యాలయంలో చర్చనీయాంశమైంది.

గతంలో వైసీపీతో అంటకాగి.. తాజాగా స్వామి భక్తి

నగరంలో సుమారు 67వేలకు పైగా గృహాలు అధికారికంగా అస్సెస్‌మెంట్‌లు కలిగి ఉన్నాయి. అనధికారికంగా మరో 25వేలకుపైనే ఉన్నట్లు సమాచారం. ఆయా అస్సెస్‌మెంట్‌ల ఆధారంగా నగరంలోని 50 డివిజన్‌లను ఎనిమిది రెవెన్యూ డివిజన్‌లుగా విభజించారు. ఒక్కో డివిజన్ పరిధిలోని నివాసాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఖాళీ స్థలాలు, హోటల్స్, లాడ్జీలు, అపార్ట్‌మెంట్‌లు, విల్లాలకు వారివారి పరిధిలో పన్నులు విధించాల్సి ఉంది. అయితే గత వైసీపీ పెద్దల ఆశీస్సులతో ఆదాయం వచ్చే డివిజన్‌లకు ఆర్ఐలుగా ఉన్న వారు ఇప్పుడు వారి సీటును కాపాడుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అందులో ఇద్దరు ఆర్ఐలు డిప్యూటీ మేయర్ బంధువులుగా ఐదేళ్లపాటు కార్యాలయంలో పెత్తనం చెలాయించారు. అడిగినంత ముట్టచెప్తేనే పన్ను విధించారు. అది కూడా వేల నుంచి లక్షల రూపాయలు వసూలు చేశారు. అనధికారమైనా, ప్లాను ఉన్నా, లేకున్నా, కోర్టులో ఉన్నా సరే వారు అడిగింది చెల్లించుకోవాల్సిందే. అయితే తాజాగా పాలన మారడంతో తాము నిజాయితీపరులమని, వైసీపీతో తమకు ఎలాంటి సంబంధం లేదంటూ ప్రస్తుత పాలకుల వద్దకు రాయబారాలు నడుపుతున్నారు.

మేయర్ అండతో బిల్డర్ అవతారం ఎత్తిన ఆర్ఐ

వైసీపీకి చెందిన మేయర్‌కు అత్యంత సన్నిహితుడుగా ఉన్న మరో ఆర్ఐ చేతివాటానికి అడ్డూఅదుపు లేదు. గతంలో ఓ బిల్డింగ్ యజమాని నుంచి భారీగా లంచం డిమాండ్ చేయడంతో సదరు బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఆయన త్రుటిలో తప్పించుకోగా మరో ఆర్ఐ దొరికిపోయాడు. ఈ విషయం కార్యాలయం మొత్తం తెలిసినా మేయర్ మనిషికావడంతో ఎవరూ నోరు మెదపలేదు. నగరాని కి చెందిన ఓ బ్యాంకు అధికారి మామిడిపాలెంలోని తన ఇంటికి పన్ను వేయాలని కోరగా ప్లాను ఉన్నప్పటికీ అడిగినంత ఇవ్వలేదన్న అక్కసుతో ప్లాను చించివేసి రెట్టింపు పన్ను విధించారు. ఆదాయం చాలదన్నట్లుగా ఆ ఆర్ఐ బిల్డర్‌గా అవతారం ఎత్తాడు. దీన్నిబట్టి ఆర్ఐ పోస్టుకు ఉన్న ఆదాయం ఏపాటిదో అర్థమవుతుంది.

ఇదిలా ఉంచితే గతంలో టౌన్‌ప్లానింగ్‌లో విధులు నిర్వర్తిస్తూ ఏసీబీకి చిక్కిన మరో ఉద్యోగికి ఆర్ఐగా ఇవ్వడంపై అప్పట్లో చర్చ నడిచింది. ఆయన ఇప్పటికీ కొనసాగుతున్నాడు. అయితే వీరు తిరిగి వారి వారి సీట్లు కాపాడుకునేందుకు భారీగానే ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే వీరినే కొనసాగిస్తే భరించే పరిస్థితి లేదని పలువురు బహిరంగంగానే భయపడిపోతున్నారు.

పాలన మారింది.. పరిస్థితులు మాకే అనుకూలం

గత వైసీపీ హయాంలో ప్రాధాన్యం లేని సీట్లకు పరిమితమైన కొందరు ఉద్యోగుల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో ఆశలు చిగురించాయి. గడిచిన ఐదేళ్లుగా అణచివేతకు గురయ్యామన్న ఆవేదన వారిలో ఉంది. దీంతో ప్రాధాన్యం కలిగిన సీటు దక్కడం ఖాయమన్న నమ్మకాన్ని వారు పెంచుకున్నారు. ఆర్ఐలుగా వచ్చేందుకు తమ పరిధిలో తాము ప్రజాప్రతినిధుల వద్దకు సిఫారసులు ప్రారంభించారు. కొందరైతే పలానా డివిజన్ తనకు ఖాయమైందని బహిరంగంగానే చెప్పుకొంటున్నారు.

ఈనేపథ్యంలో ప్రస్తుత ఆర్ఐలు, కొత్తగా వచ్చేందుకు ఆసక్తి చూపుతున్న వారి మధ్య ఇటీవల మాటల యుద్ధం నడిచినట్లు సమాచారం. 'మమ్మల్ని ఎవరు తొలగిస్తారో చూస్తాం' అంటూ వైసీపీ అండదండలతో ఉన్న ఆర్ఐలు చాలెంజ్ చేస్తుండగా, మా ప్రభుత్వంలో మాకు ప్రాధాన్యం ఉంటుందని మరికొందరు ధీమాను వ్యక్తం చేయడం కార్యాలయంలో చర్చనీయాంశమైంది.

సమాచారం సేకరించుకున్న ఎమ్మెల్యే దామచర్ల

కార్పొరేషన్‌లో పౌర సేవలు. పాలనా వ్యవహారాల్లో అవినీతికి ఆస్కారం లేకుండా చూడడంపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టి సారించారు. కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో చోటుచేసుకున్న అవినీతిపై ఆరా తీశారు. గత ఐదేళ్ల నుంచి ఆర్ఐలుగా కొనసాగుతున్న వారి జాబితాను ఆయన తీసుకున్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వ అండదండలతో వారు వ్యవహరించిన తీరు, అవినీతి గురించి ఆయన సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. ప్రక్షాళన తప్పదన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలన్నదే లక్ష్యంగా ఆయన ముందడుగు వేస్తున్నట్లు తెలిసింది. కొద్దిరోజుల క్రితం కార్పొరేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించిన దామచర్ల.. అవినీతి ఆర్ఐలను సున్నితంగా హెచ్చరించినట్లు తెలిసింది. మొత్తంగా ఆదాయ పోస్టుల కోసం ఆర్ఐల ఆరాటం చూస్తుంటే పన్నుల రూపంలో ప్రజల నుంచి భారీగానే ముడుపులు వస్తాయన్న విషయం తేటతెల్లమవుతోంది.

పొగాకు రైతులూ తస్మాత్ జాగ్రత్త!

- కర్ణాటకలో పొగాకు పంట ఆశాజనకం
- ఉత్పత్తి 100 మిలియన్ కిలోలు దాటే అవకాశం
- దక్షిణాదిన వచ్చే సీజన్ సాగుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం
- ఇక్కడ అధికంగా సాగుచేయొద్దని బోర్డు అధికారుల సూచన



కర్ణాటకలో ఏపుగా పెరుగుతున్న పొగాకు తోట

ఒంగోలు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులూ తస్మాత్ జాగ్రత్త! కర్ణాటక రాష్ట్రంలో ప్రస్తుత సీజన్ పొగాకు పంట ఆశాజనకంగా కనిపిస్తోంది అక్కడ ప్రస్తుతం పొగాకు సాగు చేసి రెండు మాసాలు గడుస్తోంది. ప్రస్తుతం ఆకు రెలుపునకు రైతులు సిద్ధమవుతున్నారు. గత రెండుళ్లుగా కర్ణాటకలో పొగాకు పంట తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కోగా ప్రస్తుత సీజన్‌లో వాతావరణం అనుకూలించింది. తోటలు ఏపుగా పెరగడంతోపాటు నాణ్యత కూడా బాగా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే గత రెండేళ్లతో పోల్చితే ఈ ఏడాది అక్కడ పంట దిగుబడి కూడా పెరిగే అవకాశం ఉంది. ఇది వచ్చే సీజన్‌లో ఇక్కడి మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు బోర్డు అనుమతించిన విస్తీర్ణం, పరిమాణంలోనే పంట సాగు చేయాలని అధికారులు కోరుతున్నారు.

మూడేళ్లుగా అక్కడ తగ్గిన ఉత్పత్తి

కర్ణాటకలో గత మూడు, నాలుగేళ్లుగా వంద మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇస్తుండగా ఎంతో కొంత తక్కువగానే పండుతోంది. అందులో 2022-23 సంవత్సరంలో గణనీయంగా తగ్గింది. ఆ ఏడాది కేవలం 60 మిలియన్ కిలోల దిగుబడి మాత్రమే వచ్చింది. బోర్డు అనుమతించిన పరిమాణంలో 40శాతం ఉత్పత్తి తగ్గింది. 2023-24 లో కూడా వంద మిలియన్ కిలోలకు బోర్డు అనుమతివ్వగా 83 మిలియన్ కిలోలు పండింది. ధర గరిష్ఠంగా కిలో రూ.289 పలకింది. చివరకు సగటు ధర కిలో రూ.254 లభించింది. అలా కర్ణాటకలో పంట ఉత్పత్తి తగ్గడం ఆంధ్రలోని ప్రత్యేకించి దక్షిణాది రైతులకు లాభించింది. కర్ణాటకలో పూర్తయిన వెంటనే రాష్ట్రంలోని దక్షిణాది ప్రాంతంలో వేలం ప్రారంభం అవుతుండటంతో అక్కడ ఉత్పత్తి తగ్గిన ప్రభావంతో ఎగుమతుల అవసరాల మేరకు ఈప్రాంతంలో పంట కొనేవారు పోటీ పడటంతో మంచి ధరలు లభించాయి.

ప్రస్తుతం భిన్న పరిస్థితి

ప్రస్తుత సీజన్ చూస్తే పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. రాష్ట్రంలోని దక్షిణాది ప్రాంతంలో ఇంకా రైతుల వద్ద మూడో వంతు పంట నిల్వ ఉండగా కర్ణాటకలో ఆకు రెలుపు, క్యూరింగ్ సమయం వచ్చింది. కొన్ని చోట్ల క్యూరింగ్ కూడా చేస్తున్నారు. ఈ ఏడాది కూడా కర్ణాటకలో వంద మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతివ్వగా 100నుంచి 102 మిలియన్ కిలోలు రావచ్చని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే అక్కడ వాతావరణం అనుకూలించడం, ప్రస్తుతం తోటలు ఏపుగా పెరగుతున్న తీరును పరిశీలిస్తే 110 మిలియన్ కిలోల వరకూ పండవచ్చని వ్యాపార, ఇతరవర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. అంటే గత ఏడాది కన్నా దాదాపు 30 మిలియన్ కిలోలు, అంతకుముందు ఏడాది కన్నా 50 మిలియన్ కిలోలు అధికంగా ఉత్పత్తి రావచ్చన్న విషయం స్పష్టమతోంది.

దక్షిణాది ప్రాంతంపై తీవ్ర ప్రభావం

కర్ణాటకలో ఉత్పత్తి పెరిగితే ఆ ప్రభావం రాష్ట్రంలో ప్రత్యేకించి దక్షిణాది ప్రాంతంపై తీవ్రంగానే చూపే అవకాశం ఉంటుంది. ఇక్కడ గత సీజన్‌లో పండిన పంట ఇంకా భారీగా కొనుగోలు చేయాల్సి ఉండగా కర్ణాటకలో కూడా అధికంగా పండితే వచ్చే ఏడాది దక్షిణాది మార్కెట్‌ను అదిప్రభావితం చేసి వ్యాపారులు ధరలు తగ్గించే అవకాశం ఉంటుందని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. ఈ పరిస్థితుల్లో దక్షిణాది రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ప్రత్యేకించి వచ్చే సీజన్‌లో పంట సాగు, ఉత్పత్తి విషయంలో ఎంత పరిమితంగా ఉంటే అంత మంచిదన్న అభిప్రాయాన్ని ఆ రంగంలో అనుభవజ్ఞులు తెలియజేస్తున్నారు. అదే సమయంలో అనుమతించిన మేర మాత్రమే పంట సాగు, ఉత్పత్తికి పరిమితం కావాలని బోర్డు అధికారులు సూచిస్తున్నారు.

పాలిటెక్నిక్‌లో పడిపోయిన అడ్మిషన్లు!

- కేవలం 45శాతం సీట్లు మాత్రమే భర్తీ
- ఖాళీగా 1,273 సీట్లు
- ప్రభుత్వ కళాశాలల్లోనే ఎక్కువ ప్రవేశాలు

ఒంగోలు (విద్య), జూలై 28: జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు అంతంతమాత్రంగానే జరిగాయి. పాలిసెట్ తొలి, మలి విడత కౌన్సెలింగ్‌లలో కేవలం 45శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నికల్ కళాశాలల్లో మొత్తం 2,320 సీట్లు ఉండగా పాలిసెట్-24 తుది దశ కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత కేవలం 1,047 మంది మాత్రమే ప్రవేశాలు పొందారు. 1,273 సీట్లు మిగిలిపోయాయి. ప్రభుత్వ కళాశాలల్లోనే అడ్మిషన్లు మెరుగ్గా ఉన్నాయి. అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 120 సీట్లు ఉండగా 94 (78శాతం) భర్తీ అయ్యాయి. కంప్యూటర్ సైన్స్‌లో 32, ఎలక్ట్రానిక్స్‌లో 62 మంది ప్రవేశాలు పొందారు. ఈతముక్కల ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 100 సీట్లు ఉండగా 76మంది చేరారు. కంప్యూటర్ సైన్స్‌లో 32మంది, ఎలక్ట్రానిక్స్‌లో 33మంది, సీపీసీ బ్రాంచిలో 11 మంది అడ్మిషన్లు పొందారు. ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మొత్తం 360 సీట్లు ఉండగా 149 మంది చేరారు. ఈ కళాశాలలో సివిల్, మెకానికల్‌లో 60 సీట్లచొప్పున 120 ఉన్నాయి. ఉదయం, మధ్యాహ్నం షిఫ్ట్‌లలో తరగతులు జరుగుతాయి. అసలు సెకండ్ షిఫ్ట్‌లో విద్యార్థులు చేరలేదు. కేవలం ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉన్న కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్ బ్రాంచిలు ఇక్కడ లేకపోవడం ఈ కళాశాలలో అడ్మిషన్లకు పెద్దఅవరోధంగా మారింది. నాలుగు దశాబ్దాల క్రితం ప్రారంభమై మంచిపేరు ఉన్న ఈ కళాశాలలో వివిధ జిల్లాల విద్యార్థులు చదువుతున్నారు. కానీ ఈ ఏడాది ఆయా బ్రాంచిలో ఆశించిన స్థాయిలో చేరలేదు. కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 120 సీట్లు ఉండగా కేవలం 12 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. సివిల్‌లో మూడు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో తొమ్మిది మంది చేరారు. ఆరు ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో 36శాతం, 58శాతం, 38 శాతం, 50.6శాతం,29శాతం, 37శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి.

31న స్పాట్ అడ్మిషన్లు

ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీచేసేందుకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి, ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ పీవీఎల్ఎన్ శివప్రసాద్ తెలిపారు. పాలిసెట్ రాయని వారు 10వ తరగతి కంపార్టుమెంటల్ పాసైన వారికి కూడా చేరవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సత్తా చాటిన నంద్యాల ఎడ్లు

వలేటివారిపాలెం, జూలై 28: నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం మండలం శాఖవరంలో పడమట బజారువారి ఆధ్వర్యంలో అంకమ్మ తిరునాళ్ల సందర్భంగా ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలలో నంద్యాల జిల్లా గుంపసరమునుదిన్నె గ్రామానికి చెందిన కుందురు రాంభూపాల్‌రెడ్డి ఎడ్లజత 3425.04 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ. 60 వేలు సాధించాయి. ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్లజత 3313.07 అడుగులు లాగి రెండవ బహుమతి రూ. 50 వేలు, నంద్యాల జిల్లా పులి చిన్నఓబులురెడ్డి ఎడ్లజత 3132.07 అడుగులు లాగి మూడవ బహుమతి రూ.40 వేలు, కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్లజత 3117.02 అడుగులు లాగి నాల్గవ బహుమతి రూ.30 వేలు, బాపట్ల జిల్లా బల్లికువర గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామి ఎడ్లజత 3084.01 అడుగులు లాగి 5వ బహుమతి రూ.20 వేలు సాధించాయి.

అదేవిధంగా గుంటూరు జిల్లా కంచనపల్లి గ్రామానికి చెందిన పి.ఆర్ మెమోరియల్ పులగం త్రిషష్టరెడ్డి ఎడ్లజత 3 వేలు అడుగులు లాగి 6వ బహుమతి రూ. 15 వేలు, కడప జిల్లా ప్రొద్దుటూరు టౌన్ ద్వారక గురివిరెడ్డికి చెందిన ఎడ్లజత 2889.05 అడుగులు లాగి 7వ బహుమతి రూ. 10 వేలు, బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన వీరాస్వామి ఎడ్లజత 2881.09 అడుగులు లాగి 8వ బహుమతి రూ. 5 వేలు సాధించింది. ఈ పోటీలలో విజేతలకు మొదటి బహుమతి వడ్లమూడి మాధవరావు, రెండవ బహుమతి వడ్లమూడి బసవయ్య, 3వ బహుమతి వడ్లమూడి చినహజరత్తయ్య, 4వ బహుమతి ఉండవల్లి శంకరయ్య, 5వ బహుమతి నవ్వులూరి కృష్ణయ్య, 6వ బహుమతి వడ్లమూడి వెంకటరావు, 7వ బహుమతి వడ్లమూడి శ్రీనివాసులు అందజేశారు. కాగా, అంకమ్మ తిరునాళ్లలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వాన కోసం అన్నదాతల నిరీక్షణ..!

- చెదురుమదురుతో పంట దుక్కులను అలముకొన్న గంజేరు మొక్కలు
- భూములకు పదును కాక ఖరీఫ్ సాగు ఆలస్యం



చెన్నుపల్లి పొలంలో మొలిచిన గంజేరు మొక్కలు.. గుంటుపల్లిలో దోస తోటలో అల్లుకున్న గంజేరు.. దున్ని ఎదురు చూస్తున్న రైతులు

బల్లికురవ, జూలై 28 : చెదురు మదురు వర్షాలు పడడంతో పంట దుక్కులు బీడులుగా మారుతున్నాయి. వర్షపాతం సరిగ్గా లేకపోవడంతో పంటల సాగు ఈ ఏడాది ఆలస్యం అవుతుందని రైతులు అంటున్నారు. కొన్ని గ్రామాలలో పంటలు వేసేందుకు దుక్కులు దున్ని సిద్ధం చేస్తున్న రైతులను గంజేరు మొక్కలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మెదలే పంటలు సాగు చేసేందుకు సరిపడా వర్షం లేక పలుమార్లు పొలాలను దున్ని పెడుతుంటే గంజేరు మొక్కమాత్రం ఎలాంటి మందులు వాడకుండానే పంట సాగు చేసిన విధంగా దట్టంగా వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మూడు సార్లు విత్తనాలు నాటేందుకు దుక్కి బగు చేశానని చెదురుమదురుగా పడిన వర్షాల వలన గడ్డి, గంజేరు మొక్కలు పెద్ద ఎత్తున వచ్చాయని ఈ ఏడాది పంట సాగు చేసే వరకు పెట్టుబడి కూడా పెద్ద మెత్తంలో అయ్యే అవకాశం ఉందని రైతులు తెలిపారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు మాసాలు గడుస్తున్నా పంటలు సాగు మాత్రం అరకొరగానే ఉంది. ఏ గ్రామంలో చూసిన పంటలు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నా సకాలంలో మంచి వర్షం పడలేదు. దీంతో పంట దుక్కులు గడ్డి, గంజేరు మొక్క వచ్చి బీడులుగా మారాయి. బల్లికురవ మండలంలోని గుంటుపల్లి, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, ఎస్ఎల్ గుడిపాడు, రామాంజనేయపురం, అంబడిపూడి, వల్లాపల్లి, కొండాయపాలెం, మల్లాయపాలెం, నక్కబొక్కలపాడు గ్రామాలలో ఖరీఫ్ పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. గత ఏడాది ఆదే నెలలో వర్షం ఒకే సారి పడడంతో రైతులు పంటల సాగు చేపట్టారు. ఈ ఏడాది మాత్రం వర్షపాతం దఫాలు దఫాలుగా పడడంతో పంట భూములు బాగు చేసుకునేలోపే మరలా గడ్డి పెరగడంతో రైతులు పంటలను సాగు చేయలేకపోయారు. అత్యధిక శాతం మంది రైతులు పంటల సాగు చేసేందుకు వర్షం కోసం ఎదురు చూపులు చుస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో పంటలు సాగు చేస్తే ముందు మంద కూడా తుఫాన్ల తాకిడి నుంచి పంటలను కాపాడుకునే వీలు ఉంటుందని కానీ ఇప్పుడు సరైన వర్షం మాత్రం పడలేదని రైతులు వాపోతున్నారు. పలు గ్రామాలలో రైతులు పంట దుక్కలను దున్ని పెట్టి వర్షం కోసం వేచి ఉన్నారు. సరైన వర్షం పడకుంటే పంటలు సాగు చేయడం కష్టం అని రైతులు తెలిపారు.

మొక్క దట్టంగా వస్తుంది



సాగుకు గంజేరు మొక్క బాగా ఇబ్బందిగా మారింది. దోస తోట సాగు చేస్తే దోస మొక్కల కంటే గంజేరు మొక్క అధికంగా వచ్చింది. దీంతో పంట దిగుబడులు లేవు. దుక్కులను దున్నిన నాలుగు రోజులకే మళ్లీ గంజేరు మొక్క పుడుతోంది. ఏటా వ్యవసాయ సీజన్‌లో ఈ పిచ్చి మొక్క వలన రైతులు బాగా ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిసిన వెంటనే పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

- వీరవెంకయ్య, రైతు, ముక్తేశ్వరం

దడ పుట్టిస్తున్న మొక్కలు

పలు గ్రామాలలో రైతులు పంట దుక్కులను ఎన్ని మార్లు దున్ని బాగు చేసినా మరలా వెంటనే గంజేరు మొక్కలు దట్టంగా రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలకువేలు పెట్టుబడి పెట్టి పంట పొలాలలను యంత్రాలతో దున్నించిన ఎలాంటి ప్రయోజనం లేదని గంజేరు మొక్క పంటను కూడా నాశనం చేస్తుందని రైతులు తెలిపారు. గుంటుపల్లి, ముక్తేశ్వరం గ్రామాలలో రైతులు చెదురు మదురు వర్షాలకు సాగు చేసిన దోస పంటలో గంజేరు మొక్క పెరిగి దోసకాయలు కూడా కాయడం లేదని రైతులు తెలిపారు. గంజేరు మొక్కకు చావు లేదని పలువురు రైతులు తెలిపారు. మాగాణి భూములలో తడి తగిలితే వెంటనే బయటకు వస్తుందని సైంటిస్టులు పరిశీలించి గంజేరు మొక్క నియంత్రణకు చర్యలు చేపట్టాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.



రాఘవరావు దంపతులను సత్కరిస్తున్న సాహితీ సభ్యులు

సాహిత్యంపై పట్టున్న వ్యక్తి రాఘవరావు

అద్దంకిటౌన్, జూలై 28 : రాఘవరావు మంచి కథా రచయిత అని, ప్రత్యేకించి చలం, శ్రీశ్రీ, యండమూరి రచనలు, సినిమా సాహిత్యంపై మంచి పట్టు ఉన్న వ్యక్తి రాచపూడి వెంకట రాఘవరావు అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం సాహితీ మిత్ర మండలి అద్దంకి ఆధ్వర్యంలో స్థానిక మారం వారి సేవాసదన్‌లో లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన ఆత్మీయ పురస్కార సభ జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 40 సంవత్సరాలు పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో చక్కని సేవలందించాలరని, సభ నిర్వహణలో కచ్చితంగా సమయపాలన పాటించే విధంగా అందర్నీ అలవాటు చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాఘవరావు రచనలు, కవితలు గురించి అన్నమనేని వెంకట్రావు, డీవీఎం సత్యనారాయణ, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, డాక్టర్ యూ దేవపాలన, వారణాసి రఘురామశర్మ వి శ్లేశించారు. అనంతరం రాఘవరావు దంపతులను సాహితీ మిత్ర మండలి, రోటరీ క్లబ్, జానపద కళాపీఠం, ఇతర సాహితీ సంస్థల సభ్యులు ఘనంగా సన్మానించి పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, మురళి సుధాకరరావు, వెంకటేశ్వరరావు, విశ్వమోహన్, పోలిరెడ్డి, సుబ్బారావు, కామేశ్వరశర్మ పాల్గొన్నారు.

వామ్మో రోడ్డు మార్జిన్‌లు

ఇబ్బందిపడుతున్న వాహనచోదకులు



చందలూరు, కొణికి మధ్య రోడ్డు మార్జిన్‌లో ఏర్పడిన గుంతలు

పంగులూరు, జూలై 28 : మండలంలోని అలవలపాడు, కొణికి ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపులా రోడ్డు మార్జిన్లు గోతులమయంగా మారాయి. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఆర్ అండ్ బీ ప్రధాన రహదారికి మార్జిన్లలో ఏర్పడిన గోతుల వలన వాహన చోదకులు రాక పోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్సులతో పాటు ఇటుక, కంకర, గ్రావెల్‌తో పాటు ఇతర సరుకులు చేరవేసే లారీలు, పొలాలలో వ్యవసాయ పనులకోసం తిరిగే ట్రాక్టర్ల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. వీటితో పాటు ఇంకొల్లు నుంచి జాతీయ రహదారి వైపుగా పలు పనుల నిమిత్తం ఒంగోలు, అద్దంకి వెళ్లే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సింగిల్ బీటీ రోడ్డుకు రెండు వైపులా మార్జిన్లలో ఏర్పడిన గోతుల కారణంగా రాత్రి వేళ ఎదురెదురుగా వచ్చే వాహనాల వెళుతురులో మార్జిన్లలో గోతులు గుర్తించలేక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొద్ది రోజుల కిందట మండలంలోని తక్కెళ్లపాడు సమీపంలో రాత్రి వేళ ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు తిరగబడింది. 16వ నెంబరు జాతీయ రహదారి నుంచి కొణికి వరకు మార్జిన్లలో ఏర్పడిన గోతులు పూడ్చి ఈ రహదారిలో నడిచే వాహనాలు ప్రమాదాల బారిన పడకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

తీరప్రాంత అభివృద్ధి.. పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే కొండయ్య



తీరంలో పర్యాటకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), జూలై 28 : టూరిజం పరంగా తీరప్రాంత అభివృద్ధి, పర్యాటకుల భద్రత, మెరుగైన సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం ఆయన పలువురు నాయకులు, కార్యకర్తలతో కలసి చీరాల మండల వాడరేవు నుంచి వేటపాలెం మండలం పొట్టిసుబ్బయ్యపాలెం వరకు తీరం వెంట పర్యాటకుల భద్రత కోసం చేపట్టిన చర్యలను పరిశీలించారు. తీరంలో నాటిన హెచ్చరిక జెండాలు, వాచ్‌టవర్స్ గత ఈతగాళ్లు, కోస్టల్ బైక్ తదితరాలను పరిశీలించారు. ఆ సందర్భంగా పర్యాటకులతో మాట్లాడారు. గజ ఈతగాళ్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అండగా ఉంటా

మండల పరిధిలోని పందిళ్లపల్లి తోకపేటలో ఆదివారం మాచర్ల శ్రీమన్నారాయణ(శివయ్య) తన నివాసంలో ఎమ్మెల్యే కొండయ్యకు ఆత్మీయసమావేశం, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ అందరికీ అండగా, అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. అనంతరం కొండయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సజ్జా చంద్రమౌళికి నివాళి

సజ్జా చంద్రమౌళి వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య ఆదివారం చీరాల గడియార స్తంభం సెంటర్లోని ఆయన విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి తరాల వారి ఆలోచనలకు అనుగుణంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండడం హర్షణీయం

చీరాల పాపరాజుతోటలోని బాపనమ్మ కల్యాణ మండపంలో ఆదివారం వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వితీయ కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో క్లబ్ ప్రతినిధులు ముందుండటం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.



సారె తీసుకొని ఊరేగింపుగా వెళ్తున్న మహిళా భక్తులు

వైభవంగా అంకమ్మకు ఆషాడ సారె

భక్తిశ్రద్ధలతో సమర్పించిన భక్తులు

చినగంజాం, జూలై 28 : మండలంలోని మున్నంవారిపాలెం గ్రామంలోని గ్రామ దేవత అంకమ్మ తల్లికి ఆషాడ సారె సమర్పించే కార్యక్రమాన్ని మహిళా భక్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని గ్రామ దేవత అయిన అంకమ్మ తల్లికి సారె అందజేశారు. గ్రామంలోని మహిళా భక్తులు పొంగళ్లు, చీర, జాకెట్లు, చలిమిడి, పండ్లు, పసుపు కుంకుమను నెత్తి మీద బెట్టుకొని పురవీధుల గుండా మేళతాళాలు, కనకతప్పెట్లు నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి సారె తీసుకొని వెళ్లారు. ఆలయ పూజారి అంకమ్మతల్లిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు తదనంతరం మహిళా భక్తులు అంకమ్మ తల్లికి సారెలను సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. తదనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కళకళ లాడుతున్న పర్చూరు మంచినీటి చెరువు

చెరువులకు జలకళ

- మంచినీటి చెరువులకు చేరుతున్న సాగర్
- ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

పర్చూరు, జూలై 28 : నిన్న మొన్నటి వరకూ అడుగంటిన చెరువులు, కలుషిత నీటితో ప్రజలు నీటి కోసం నానా అవస్థలు పడ్డారు. ఎక్కడ చూసినా అడుగంటిన చెరువులే దర్శనమిచ్చాయి. గుక్కెడు నీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఈతరుణంలో ప్రభుత్వం తాగునీటి అవసరాల కోసం సాగర్ జలాలను విడుదల చేసింది. దీంతో సాగర్ జలాలతో చెరువులను నింపేవిధంగా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం చెరువులు సాగర్ జలాలతో కళకళ లాడుతున్నాయి. మండలంలోని నెలకొన్న నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని యుద్ధ ప్రాతిపదికన చెరువులను నింపే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలు జారీచేశారు. దీంతో అధికారులు ఆమేరకు చర్యలు చేపట్టి మంచినీటి చెవులను నింపే కార్యక్రంలో తలమునకలయ్యారు. ఆయా గ్రామాల్లో మంచినీటి చెరువులు సాగర్ నీటితో కళకళ లాడుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మా వాటా నిధులు ఇవ్వండి

- మూడేళ్ల నుంచి ఒక్కపైసా ఇవ్వలేదు
- సమావేశంలో ఎంపీటీసీలు ధ్వజం
- హాజరుకాని రెవెన్యూ, విద్యుత్ అధికారులపై ఆగ్రహం



సమస్యలపై నిలదీస్తున్న బొప్పేపల్లి ఎంపీటీసీ సభ్యుడు హరిబాబు

మార్టూరు, జూలై 28 : మూడేళ్ల నుంచి అడుగుతున్నా ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. మా గ్రామాలలో ఒక్క పనినీ చేయలేకపోయాం. మండల పరిషత్ నిధులు మీ ఇష్టం వచ్చిన పనులకు వినియోగిస్తారా.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ఓట్లు అడగడానికి వెళితే.. జనం అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోయామని బొప్పేపల్లి, వలపర్ల ఎంపీటీసీ సభ్యులు దండా హరిబాబు, జంజనం పద్మ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎంపీపీ భుక్యా శాంతిబాయి అధ్యక్షత వహించారు. గత మూడేళ్లలో మండల పరిషత్ నిధులతో బొప్పేపల్లి గ్రామంలో చిన్నపని కూడా చేయలేకపోయామని,మండలపరిషత్ నిధులతో వారికి ఇష్టమైనపనులు చేసుకున్నారని ఎంపీటీసీ సభ్యుడు హరిబాబు సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఏళ్ల తరబడి శిథిలమైన విద్యుత్ స్తంభాలున్నాయని, వాటిని తొలగించాలని గత మూడు సమావేశాలలో మొరపెట్టుకున్నా ఇంతవరకు సమస్య పరిష్కరించలేదన్నారు. అదేవిధంగా వలపర్లలోని గరటయ్య కాలనీలో సైడు కాల్వలు తీయాలని, సీసీ రోడ్లు వేయాలని ఎన్ని సార్లు మీటింగ్‌లో చెప్పినా ఇంతవరకు పట్టించుకోలేదని ఎంపీటీసీ సభ్యులు పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. బొప్పేపల్లి, ద్రోణాదుల, రాజుగారిపాలెం తదితర గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు విద్యుత్ సమస్యలను ప్రస్తావించారు. సమావేశానికి విద్యుత్ అధికారులు రాకపోవడం పట్ల వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు కూడా సమావేశానికి హాజరుకాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఎంపీడీవో నితిన్ మాట్లాడుతూ సమావేశానికి హాజరుకాని శాఖలకు చెందిన అధికారులపై కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు. మండల వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ మాట్లాడుతూ పచ్చిరొట్టె ఎరువులను 50 శాతం, కందులను 30 శాతం రాయితీతో అందజేస్తామన్నారు. ఉద్యాన అధికారి బీ హనుమంతనాయక్ మాట్లాడుతూ కూరగాయలు, పూలతోటలను పెంచే రైతులకు సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. మినీ ట్రాక్టర్లు కావలసిన రైతులు ఉద్యాన శాఖను సంప్రదించాలన్నారు. అనంతరం హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ మండలంలో వివిధ దశలలో 718 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని వాటిని వెంటనే పూర్తయ్యేవిధంగా ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన వారు ప్రభుత్వ పథకాలకు సంబందించి, ప్రజలకు ఉపయోగకరంగా ఉండేందుకు అవసరమైన వివరాలను గ్రామ సచివాలయాలకు పంపించాలని సభ్యులు అధికారులను కోరారు. సమావేశంలో జడ్‌పీ వైస్ చైర్‌పర్సన్ చుండి సుజ్ఞానమ్మ, వెలుగు ఏపీఎం రాజారత్నం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

రోడ్డు పనులు ప్రారంభం

ఇంకొల్లు, జూలై 28 : మండలంలోని సూదివారిపాలెం నుంచి నాగండ్లకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును అభివృద్ధి చేసేందుకు ఆదివారం పనులు ప్రారంభించారు. వైసీపీ పాలనలో ఈ ఈ రహదారి అధ్వానంగా మారి, ప్రయాణం నరకయాతనగా మారింది. ఈ నేపథ్యంలో సూదివారిపాలెం గ్రామస్థులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. రోడ్డును బాగు చేయాలని విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి అధికారులకు సూచించారు. సుమారు రూ.41లక్షలతో 3.5 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు ఆదివారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సూదివారిపాలెం గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరునాళ్లకు ముస్తాబైన ఆలయం



అమ్మవారి ఆలయానికి వేస్తున్న రంగులు

వేటపాలెం(చీరాల), జూలై 28 : మండల పరిధిలోని పందిళ్లపల్లి పందిళ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమాలు ఈ నెల 31వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి మూడు రోజులు గ్రామ దేవతలకు సద్ది నైవేద్యాల చెల్లింపులు జరుగుతాయి. 3వ తేదీన శిడిమహోత్సవం జరుగుతుంది. 4వ తేదీన పొంగళ్లతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలపారు. అందుకు సంబంధించి ఆలయానికి రంగులు వేస్తున్నారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

పరోపకార గుణం కలిగి ఉండాలి



వెంకట శ్రీనివాసరావును సన్మానిస్తున్న సభ్యులు

వేటపాలెం(చీరాల), జూలై 28 : మానవ జీవితంలో ప్రతి ఒక్కరూ పరోపకార గుణం కలిగి ఉండాలని ప్రముఖ ప్రవచన కారులు పొన్నూరు వెంకట శ్రీనివాసరావు చెప్పారు. ప్రొబస్ క్లబ్ ప్రతినిధులు ఆధ్వర్యంలో ఆదివారం ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఆవుల పున్నయ్య, గొల్లపూడి శీతారాం, వడలి రాధాకృష్ణ, బీరక సుబ్రమణ్యం, బి.సుబ్బరామయ్య కోటేశ్వరరావు, శివప్రసాద్, నాగమనోహర్‌లోహయా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

ఇంకొల్లు, జూలై 28 : మండలంలోని వంకాయలపాడు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఈదర శ్రీనివాసరావు శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై పలువురు ఉపాధ్యాయులు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉత్సాహంగా అంకితభావంతో పనిచేసిన శ్రీనివాసరెడ్డి అందరితో కలిసిమెలసి ఉంటేవారని, ప్రమాదసమయంలో ఎవరూ చూడకపోడంతో తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు విడిచారన్నారు. శ్రీనివాసరెడ్డి ఇంకొల్లు మండలం కొణికి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నారు.

హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న తస్నీరు

అద్దంకిటౌన్, జూలై 28: ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తస్నీరు శింగరకొండ అన్నారు. ఆదివారం అద్దంకిలోని పార్టీ కార్యాలయంలో అద్దంకి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం సీనియర్ నాయకుడు వల్లెపు నరసింహ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తస్నీరు మాట్లాడుతు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు పెట్టాలని, భవనాసి రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకుడు కేఎల్‌డీ ప్రసాద్, ఖదర్ బాషా, మేకల రమణయ్య, ఆంజనేయులు, ముస్తపా పాల్గొన్నారు.

ఘనంగా అద్దంకమ్మ సారె మహోత్సవం



ప్రత్యేక పూజలు అందుకుంటున్న అమ్మవారు

దేవాంగపురి(చీరాలటౌన్), జూలై 28 : చీరాల మండలం దేవాంగపురి పంచాయతీ పాత చీరాలలోని గ్రామ దేవత శ్రీ అద్దంకమ్మ అమ్మవారి సారె మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 108 మంది దేవ వంశస్త మహిళలు సారెతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. దీంతో వేకువజాము నుంచే భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఏటా ఆషాడ మాసంలో కోరిన కోర్కెలు తీర్చె పోలేరమ్మను ఘనంగా కొలుస్తామని తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చీరాల భక్తుడికి అలిపిరిలో పాముకాటు

చీరాలటౌన్, జూలై 28 : చీరాల భక్తుడు నాగేంద్ర తిరుమల ఆలిపిరి మెట్ల మార్గంలో పాము కాటుకు గురయ్యారు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సుమారు 8 మంది మిత్రులతో కలిసి నాగేంద్ర కాలినడకన వెళుతుండగా అలిపిరి 7వ మైలురాయి వద్ద పాము కాటేసింది. దీంతో సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు, టీటీడీ ప్రతినిధులు 108లో తిరుమల అశ్విని హాస్పిటల్‌కు తరలించి చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం నాగేంద్ర పరిస్థితి నిలకడగా ఉందని మిత్రులు సమాచారం ఇచ్చారు.



- ఓ వివాదాస్పద అధికారికి లెటర్లు ఇచ్చిన ఎమ్మెల్యేలు
- విషయం తెలిసి భగ్గుమంటున్న రైతులు, నేతలు
- గతంలో నెల్లూరు డీఈగా పలు ఆరోపణలు
- అన్నదాతలపై చిందులు.. బినామీలతో వర్కులు
- తాజాగా ఆత్మకూరులోనూ విమర్శలు.. ఎమ్మెల్యే ఆనం ఆగ్రహం

యథాస్థానాలకు

తహసీల్దార్లు

- నేడో,రేపో పోస్టింగ్
- గతంలో పనిచేసిన డివిజన్‌లో నోచాన్స్
- అనువైన చోటు కోసం పెద్దఎత్తున సిఫార్సులు



తహసీల్దార్లకు స్థానచలనం -వార్త

నెల్లూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ పోస్టింగ్‌ల ప్రక్రియ మొదలైంది. ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన 42 మంది తహసీల్దార్లు అక్కడి నుంచి రిలీవ్ అయి సొంత జిల్లాకు చేరుకున్నారు. అనువైన ప్రదేశాల్లో పోస్టింగ్ కోసం అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. అయితే వీరి పోస్టింగ్‌ల విషయంలో పరిస్థితులు గతాని కన్నా భిన్నంగా కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వం హయాం లో జరిగిన భూ కుంభకోణాల్లో ఏ తహసీల్దార్ ఏ కేసులో ఇరుక్కున్నాడో అనే అనుమానాలతో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎవరి పట్ల పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పోస్టింగ్‌లకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల నేపథ్యంలో నాయకులపై కూడా ఒత్తిడి తగ్గినట్లు కనిపిస్తోంది.

● మార్గదర్శకాలు ఇవే...

తహసీల్దార్ పోస్టింగ్‌ల్లో ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయడంతో చాలా వరకు పారద ర్శక వాతావరణం నెలకొంది. తహసీల్దార్ ఎస్ఆర్‌లో పేర్కొన్న సొంత గ్రామం ఉన్న డివిజన్ పరిధిలో పోస్టింగ్ ఇవ్వకూడదు. ఉదాహరణకు అధికారి జన్మస్థలం నెల్లూరు అనుకుంటే ఆ అధికారికి నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధి లో ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకూడదు. మార్గదర్శకం రెండు ప్రకారం ఎన్నికల విధుల్లో భాగంగా పక్క జిల్లాకు బదిలీపై వెళ్లడానికి ముందు రోజు ఏ మండలంలో పనిచేశారో, ఆ నియోజకవర్గ పరిధిలో పోస్టింగ్ ఇవ్వకూడదు. ఉదాహరణకు ఎన్నికల బదిలీకి ముందు రోజు వరకు పొదలకూరు తహసీల్దార్‌గా పనిచేసిన అధికారికి ఇప్పుడు సర్వేపల్లి నియోజకవర్గ పరిధి లోని ఏ మండలంలో కూడా పోస్టింగ్ ఇవ్వకూడదు. మరో నియోజకవర్గంలో పోస్టింగ్ ఇవ్వాలి. ఈ నిబంధనలతో చాలా వరకు కోరిన మండలాల్లో పోస్టింగ్‌ల కోసం ఒత్తిడి తగ్గింది.

● అనువైన చోటు కోసం పైరవీలు

ప్రస్తుతం జిల్లాలో తహసీల్దార్ క్యాడర్‌లో 42 మందికి పోస్టింగ్‌లు ఇవ్వాలి. సోమ, మంగ ళవారాల్లో పోస్టింగ్‌ల ప్రక్రి య పూర్తయ్యే సూచ నలు కనిపిస్తున్నాయి. జిల్లాలోని కొన్ని ముఖ్యమైన మం డలాల్లో పోస్టింగ్‌ల కోసం ఇప్పటికే పైరవీలు, సిఫార్సుల పర్వం పూర్తయినట్లు తెలుస్తోంది. ముత్తుకూరు, టీపీ గూ డూరు, కోవూరు, ఇందుకూరుపేట, బుచ్చి సంగం, ఆత్మకూరు తదితర ఆదాయవనరులు ఉన్న మండలాల్లో పోస్టింగ్‌ల కోసం ఎమ్మెల్యేల మీద పెద్ద ఎత్తున ఒత్తిడి వచ్చింది. ఈ క్రమంలో సుమారు 10 రోజుల క్రితమే కొంతమంది ఎమ్మెల్యేలు తాము కోరుకొంటున్న తహసీల్దార్ల జాబితాను కలెక్టర్‌కు అందజేసినట్లు ప్రచారం సాగుతోంది.

వైసీపీతో అంటకాగిన వారికి ఇరిగేషన్‌లో అందలం

అమ్మో ఆయనా...

మాకొద్దు !

నెల్లూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో ఆ అధికారి తీరే వేరు.. ఎక్కడికెళ్లినా వివా దాలే.. రైతుల కష్టాలు తీర్చాల్సిన ఆయనకు అసలు రైతులంటేనే పడదు..! ఏదైనా సమస్యతో అన్నదాతలు కార్యాలయా నికి వస్తే వారిపై చిందులు వేయడం.. బినామీ పేర్లతో వర్కులు చేయడం ఆ అధికారి నైజం... సదరు ఆ అధికారిపై అనేక విచారణలు జరగ్గా, కొన్నింటిలో రికవరీకి కూడా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. 2014లో నెల్లూరు డీఈగా ఆయన పనిచేస్తున్న సమయంలోనే నాటి టీడీపీ ప్రభుత్వం ఆయనపై చర్యలు కూడా తీసుకుంది.

అయితే, అదే వివాదాస్పద అధికారిని ఇప్పుడు మళ్లీ నెల్లూరు డీఈగా తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతు న్నాయి. పైపెచ్చు సెంట్రల్ డివిజన్ ఈఈ పోస్టును కూడా ఇన్‌చార్జిగా కట్టబెట్టేందుకు ఒప్పందం కూడా జరిగినట్లు తెలిసింది. అసలు ప్రభుత్వం బదిలీల జీవో ఇవ్వకముందే ముగ్గురు ఎమ్మెల్యేల దగ్గర నుంచి సదరు అధికారి లెటర్లు తీసుకున్నారు. ఆ లెటర్ల ద్వారా నెల్లూరు డీఈ పోస్టు తెచ్చుకునేందుకు రాష్ట్ర కార్యాలయంలో పావులు కదుపుతు న్నారు. అయితే గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో సదరు అధికారి అంటకాగారు. ఆత్మకూరు నియోజకవర్గంలో పనిచేస్తూ వైసీపీ నేతలకు చెరువుల్లోని మట్టిని దోచిపెట్టారు. లేఅవుట్లకు ఇరిగేషన్ కాలువలను ధారాదత్తం చేశారు. వీటిపై మంత్రి ఆనం ఇటీవల జరిగిన సమావేశంలో సదరు అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లేఅవుట్లపై విచారణకు కూడా ఆదేశిం చారు. ఇలాంటి అధికారికి కీలకమైన నెల్లూరు డివిజన్‌లో పోస్టింగ్ ఇవ్వడంపై రాష్ట్ర ఉన్నతాధికా రులు కూడా ఆలోచనలో పడ్డారు. కానీ కొందరు టీడీపీ ముఖ్యనేతలు మాత్రం సదరు అధికారికి ఎలాగైనా పోస్టింగ్ ఇప్పించాలని తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.



● ఆగ్రహిస్తున్న అన్నదాతలు

పెన్నా డెల్టా పరిధిలో నెల్లూరు సెంట్రల్ డివిజన్ ఎంతో ముఖ్యమైంది. ఈ డివిజన్ కింద సుమారు మూడు లక్షల ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. నెల్లూరు, బుచ్చి, కనుపూరు కాలువ సబ్ డివిజన్లు ఉన్నాయి. అందులోనూ నెల్లూరు సబ్‌డివిజన్ ప్రధానమైనది. ఈ సబ్ డివిజన్ కింద అధికారిక, అనధికారిక ఆయకట్టు సుమారు లక్ష ఎకరాలకు పైగా ఉంది. అందులోనూ సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని ముత్తుకూరు, వెంకటాచలం, టీపీ గూడూరు మండలాల్లో సుమారు 65 వేల ఎకరాలు, కోవూరు నియోజకవర్గ పరిధి ఇందుకూరుపేట మండలంలో 20 వేల ఎకరాలు, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సుమారు 15 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ డివిజన్‌లో పనిచేసే అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండాలి. అలాంటి నెల్లూరు సబ్‌డివిజన్ డీఈ పోస్టు కోసం ప్రస్తుతం ఆత్మకూరు నియోజక వర్గంలో పనిచేస్తున్న ఓ అధికారి తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే సర్వేపల్లి, కోవూరు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేల వద్ద నుంచి లెటర్లు కూడా పొందినట్లు తెలు స్తోంది. వాస్తవానికి ఈ అధికారిపై ఆ ఎమ్మెల్యేలకు మంచి అభిప్రాయం లేకపో యినా ఓ నాయకుడి ఒత్తిడితో లెటర్లు ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారు. ఈ లెటర్ల ద్వారా తనకు పోస్టింగ్ ఇవ్వాలంటూ ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు సదరు అధికారి దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న డెల్టా రైతాంగం భగ్గుమంటోంది. తమను కార్యాలయంలోకి కూడా రానివ్వని అధికారిని మళ్లీ ఎలా తీసుకొస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై మండల స్థాయి నాయకులు ఆయా ఎమ్మెల్యేల వద్ద పంచాయితీ పెట్టారు. తాము ఆ అధికారి చేత పని చేయించుకో లేమని, రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని మొరపెట్టుకుంటున్నారు. ఇప్పటికే నెల్లూరు సెంట్రల్ డివిజన్ భ్రష్టుపట్టి పోయిందని, దాన్ని చక్కదిద్దాల్సిందిపోయి మళ్లీ అక్కడి వివాదాస్పదుడిని తీసుకొస్తే భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు వస్తాయని అంటున్నారు.

● గతంలోనే ఆరోపణలు

ఈ అధికారి 2014లో నెల్లూరు డీఈగా పనిచేశారు. నాడు అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారు. పోతిరెడ్డిపాలెం వద్ద పెన్నా నది నుంచి ఇసుకను అమ్మేశారని ఫిర్యాదులు రావడంతో ఆ విషయమై విచారణ కూడా జరిగింది. అలానే సర్వేపల్లి రిజర్వాయర్ రివిట్‌మెంట్ పనుల్లో రూ.4 మేర అవినీతి జరిగినట్లు నాడు ఫిర్యాదులు అందాయి. ఇదే అధికారి కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులను బినామీలుగా పెట్టుకొని వారిని నీటి సంఘాల ప్రతినిధులుగా పేర్కొంటూ ఇందుకూరుపేట, టీపీగూడూరు మండలాల్లో నామినేషన్ వర్కులు కట్టబెట్టారు. చివరకు పనులు నాసిరకంగా చేయడంతో రైతులు ప్రశ్నించిన తరుణంలో అసలు నిజాలు బయటపడ్డాయి. నెల్లూరు నగరంలో పలు బ్రిడ్జిల నిర్మాణాలు ఈ అధికారి సమయంలో జరగ్గా, చాలా వరకూ నాసిరకంగా జరిగాయని ఫిర్యాదులు ఉన్నాయి. స్టోన్‌హౌస్‌పేట వద్ద పనులు చేస్తుండగా ఓ బ్రిడ్జి కూలిపోవడం అప్పట్లో ఇరిగేషన్ అధికారుల అవినీతిని బయటపెట్టింది. ఈ అధికారి తనకున్న పలుకుబడితో అనేక విచారణలను ఆపుకోగలిగారని చెప్పుకుంటున్నారు. అయితే గత టీడీపీ ప్రభుత్వంలోనే ఈ అధికారి అవినీతి నిజమని తేల్చి రూ.3.35 లక్షల రికవరీకి నాడు జీవో విడుదల కావడం ఇరిగేషన్ శాఖలో సంచలనంగా మారింది. నాడు రైతులను తీవ్రంగా ఇబ్బందులు పెట్టడంతో వారంతా సదరు ఆ అధికారి అవినీతిని ఆధారాలతో సహా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం అప్పుడు ఆ అధికారిని నెల్లూరు నుంచి బదిలీ చేసింది.

కదలని విద్యుత్ వాహనాలు

- ఐదేళ్లకే ఈవీల మరమ్మతులు
- వదిలేసిన విద్యుత్ అధికారులు
- మళ్లీ అద్దె కార్లే దిక్కు
- సంస్థపై ఆర్థికభారం

నెల్లూరు (జడ్పీ), జూలై 28: పెట్రోల్ వాడకాన్ని పూర్తిగా తగ్గించడంతోపాటు కాలుష్య నియంత్రణ ఉంటుందని తొలుత ప్రభుత్వ అధికారులకు ఎలక్ట్రికల్ వాహనాల (ఈవీ)ను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా కరెంటు కార్ల వినియోగాన్ని పెంచాలన్న ప్రభుత్వాల లక్ష్యం కూడా తోడైంది. ఈ క్రమంలో జిల్లాలోని విద్యుత్ శాఖకు అంద చేసిన కరెంటు కార్లు ఐదేళ్ల తిరక్కముందే మూలపడ్డాయి. దీంతో విద్యుత్ శాఖాధికారులు ప్రస్తుతం వాహనాల్లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో లాగా అద్దె కార్లను వినియోగిస్తున్నారు.



● ఐదేళ్లకే మరమ్మతులు

జిల్లాలో మొదటగా కరెంటు వాహనాల వినియోగాన్ని ప్రయోగాత్మకంగా విద్యుత్‌శాఖ ప్రారంభించింది. 2019 ఏప్రిల్‌లో 14 ఈవీలను విద్యుత్‌శాఖ కొనుగోలు చేసింది. ఆ శాఖలోని అధికారులకు సంస్థ ద్వారా వాహనాలను ఏర్పాటు చేయాల్సి ఉండడంతో ఎక్కువగా బాడుగ కార్లను ఏర్పాటు చేస్తున్నందున ఆర్థికభారం పడేది. దీంతో కరెంటు వాహనాలు కొనుగోలు చేస్తే పెట్రోల్ ఆదాతోపాటు నెలవారీ ఈఎంఐల ద్వారా వాహన కొనుగోలు చేయవచ్చని 14 వాహనాలను కొనుగోలు చేసి అధికారులకు అప్పగించింది. వీటికి అధికారులు నెలకు రూ.25 వేల చొప్పున ఐదేళ్లపాటు ఈఎంఐలు చెల్లిస్తూ వచ్చారు. అయితే వాహనాల మరమ్మతులకు ఐదేళ్లపాటు కార్ల తయారీ సంస్థ వారంటీ ఇచ్చింది. ఓసారి చార్జింగ్ చేస్తే 120 నుంచి 130 కిలోమీటర్ల ప్రయాణం చేయవచ్చని సంస్థ పేర్కొంది. దీంతో ఆ కార్ల నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తిరిగేందుకు వినియోగించుకోవచ్చని అధికారులు భావించారు. అయితే తొలి రెండు, మూడేళ్ల పెద్దగా మరమ్మతులకు గురికాలేదు. ఆతర్వాత మరమ్మతులతోపాటు బ్యాటరీ చార్జింగ్ పడిపోయింది. ఓసారి చార్జింగ్ చేస్తే కేవలం 40 నుంచి 50 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణించే అవకాశం ఉంటుండడంతో గత రెండేళ్లుగా అధికారులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఐదేళ్ల వారంటీ సర్వీసు పూర్తికావడంతో కార్ల తయారీ సంస్థ బాధ్యతల నుంచి తప్పుకుంది. దీంతో మరమ్మతుల భారం అధికారులు మోయలేక, ఎక్కువ దూరం ప్రయాణం చేసే వీలులేక ఆ వాహనాలను తాము వినియోగించుకోలేమంటూ స్థానికంగా ఉన్న కార్ల కంపెనీకి తరలించారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులకు వేరే వాహనాలను ఏర్పాటు చేశారు. కరెంటు కార్లు ఉపయోగపడక పోవడంతో మళ్లీ అద్దె కార్లను వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా కరెంటు కార్ల వల్ల తమ సంస్థపై అదనపు భారం పడిందని విద్యుత్ శాఖాధికారులు వాపోతున్నారు.

ఫోర్జరీ సంతకాల కేసులో పోలీసుల అదుపులో శివకృష్ణ ?

నెల్లూరు(క్రైం), జూలై 28: నెల్లూరు నగరపాలక సంస్థలో పూర్వపు కమిషనర్ సంతకాల ఫోర్జరీ కేసులో మేయర్ భర్త జయవర్ధన్ అనుచరుడు, నిందుతుడయిన శివకృష్ణను శనివారం రాత్రి హైదరాబాద్‌లో పోలీసులు అదుపులోకి తీసుకొని నెల్లూరుకు తరలించినట్లు సమాచారం. అప్పటి ఎన్ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ ఫిర్యాదు మేరకు నగర మేయర్ భర్త జయవర్ధన్‌తోపాటు ఆరుగురిపై దర్గా మిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులంతా పరారీలో ఉండటంతో పోలీసులు వారి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో శని వారం అర్ధరాత్రి హైదరాబాద్‌లో శివకృష్ణను అదుపులోకి తీసుకుని నెల్లూరుకు తీసుకువచ్చి నట్లు తెలిసింది. ఫోర్జరీ కేసులో ఇంకెంతమంది ప్రమేయం ఉందన్న విషయంపై శివకృష్ణ ను పోలీసు అధికారులు రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించడం లేదు.

పాఠాలు పూర్తికాకనే పరీక్షలా ?

- సిలబస్ చెప్పకుండానే ఫార్మెటివ్-1 ఎగ్జామ్స్
- గత ప్రభుత్వ నిర్లక్ష్యం.. ఆలస్యంగా అందిన పుస్తకాలు
- విద్యార్థులకు తప్పని కష్టాలు
- భయాందోళనలో టీచర్లు

పొదలకూరు, జూలై 28: ఒక్కపక్క పాఠ్యపుస్తకాలు సకాలంలో అందక, టీచ్ టూల్ శిక్షణతో సిలబస్ పూర్తికాక సతమతమవుతుంటే.. మరో పక్క ఆగస్టు ఒకటి నుంచి ఫార్మెటివ్-1 పరీక్షలు నిర్వహించాల్సిందేనని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ హయాంలో సకాలంలో ముద్రణకు ఇవ్వకపోవడంతో పాఠ్యపుస్తకాల రాక ఆలస్యమైంది. జూన్ రెండో వారంలో పాఠశాలలు పునఃప్రారంభం కాగా అందుబాటులో ఉన్న పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు ఇచ్చారు. తర్వాత వచ్చిన పుస్తకాలను ఇప్పటివరకు పంపిణీ చేస్తూనే ఉన్నారు. దీనివల్ల సిలబస్ సకాలంలో పూర్తి చేయలేకపోయారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా, పరీక్షల షెడ్యూల్‌ను మార్చేందుకు అంగీకరించడం లేదని ఉపాధ్యాయులు వాపోయారు. సిలబస్ పూర్తికాకుండానే పరీక్షలను నిర్వహించడం సరికాదని.. కనీసం పది, పదిహేను రనోజులు వాయిదా వేయాలని వారు కోరుతున్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఆగస్టు ఒకటి నుంచి 3వతేదీ వరకు ఫార్మెటివ్-1 పరీక్షల నిర్వహణకు ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు బోధనలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై శిక్షా సప్తాహ కార్యక్రమం పేరుతో 'టీచ్ టూల్' పేరిట ఉపాధ్యాయులకు వారంపాటు శిక్షణ ఇస్తున్నారు. సిలబస్ సకాలంలో పూర్తికాక పిల్లలు పరీక్షలు సరిగా రాయకపోతే మార్కులు రావు. వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నందున ఉన్నతాధికారులు పరిశీలిస్తారు. ఫలితాలు బాగా లేకపోతే మెమోలిస్తారని ఉపాధ్యాయులు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే పరీక్షలను కొద్ది రోజులు వాయిదా వేయాలని వారు కోరుతున్నారు.

స్త్రీనిధి రుణ పరిమితి పెంపు

- రూ. 3.5 నుంచి రూ.5 లక్షల వరకు పెంచుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయం
- ఉపాధి అవకాశాల మెరుగుకు దోహదం
- డ్వాక్రా సంఘాల సభ్యుల హర్షం

సంగం, జూలై 28: స్వయం సహాయక సంఘాల్లోని మహిళల సాధికారతకు ఎన్డీఏ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వారి ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచాలనే ఉద్దేశంతో గతంలో కంటే మరింతగా రుణ సాయాన్ని పెంచింది. స్త్రీనిధి రుణ పరిమితిని సంఘానికి రూ. 3 లక్షల నుంచి రూ. 5లక్షలకు పెంచింది. దీంతో డ్వాక్రా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు లింకేజీతో సంబంధం లేకుండా ఉపాధి మార్గాలను ఇంకా మెరుగుపరుచుకోవడానికి స్త్రీనిధి రుణాలు ఉపకరిస్తాయని వారు భావిస్తున్నారు. వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడానికి బయట అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన అవసరం ఉండదని వారంటున్నారు.

జిల్లాలోని 38 మండలాలు, మున్సిపాలిటీలు, నెల్లూరు కార్పొరేషన్‌లో కలిపి మొత్తం సుమారు 39 వేల డ్వాక్రా సంఘాలు ఉన్నాయి.వీటిల్లో సుమారు 3.36 లక్షల మంది సభ్యులు ఉన్నారు. పది నుంచి 12 మంది సభ్యులు ఒక సంఘంగా, 20 నుంచి 30 సంఘాలను కలిపి ఒక సంఘబంధం చొప్పున, గ్రామంలోని సంఘాలను బట్టీ సంఘబంధాలు ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని సంఘబంధాలను కలిపి మండలస్థాయిలో సంఘమిత్ర, సంఘమిత్రాలన్ని కలిపి జిల్లా వ్యాప్తంగా జిల్లా స్థాయిలో జిల్లా సమాఖ్య ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లా సమాఖ్య పనిచేస్తుంది. ఈ జిల్లా సమాఖ్యకు ప్రభుత్వం గ్రాంటుగా నిధులు సమకూర్చుతుంది. జిల్లా సమైఖ్య ఈ నిధులను సంఘమిత్రలకు విడుదల చేస్తుంది. సంఘమిత్ర సంఘాలకు స్త్రీనిధి పేరుతో రుణాలు మంజూరు చేస్తుంది. సంఘబంధాలకు ఇచ్చే ఈ రుణాల పరిమితిని కూటమి ప్రభుత్వం పెంచింది.

● స్త్రీనిధి రూ. 3 నుంచి 5 లక్షలకు పెంపు

గతంలో ఒక్కొక్క పొదుపు సంఘానికి రూ. 3లక్షల మాత్రమే స్త్రీనిధి రుణాలు ఇచ్చేవారు. ఇవి చాలక బ్యాంకు నుంచి రుణాలు తీసుకోవాల్సి వచ్చేది. దీన్ని గమనించిన కూటమి ప్రభుత్వం స్త్రీనిధి రుణ పరిమితిని రూ. 5 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. బ్యాంకు లింకేజీతో తీసుకున్న రుణాలకు సభ్యులు చెల్లించే వడ్డీ బ్యాంకులకు చెందుతుంది. అదే స్త్రీనిధి రుణాలకు సభ్యులు చెల్లించే వడ్డీ ఆయా సంఘాలకు, సంఘబంధాలు, సంఘమిత్రలోనే ఉంటుంది. జిల్లా సమాఖ్య తీసుకోదు. దీంతో ఈ వడ్డీ ఆయా సంఘాలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ఉపకరిస్తుంది. టీడీపీ ప్రభుత్వం నగదు రహిత లావాదేవీలు ప్రోత్సహించేలా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమయ్యేలా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా వీవోఏలకు పేటీఎం పరికరాలు అందచేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. వీటి ద్వారా సభ్యులకు నేరుగా రుణం చెల్లించనున్నారు.

మద్యం పాలసీపై విచారణ సాగేనా ?

- గతంలో ఎన్నడూలేని విధానానికి వైసీపీ శ్రీకారం
- ప్రభుత్వ దుకాణాల ఏర్పాటుతో అంతా గోల్‌మాల్
- సిబ్బంది నియామకంలోనూ చేతివాటం
- తక్కువ అద్దె ఉన్న షాపులకు రూ.వేలల్లో చెల్లింపులు
- బార్ల టెండర్లలోనూ సిండికేట్
- ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రకటనపై సర్వత్రా చర్చ

ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతున్నా మద్యం పాలసీల్లో మాత్రం పెద్దగా మార్పులు ఉండేవి కాదు. అయితే గతంలో ఎన్నడూలేని విధంగా గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన మద్యం పాలసీపై పలుఆరోపణలు, మందుబాబుల నుంచి వ్యతిరేకత వచ్చింది. ఈ క్రమంలో తాము అధికారంలోకి వచ్చాక మద్యం పాలసీలో మార్పులు చేస్తామని టీడీపీ కూటమి నేతలు ఎన్నికల సమయంలో వాగ్దానం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో రెండు రోజులపాటు మద్యం పాలసీపై చర్చ కూడా సాగింది. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు వైసీపీ అమలు చేసిన మద్యం పాలసీపై విచారణ చేపడతామని, దోషులను శిక్షిస్తామని అసెంబ్లీలో ప్రకటించారు. దీంతో జిల్లాలోనూ విచారణకు ఆదేశిస్తారా...? అన్న చర్చ జోరుగా సాగుతోంది. కాగా వైసీపీ ప్రభుత్వం హయాంలో జిల్లా ఎక్సైజ్ శాఖలో అధికారిగా ఉన్న వ్యక్తి నాలుగేళ్లపాటు చక్రం తిప్పారన్న ఆరోపణలు అధికంగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో విచారణకు ఆదేశిస్తే మరింతమంది వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. - నెల్లూరు(క్రైం)

నేతలకు కాసుల వర్షం

జగన్ పాలనలో ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసేందుకు అద్దెకు దుకాణాలు కావాలంటూ ప్రకటన విడుదల చేశారు. ఇందుకు అనుగుణంగా ఆయా ప్రాంతాల్లోని రాజకీయ నాయకుల కనుసైగల్లో దుకాణాల కేటాయింపు జరిగింది. తక్కువ అద్దె ఉన్న ప్రాంతాల్లో అధిక అద్దె చెల్లించేలా నాయకులు, అధికారులు కుమ్మక్కై దుకాణాలను ఎంపిక చేశారు. దుకాణాలను అద్దెకు ఇచ్చేవారి నుంచి కూడా భారీగా వసూళ్లకు పాల్పడ్డారు. దుకాణాల్లో సిబ్బంది ఎంపికకు నిర్వహించిన ఇంటర్వ్యూలోనూ స్థానిక నాయకుల సిఫార్సు లేఖలకే ప్రాధన్యమిచ్చారు. ఉద్యోగాల్లో చేరే సమయంలో సదరు ఏజెన్సీ నిర్వాహకులు నిరుద్యోగుల నుంచి రూ.వేలల్లో నగదు వసూలు చేసినట్లు పలువురు పేర్కొన్నారు.

ఇక బార్లు కేటాయింపులోనూ గతంలో ఎప్పుడూ జరగని విధంగా ఆయా నియోజకవర్గాల వైసీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల కనుసైగల్లో ప్రక్రియ సాగింది. బార్లకు కొత్తవారు టెండర్లు వేయనీయకుండా బెదిరింపులకు పాల్పడ్డారు. టెండర్లు వేసే వారు అందరిని ఒక చోట సమావేశ పరిచి, అధిక టెండర్లు వేయకూడదని ఆదేశించారు. ఒక్కో బార్‌లో అధికార పార్టీ నేతలు పార్టనర్‌గా ఉండేలా నాయకులు మధ్యస్థాలు చేశారు. ఇదెక్కడి న్యాయం అని ఎవరైనా ప్రశ్నిస్తే... మమ్మల్ని కాదని నువ్వు ఎలా వ్యాపారం చేస్తావని బెదిరింపు దిగారు. ఇక బార్లలో కూల్‌డ్రింక్ షాపులు, నైట్‌సేల్స్ ఎవరికి ఇవ్వాలి, ఎంతమందికి ఇవ్వాలని కూడా నాయకులే చెప్పడాన్ని మొదటిసారి బార్ల యజమానులు చూశారు. ఇలా అన్నీ సెట్ చేసి ఒక్కో బార్ నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఇక మద్యం దుకాణాలు ఉదయం 11 నుంచి రాత్రి 9 వరకు తెరచి ఉండడం, బార్లు మాత్రం ఉదయం ఆరుకు తెరుచుకుంటే రాత్రి ఒంటి గంట వరకు మూయకపోవడంతో బార్లకు వ్యాపార మార్గాలను ప్రభుత్వమే చూపినట్లు అయింది. ఇక బార్‌లో ఎమ్మార్పీ కంటే రూ.60 నుంచి రూ.150కు పైగా వసూలు చేస్తున్నా పట్టించుకునే వారు కన్పించ లేదు. ఇదెక్కడి న్యాయం అని పత్రికల్లో కథనాలు ప్రచురించి, అధికారులను ప్రశ్నిస్తే వారు ప్రభుత్వానికి చలానా రూపంలో రూ.కోట్లు కడుతున్నారు, అందుకే వారు నచ్చిన ధరకు మద్యం అమ్ముతారని సమాధానం చెప్పారు. ఇక ప్రభుత్వ మద్యం దుకా ణాల్లో, బార్లలో మద్యం కల్తీ గతంలో ఎప్పుడూ జరగని రీతిలో జరిగింది.



పట్టుబడిన మద్యాన్ని పరిశీలిస్తున్న సెబ్ అధికారులు(ఫైల్)

● ఐదేళ్లు నరకం చూసిన మందుబాబులు

వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన మద్యం పాలసీతో మందుబాబులు మద్యం సీసాలు చేత పట్టుకొని నడి రోడ్డుపైకి వచ్చేశారు. నాణ్యమైన మద్యం స్థానంలో పిచ్చి మద్యాన్ని అందుబాటులోకి తేవడంతో దాన్ని సేవించి ఎంతోమంది అనారోగ్యం బారిన పడ్డారు. పలువురు మృత్యువాత కూడా పడ్డారు. వైసీపీ పాలనలో నాయకులు, అధికారులు పుష్కలంగా సంపాదించుకున్నా, మందుబాబులు మాత్రం నరకం అనుభవించారు.

● అందుబాటులో లేని మద్యం

బార్లలో దొరికిన మద్యం ఇప్పటికీ ప్రభుత్వ మద్యం దుకాణాలు, మాల్స్‌లో దొరకడం లేదన్న ఆరోపణలు మందుబాబుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మారినా ఈ పరిస్థితి ఇంకెన్నాళ్లు అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. మరి బార్లకు అన్నీ బ్రాండ్ల మద్యం ఎలా అందుతుందో...? ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఎందుకు అందడం లేదో..? అధికారులే సమాధానాలు చెప్పాలని వారు అడుగుతున్నారు.



దుకాణాలకు కూడా అన్నీ బ్రాండ్లు పంపుతున్నాం

జిల్లాలోని అన్నీ ప్రభుత్వ మద్యం దుకాణాలకు సిబ్బంది ఇచ్చిన ఇండెంట్ ప్రకారం మద్యం సరఫరా చేస్తున్నాం. బార్లకు అందిస్తున్న అన్నీ బ్రాండ్లను కూడా వాటికీ పంపుతున్నాం. అయితే ముందుగా మంచి బ్రాండ్లు ఎక్కువగా సేల్ అవుతుండడంతో స్టాక్ అయిపోతున్నది. అంతేతప్ప బార్లకు, మద్యం దుకాణాలకు వేర్వేరుగా స్టాకు పంపడం లేదు.

- నాగమల్లేశ్వరరెడ్డి, ఎక్సైజ్ ఈఎస్

జిల్లాస్థాయి టెన్నిస్ డబుల్స్ పోటీల ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి టౌన్, జూలై 28: కావలి పట్టణ జేబీ డిగ్రీ కళాశాల డీఆర్ క్రీడా ప్రాంగణంలో ఆదివారం జిల్లా స్థాయి టెన్నిస్ డబుల్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. విశ్రాంత జేబీ అధ్యాపకుడు (హిందీ) బాస్కర్ తన తల్లితండ్రుల జ్ఞాపకార్థం నిర్వహించిన పోటీలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి, విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్రీడా కారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జేబీ క్రీడలకు పుట్టినిల్లని, విశ్వోదయా విద్యాసంస్థల వ్యవస్థాపకుడే దొడ్ల రామచంద్రారెడ్డి టెన్నిస్ క్రీడా కారులని, క్రీడా పోషకులని, ఆయన అందించిన ప్రోత్సాహంతో వందలాది మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించారని డీఆర్ క్రీడాసేవలను స్మరించుకున్నారు. పోటీలు సోమవారంతో ముగుస్తాయని నిర్వాహకులు బా స్కర్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టివెంకటేశ్వర్లు, మన్నవ రవిచంద్ర, కాకి ప్రసాద్, పీడీలు మాల్యాద్రి, పాల్గొన్నారు.

ముగిసిన గంధమహోత్సవం


దర్గాలో ఫాతేహా నిర్వహిస్తున్న భక్తులు

అనంతసాగరం, జూలై 28: మండల కేంద్రం అనంతసాగరంలోని గుంతబజారులో వెలసి ఉన్న హజరత్ కరీముల్లా షాఖాదరీ వారి 131వ గంధమహోత్సవ వేడుకలు ముగిశాయి. ఆదివారం తెల్లవారు జామున ఉర్స్ కార్యక్రమంలో భాగంగా గంధాన్ని ఫకీర్ల వాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించి దర్గాకు చేర్చారు. ఫాతేహా అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. దర్గా ముతావల్లి సలావుద్దీన్, కమిటీ సభ్యులు కరీమొహిద్దీన్, ఖాదర్‌బాషా, మహమ్మద్‌అలీ, కరీముల్లా పర్యవేక్షణలో వేడుకలు జరిగాయి.

గంధమహోత్సవానికి విరాళం

ఉదయగిరి రూరల్, జూలై 28: పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీహజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్‌ఖాదర్‌ఖాన్‌సాహెబ్ ఖాదరీ ఔలియా 219వ గంధమహోత్సవం ఆగస్టు 3న జరగనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదివారం కావలిలోని తన నివాసంలో గంధమహోత్సవ నిర్వాహకులకు రూ.లక్ష విరాళం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏడాది గంధమహోత్సవానికి విరాళం అందజేయడం అనవాయితీ అని, అందులో భాగంగానే ఈ ఏడాది కూడా అందజేశామన్నారు. అనంతరం గంధ మహోత్సవానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు రోజ్‌ధార్ మన్సూర్, కార్యదర్శి ఖాదర్‌బాషా, కావ్య ట్రస్టు ప్రతినిధి సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రధాని కృషి

కావలిటౌన్, జూలై 28: ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం రామ్మూర్తిపేటలోని శక్తి కార్యాలయంలో బీజేపీ నేతలు వీక్షించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సీవీసీ సత్యం మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూలనకు ప్రధాని మోది శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు బ్రహ్మానందం, మందా కిరణ్, సవీంద్ర, తిరుపతిస్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు చింతాల రాజీనామా

కావలిటౌన్, జూలై 28: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింతాల వెంకట్రావు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆదివారం ఆయన రామ్మూర్తిపేటలోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ అనివార్య కారణాలవల్ల రాజీనామా చేస్తున్నానని భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానన్నారు.

ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎస్ యాదవ్

బిట్రగుంట, జూలై 28: ప్రకృతి పరిరక్షణలో ప్రతిఒక్కరు భాగస్వాములై మనతో పాటు ప్రాణకోటిని రక్షించాలని వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ అన్నారు. బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమానికి అధ్యక్షుడు ఎం స్వర్ణన్‌రాజు ఆదివారం శ్రీకారం చుట్టారు. క్రీడామైదానం పచ్చదనంతో నిండే విధంగా పలు రకాల మొక్కలు ప్రతి సభ్యుడు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని అందచేసిన రైల్వే వైద్యులు ప్రభాకర్‌రాజ్ వాకర్స్ అసోసియేషన్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలను అభినందించి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.

వైభవంగా గంగమ్మ కలశ మహోత్సవం


సంగం : కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

సంగం, జూలై 28: స్థానిక నిమ్మతోపు సెంటర్‌లో వెలసి ఉన్న గంగమ్మ జాతరలో భాగంగా ఆదివారం కలిశ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గంగమ్మతల్లికి మైలుతుడుపు కార్యక్రమంతో వేడుకలు ప్రారంభించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద మంత్రోశ్చరణల నడుమ పెన్నానది నుంచి కలిశ జలాలను తీసుకొచ్చి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


నైవేద్యం తీసుకువెళ్తున్న భక్తులు

కొండాపురం జూలై 28: పార్లపల్లిలో పోలేరమ్మకు ఆదివారం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గత రెండువారాలుగా అమ్మ వారికి చద్దినైవేద్యం చెల్లించి మూడవవారం మహిలలు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి నైవేద్యంగాచెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులందరూ పాల్గొన్నారు.

●**సంగం:** మండలంలోని చెన్నవరపాడులో ఆషాడ మాసం సందర్భంగా ఆదివారం నరసాలమ్మదేవి గ్రామ పొంగళ్లను నిర్వహించారు. గ్రామం తూర్పు దిక్కున ఉన్న పొలాల్లో నరసానమ్మ ఆలయం ఉంది. పంట విరామ సమయంలో ఆషాడ మాసంలో ప్రతి ఏటా గ్రామ పొంగళ్లు పొంగిస్తారు. అందులో భాగంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

●**ఉదయగిరి రూరల్:** మండలంలోని దుర్గంపల్లి గ్రామంలో ఆదివారం గ్రామదేవతలైన పోలేరమ్మ, అంకాళమ్మలకు గ్రామస్తులు వైభవంగా పొంగళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్ల సామగ్రితో ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పొంగళ్లు నిర్వహించి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యం చెల్లించడంతో పాటు కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు.

●**వరికుంటపాడు:** మండలంలోని తూర్పురొంపిదొడ్లలో వెలసి ఉన్న శ్రీ మానసాదేవి అమ్మవారి నెల పొంగళ్ల మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని శాకాంబరీదేవి అలంకరణలో ముస్తాబు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగారపమ్మకు పూజలు


నాగారపమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

సంగం: మండలంలోని కోలగట్లలో వెలసి ఉన్న నాగారపమ్మదేవికి ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అనంతరం పూలతో అలంకరించి పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై విచారణ


దాసరిపల్లిలో లబ్ధిదారులను విచారిస్తున్న వీఆర్వో

ఉదయగిరి రూరల్, జూలై 28: మండలంలోని దాసరి పల్లి గ్రామ రోడ్డు సెంటర్‌లో పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలపై ఫిర్యాదులు రావడంతో తహసీల్దారు ఆదేశాల మేరకు ఆదివారం వీఆర్వో వెంకట్ విచారణ చేపట్టారు. సర్వేనెంబర్ 1191లోని 6.60 ఎకరాల విస్తీర్ణంలో 1998లో సుమారు 96 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. ప్రస్తుతం ఆ స్థలాల పక్కనే కావలి-సీతారామపురం 167-బీజీ జాతీయ రహదారి ఏర్పాటు కావడంతో ఆ స్థలాలకు డిమాండ్ పెరిగింది. దీంతో కొందరు లబ్ధిదారులు స్థలాలను చదును చేసి బేస్‌మట్టాలు నిర్మించుకున్నారు. మరికొందరు పట్టాలు పొందిన లబ్ధిదారులు తమ స్థలాలు ఎక్కడున్నాయో చూపించాలంటూ తహసీల్దారుకు ఫిర్యాదు చేయడంతో వీఆర్వో వివరాలు సేకరించారు.

డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

వింజమూరు, జూలై 28: ఉదయగిరి నియోజకవర్గంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల బాధలను చూసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందించి ఉదయగిరి, వింజమూరు సీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ కేంద్రాల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఈప్రాంత ప్రజల తరఫున ఐఫో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబరు రాజేష్‌నాయుడు ఎమ్మెల్యేకు, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన


సబ్‌స్టేషన్ వద్ద నిరసన చేస్తున్న రైతులు

బిట్రగుంట, జూలై 28: వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్ సక్రమంగా అందచేయాలని, లేకపోతే పంట నష్టం జరిగితే విద్యుత్ శాఖ వారు భరించాల్సి ఉంటుందని రైతులు హెచ్చరించారు. విద్యుత్ కోతలకు నిరసనగా బోగోలు, సీఎల్‌పురం, ఏకే కండ్రిక, చెన్నారెడ్డిపాలెం, కొత్తూరు గ్రామాల రైతులు చెంచులక్ష్మీ పురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరచూ విద్యుత్ కోతలు, అంతరాయం వలన పంటకు నీరు సక్రమంగా అందడంలేదని, నీరు లేక వేరుశనగ పంట ఎండిపోతోందని, రైతులకు ఇస్తున్న విద్యుత్ పేరుకు ఏడుగంటలని, కానీ మూడుగంటలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి సక్రమంగా విద్యుత్ సరఫరా చేసి పంట నష్టపోకుండా చూడాలని రైతులు కోరారు.

సైన్స్‌పై విస్తృత ప్రచారం


మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

వరికుంటపాడు, జూలై 28: ప్రస్తుత సమాజంలో సైన్స్‌పై విస్తృతంగా ప్రచారం చేపట్టడంలో జేవీవీ కీలక పాత్ర పోషిస్తుందని ఆ శాఖ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కుమ్మిత శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆదివారం మండలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన జాతీయ మహాసభలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అందులో భాగంగా ప్రతి మూడు నెలలకు గ్రామాల్లో రక్తదాన శిబిరాలను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు పీ చెన్నకేశవులు, పీఎం చలం, సీనియర్ నాయకులు ఎం సుబ్బారావు, వెంకటసుబ్బయ్య, మాలకొండయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఘనంగా పోలేరమ్మకు పొంగళ్లు

వరికుంటపాడు: మండలంలోని గణేశ్వరాపురంలో ఆదివారం భక్తులు గ్రామ దేవత పోలేరమ్మతల్లికి ఘనంగా పొంగళ్లు నిర్వహించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో పొంగళ్ల సామగ్రిని ఊరేగింపుగా తీసుకొని వచ్చి ఆలయానికి చేర్చారు. ఆలయ ప్రాంగణంలోనే పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలి : బీజేవైఎం


సమావేశంలో మాట్లాడుతున్న బీజేవైఎం నాయకులు

అనంతసాగరం, జూలై 28: మండలంలోని ముస్తాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న లిటిల్ ఏంజెల్స్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లంపాటి సాంబశివారెడ్డి తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆ పాఠశాలలో చదివే విద్యార్థిని తండ్రి బుజ్జిరెడ్డిపై కరస్పాండెంట్ మల్లికార్జున అకారణంగా దాడిచేసిన ఘటన దారుణమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ముస్తాపురం వద్ద పాఠశాల నిర్వహిస్తుంటే మండల విద్యాశాఖాధికారి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో తెలియడం లేదన్నారు. మార్కులు సక్రమంగా రావడం లేదని ప్రశ్నించినందుకు దాడికి దిగడం సరికాదన్నారు ఈవిషయంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు వల్లూరు రాజేష్‌రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


నగదును అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, జూలై 28: మునిసిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన నలుగురు కుటుంబాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 10,000 వంతున రూ. 40,000లను సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి అందజేశారు. 2వ వార్డు పరిధిలోని షేక్ బీబీ, 12వ వార్డు పరిధిలో ఆత్మకూరు వెంకటమ్మ, 23వ వార్డులో కొమరగిరి పెద్దతిరుపతమ్మ, షేక్ బీబీజాన్ కుటుంబాలను ఆయన పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో తమకు ఆర్థిక సాయం అందజేసిన శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు.

సమస్యలపై తీర్మానాల ఆమోదం


సమావేశంలో పాల్గొన్న జిల్లా కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య

సీతారామపురం, జూలై 28: ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం గుంటూరులోని సమన్వయ సంఘ భవనంలో 16 జిల్లాల రాష్ట్ర కమిటీ మెంబర్లు హాజరై సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదించడం జరిగిందని జిల్లా కుమ్మర శాలివాహన సంఘ అధ్యక్షులు అల్లూరి వెంకటసుబ్బయ్య తెలిపారు. సమావేశంలో కుల వృత్తుల వారికి అన్యాయం జరగకుండా గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 1076ను అన్ని మండలాల్లో అమలు పరచాలని, కుమ్మరి కుల వృత్తి చేసుకునే 50 సంవత్సరాలు దాటిన వారికి ప్రభుత్వ పెన్షన్ మంజూరు చేయాలని పలు తీర్మానాలను ప్రవేశ పెట్టి ఆమోదించడం జరిగిందన్నారు. అలాగే నెల్లూరు జిల్లా పడమటి గూడూరులో ఉన్న సర్వే నెంబర్ 1988లో 46 ఎకరాల భూమిని పింగాణి పరిశ్రమకోసం రాష్ట్ర సంక్షేమ సంఘానికి రిజిస్టర్ చేయటం జరిగింది. కొన్ని అనివార్యకారణాలతో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమీకరించడంలో ఆలస్యమైనందున గత ప్రభుత్వం స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసింది. దానిని మరలా సంక్షేమ సంఘానికి పింగాణి పరిశ్రమ కోసం ఇవ్వాల్సిందిగా తీర్మానించి ఆమోదించడం జరిగిందని ఆయన తెలిపారు.

ధ్యానంతో జ్ఞానం

వింజమూరు, జూలై 28 : వింజమూరులోని శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ధ్యానంతో జ్ఞానం వస్తుందని, ధ్యానమే ముక్తికి మార్గమని తాడిపర్తి సీనియర్ పిరమిడ్ మాస్టర్ విశ్వనాథరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ధ్యానంతో అన్ని రకాల సమస్యల నుంచి విముక్తి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ధ్యానులందరికీ బద్వేల్ మాస్టర్ వెంకటసుబ్బయ్య చక్కటి ధ్యానప్రసాదం అందించారు. అలాగే శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, తిరుపతిరావు, అంకిరెడ్డి, చిన్న, సుబ్బారెడ్డి, విజయ్, విద్యుల్లత, హేమలత, రాజేశ్వరి, సుప్రజ, పార్వతి, పెంచలమ్మ, కృష్ణవేణి, ధ్యానులు పాల్గొన్నారు.

వార్డు సభ్యురాలి మృతికి సంతాపం

కొండాపురం, జూలై 28: మండల పరిధిలోని సాయిపేట పంచాయతీ 8వ వార్డు సభ్యురాలు మార్నేని పిచ్చమ్మ (75) ఆదివారం మృతిచెందింది. దీంతో గ్రామ, మండల టీడీపీ నేతలు ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

మోటారు సైకిళ్ల చోరీలతో ప్రజలు బెంబేలు

కందుకూరు, జూలై 28: కందుకూరు పట్టణంలో ఇటీవలి కాలంలో మోటారుసైకిళ్ల దొంగతనాలు ప్రారంభకావటంతో వాహన యజమానులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్నేళ్లుగా పట్టణంలో మోటారుసైకిళ్ల దొంగల జాడ లేకపోవటంతో వాహనదారులు ప్రశాంతంగా ఉన్నారు. అయితే పదిరోజుల వ్యవధిలో మూడు ప్రాంతాలలో వాహనాల చోరీ జరగటంతో పట్టణంలో వాహనాల దొంగలు ప్రవేశించార ని అర్థమవుతున్నదని ద్విచక్రవాహన యజమానులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని జనార్దనకాలనీ మూడవ లైనులో ఆదివారం ఉదయం 11గంటల సమయంలో పట్టపగలే హోండా యాక్టివా స్కూటీ దొంగలించబడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనాల వినియోగం విపరీతంగా పెరగటంతో వివిధ పనులపై వచ్చేవారు వాహనాలను రోడ్లపైనే పార్కింగ్‌చేసి బ్యాంకులు, షాపింగ్, ఇతర పనుల కోసం వెళ్లటం పరిపాటి. కాగా, ఇలా పట్టపగలే వాహనాల దొంగలు చెలరేగిపోతుంటే ఇక రక్షణ ఎలా ఉంటుందని వాపోతున్నారు. ఏ వాహనం కొనాలన్నా లక్షల్లో ఉన్న తరుణంలో వాహనం అపహరణకు గురైతే సామాన్యుల పరిస్థితి అగమ్యగోచరమని, పోలీసులు స్పందించి వాహనాల దొంగలపై దృష్టిపెట్టి వారి ఆటకట్టించాలని కోరుకుంటున్నారు.

భగవద్గీతను పాఠ్యాంశాల్లో చేర్చాలి


భగవద్గీత పుస్తకాలను అందజేస్తున్న షేక్ నజీర్‌బాషా

ఆత్మకూరు, జూలై 28: గీతా వైభవమే భారత వైభవం, భగవద్గీతలోని సారాంశం ప్రజలందరూ తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని గీతా వైభవ్ ట్రస్ట్ నిర్వాహకులు షేక్ నజీర్ బాష తెలిపారు. ఆదివారం స్థానిక షిర్డిసాయి పిరమిడ్ కేంద్రంలో భగవద్గీత పారాయణము, ప్రవచనము, ధ్యాన- జ్ఞాన శిక్షణ తరగతులు, సజ్జన సాంగత్యం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితంలో భగవద్గీత అవసరం చాలా ఉందని, విద్యార్థి దశనుంచే దాని గొప్పతనం తెలియజేయాల్సి ఉందని, అందుకు పాలకులు భగవద్గీతను పాఠ్యాంశాలలో చేర్చాల్సి ఉందన్నారు. ఇంటింట భగవద్గీత అనే కార్యక్రమాన్ని ధ్యాన సాధకులు ముందుకు తీసుకెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం కృష్ణ భక్తులకు, ధ్యానసాధకులకు శ్రీమద్భగవద్గీత పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్లు డాక్టర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం, చంద్రా విజయ, గీతా వైభవ్ ట్రస్ట్ సభ్యులు సుష్మ పాల్గొన్నారు.

విద్యార్థి దశ మధురమైంది : ఎమ్మెల్యే దగుమాటి

కావలిటౌన్, జూలై 29: ప్రతిఒక్కరి జీవితంలో విద్యార్థి దశ మధురమైనదని ఎమ్మెల్యే డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బృందా హోటల్‌లో జేబీ డిగ్రీ కళాశాలలో 1987లో బీకాం చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్న కార్యక్రమంలో స్నేహితులు వారిని సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్నేహితుల సహకారంతో విద్యార్థి సంఘం నాయకుడుగా పనిచేశానని అన్నారు. కాగా, కలిసి చదువుకున్న స్నేహితుడు ఎమ్మెల్యేగా గెలవడం సంతోషంగా ఉందని, కావలి అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు.

దివ్యాంగులను కించపరిచిన ఐఏఎస్ అధికారిపై చర్యలు తీసుకోవాలి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మండవ

కావలి టౌన్, జూలై 28: దివ్యాంగుల మనోభావాలను కించపరిచే విధంగా వ్యాఖ్యానించిన తెలంగాణా ఐఏఎస్ అధికారిణి స్మితసబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ దివ్యాం గుల విభాగం రాష్ట్ర ఉపా. ధ్యక్షుడు మండవ వెంకట్రావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని దివ్యాంగుల కాలనీలో విలేకర్ల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు సామర్థ్యం లేదని వ్యాఖ్యానించడం సిగ్గుచేటని, కీలక పదవిలోనున్న ఐఏఎస్ అధికారిణి అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర నాయకులు శైలేష్, అమిరిశెట్టి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడాలి


మాట్లాడుతున్న తాళ్లూరు మాల్యాద్రి

కావలిటౌన్, జూలై 28: వ్యవసాయ రంగాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాళ్ళూరు మాల్యాద్రి పేర్కొన్నారు. ఆదివారం పట్టణ కసాయి వీధిలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 30, 31 తేదీలలో కావలి పట్టణ సీపీఎం కార్యాలయంలో రెండురోజులపాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగుతులు జరగనున్నట్లు తెలిపారు. పై కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి వి వెంకటేశ్వర్లు పాల్గొంటారని కార్మిక సంఘానికి సంబంధించినవారందరూ పాల్గొని శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ. 2లక్షల50వేల కోట్లు కేటాయించాలన్నారు. పట్టణంలోని పేద కూలీలకు కూడా ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

చిన్ననాటి గురువుకు పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం


గురువుకు ఆర్థిక సాయం అందిస్తున్న సాదనాల మనోహర్‌నాయుడు

జలదంకి, జూలై 28: ఒకటి నుండి ఐదో తరగతి వరకు విద్యను నేర్పిన గురువు మదార్‌బాషా ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడని తెలిసి జలదంకి మండలం బికె అగ్రహారం పూర్వ విద్యార్థులు రూ. 52,500 ఆర్థిక సాయం అందించారు. కావలి పట్టణం వెంగళరావు నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న గురువును ఆదివారం కలుసుకుని ఆర్థిక సాయం అందించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోగోలు మండలం అక్కరాజుకండ్రిగ ఎంకె స్కూల్ కరస్పాండెంట్ సాదనాల మనోహర్‌నాయుడు, కలవకూరి క్రిష్ణ, లింగంగుంట వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్, మట్టి తరలింపు


ట్రాక్టర్లతో బోగోలు చెరువులో మట్టి తరలిస్తున్న అక్రమార్కులు

బిట్రగుంట, జూలై 28: బోగోలు మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో గ్రావెల్, మట్టి, తువ్వఇసుక తరలింపు యధేచ్ఛగా కొనసాగుతోంది. ప్రధానంగా బోగోలు, కప్పరాళ్ళ తిప్ప, అల్లిమడుగు, ఉమా మహేశ్వరపురం గ్రామాల్లో అడు అపు లేకుండా కొనసాగిస్తున్నారు. తిప్ప తహ సీల్దారు కార్యాలయానికి వెనుక కొద్ది దూరంలో గతంలో వైసీపీ నేతలు తవ్విన ప్రదేశాల్లో మరలా తవ్వకాలు జోరుగా సాగిస్తున్నారు. శనివారం కొన్ని చోట్ల అక్రమ తవ్వకాలు జరుపుతుంటే అధికారులు, స్థానికులు అడ్డుకోవడం జరిగింది. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్గంధం వెదజల్లుతున్న మురుగు కాలువలు


పెదపవని ముస్లిం కాలనీలో మురుగు కాలువ

లింగసముద్రం, జూలై 28: మండలంలోని పెదపవని ముస్లిం కాలనీలోని మురుగు కాలువలు దుర్గంధం వెదజల్లుతుండడంతో అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలోని మురుగు కాలువల్లో మురుగునీరు పారుదలలేక నిలువ ఉండి దోమలకు నివాసాలుగా మారాయి. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.